మంగళవారం
11-2-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 141
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Hyderabad,Vijayawada, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

స్వదేశం చేరుకున్న థాయ్ బందీలు

బ్యాంకాక్: దాదాపుగా 500 రోజులపాటు హమాస్ చెరలో ఉన్న థాయ్‌లాండ్ వ్యవసాయ కార్మికులు స్వదేశానికి చేరుకున్నారు. 2023 అక్టోబర్లో జరిగిన దాడుల్లో దక్షిణ ఇజ్రాయిల్‌లో పనిచేస్తున్న పొంగ్సాక్ థేన్నా, సతియాన్ సువన్నాఖమ్, వాచరా శ్రీవూన్, బన్నావత్ సేథావో, సురసాక్ లామ్నావోలను కూడా హమాస్ అపహరించింది. ఎట్టకేలకు వారు ఆదివారం ఉదయం బ్యాంకాక్‌కు చేరకున్నారు. సువర్ణభూమి ఎయిర్‌పోర్టులో దిగిన ఐదుగురు కుటుంబాలను కలుసుకోవడంతో విమానాశ్రయంలో భావోద్వేగ వాతావరణ నెలకొంది. కాగా, వారు మళ్లీ తిరిగి ఇజ్రాయెల్‌కు వెళ్లకుండా ఉండేందుకు నెలకు 725 పౌండ్ల వేతనంతో పాటు సుమారు 14,510 పౌండ్లను ఒకేసారి ఇవ్వనున్నట్లు థాయ్ కార్మిక మంత్రిత్వ శాఖ తెలిపింది.



చంద్రయాన్-3తో కొత్త ఆవిష్కరణలు

బెంగళూరు: చంద్రయాన్-3 మిషన్‌తో భారత ఖ్యాతి ప్రపంచ నలుదిశలా మారుమోగింది. అప్పగించిన పనిని విజయవంతంగా పూర్తి చేసిన అనంతరం ఈ మిషన్ చంద్రుడిపై నిద్రాణ స్థితిలోకి వెళ్లింది. అయితే... అందులో అమర్చిన పరికరాలు అందిస్తున్న సమాచారంతో ఇస్రో శాస్త్రవేత్తలు కొత్త ఆవిష్కరణల దిశగా ముందడుగు వేస్తున్నారు. ఈ మిషన్‌లో భాగంగా విక్రమ్ ల్యాండర్ దిగిన ప్రదేశానికి 'శివశక్తి' అని పేరు పెట్టారు. ఈ ప్రదేశం భూమిపై జీవం ఆవిర్భవించిన నాటికన్నా పురాతనమైనదని ఇస్రో

- మిగతా 2 లో

స్పీకర్ వ్యాఖ్యలకు నిరసనగా నేటి నుంచి మన్యం బంద్

విశాలాంధ్ర బ్యూరో- పాడేరు: రాష్ట్రవ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతం బంద్‌కు అఖిలపక్ష రాజకీయ, ప్రజాసంఘాల, గిరిజన ఐక్యవేదిక పిలుపునిచ్చింది. విశాఖపట్నంలోని ఓ హోటల్‌లో ఇటీవల జరిగిన పర్యాటకరంగ సదస్సులో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ 1/70 చట్టం సవరణ చేస్తేనే ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్న వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం ఉదయం నుంచి బంద్‌కు పిలుపునిచ్చినట్టు జేఏసీ ప్రతినిధులు తెలిపారు. 1/70 చట్టాన్ని సవరించాలన్న

- మిగతా 2 లో

ట్రంప్‌తో భేటీకి ఎదురుచూస్తున్నా

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్రమోదీ తన అమెరికా పర్యటనకు ముందు కీలక సందేశం ఇచ్చారు. ఈ నెల 12, 13 తేదీల్లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మోదీ భేటీ కానున్నారు. ఈ నేపథ్యంలో "నా మిత్రుడు డొనాల్డ్ ట్రంప్‌ని కలవడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నా" అని ఎక్స్‌లో ట్వీట్ చేశారు. ట్రంప్ మొదటి పదవీకాలంలో నిర్మించబడిన ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడాని పర్యటన సహకరిస్తుందని మోదీ అన్నారు. కాగా ప్రధాని మోదీ ముందుగా

- మిగతా 2 లో

ఇదీ లోకం!

సక్సస్, కోటిమందికి ఉపాధి కల్పించలేకపోయాం గానీ సలబై కోట్ల మందితో స్నానాలు చేపించాం!

మృతదేహానికి వైద్యం... మంత్రి ఆగ్రహం

విశాలాంధ్ర-హైదరాబాద్: మియాపూర్ మదీనగూడలోని సిద్ధార్థ్ న్యూరో ఆసుపత్రిలో మృతదేహానికి వైద్యం చేస్తున్నట్టు నటించి డాక్టర్లు డబ్బులు గుంజిన విషయం తెలిసిన రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ ఆసుపత్రి యాజమాన్యంపై మండిపడ్డారు. వివరాల్లోకి వెళితే... కడప జిల్లాకు చెందిన సుహాసిని (26) కళ్లు తిరిగి పడిపోవడంతో నెల రోజుల క్రితం సిద్దార్థ్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పేరుతో అక్కడి డాక్టర్లు రూ.లక్షల్లో బాధితురాలి కుటుంబ సభ్యుల నుంచి వసూలు చేశారు. ఇంకా డబ్బు తేవాలని డాక్టర్లు అడుగుతూనే ఉన్నారు. చివరికి డబ్బులు కట్టలేని స్థితిలో లేరని గ్రహించి నిమ్స్‌కు తీసుకెళ్లండి అని డాక్టర్లు సూచించారు. తీరా నిమ్స్‌కు తరలించగా, ఆమె అప్పటికే మృతి చెందిందని డాక్టర్లు నిర్ధారించారు. దీంతో ఆ మహిళ చనిపోయి మూడు రోజులైనా సిద్దార్థ న్యూరో హాస్పిటల్ డాక్టర్లు అక్కడే మృతదేహాన్ని ఉంచి వైద్యం చేసినట్లు నటించి తమ వద్ద భారీ మొత్తంలో డబ్బును వసూలు చేశారని గ్రహించిన సుహాసిని కుటుంబీకులు రెండు రోజుల క్రితం ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. మూడు రోజుల క్రితమే చనిపోయినా తమకు సమాచారం ఇవ్వకుండా వైద్యం పేరుతో డ్రామాలాడారని బాధితులు వాపోయారు. ఈ విషయం తెలిసి మంత్రి దామోదర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై వెంటనే పూర్తి వివరాలు సేకరించాలని అధికారులను ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని హెచ్చరించారు.

డిమాండ్‌కు తగ్గ నాణ్యమైన విద్యుత్

విశాలాంధ్ర-హైదరాబాద్: రాష్ట్రంలో డిమాండ్‌కు అనుగుణంగా నాణ్యమైన విద్యుత్‌ను పంపిణీ సంస్థలు అందిస్తున్నాయని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా 16,000 మెగావాట్లకు చేరువలో విద్యుత్ డిమాండ్ ఉందని...

- మిగతా 2 లో

ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత ఇసుక

- మాఫియాపై ఉక్కుపాదం
- సహకరించే అధికారులపై వేటు
- రీచ్‌ల వద్ద 360 డిగ్రీల కెమెరాలు: రేవంత్‌రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత ఇసుక అందించేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సామాన్యులకు తక్కువ ధరకు ఇసుక లభించేలా చూడాలని సూచించారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని అన్నారు. గనులు, ఖనిజాభివృద్ధి శాఖపై సోమవారం అధికారులతో సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బ్లాక్ మార్కెట్ ను అరికట్టి పేదలకు ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపాలని అధికారులను ఆదేశించారు. ఇసుక రీచ్ ల వద్ద తనిఖీలు చేపట్టాలన్నారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఇసుక రవాణా పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని చెప్పారు. జిల్లాలవారీగా కలెక్టర్లు, ఎస్పీలకు బాధ్యతలు అప్పగించాలని సూచించారు. హైదరాబాద్ పరిసరాల్లో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే బాధ్యత హైడ్రాకు అప్పగించారు. ఇసుక అక్రమ రవాణాపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి ఇసుక రీచ్ ల వద్ద 360 డిగ్రీల కెమెరాలు, సోలార్ లైట్స్ ఏర్పాటు చేయాలన్నారు. స్టాక్ యార్డుల వద్ద కట్టుదిట్టమైన ఫెన్సింగ్ తో పాటు ఎంట్రీ, ఎగ్జిట్ లు ఏర్పాటు చేయాలని సూచించారు. రిజిస్టర్డ్ లారీలను ఎంప్యానెల్ చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇసుక బుక్ చేసిన 48 గంటల్లోగా వినియోగదారుడికి చేర్చాలన్నారు. వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేయాలన్నారు. నిర్ణీత ధరకు మాత్రమే ఇసుక అమ్మకాలు చేపట్టాలన్నారు. ఇసుక రవాణా వాహనాలకు ట్రాకింగ్ సిస్టమ్ ను ఏర్పాటు చేసి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఆన్ లైన్ బుకింగ్ వేళల్లో మార్పు చేయాలన్నారు. అక్రమ రవాణాకు సహక రించే అధికారులపై వేటుతప్పదని హెచ్చరించారు.

రంగరాజన్‌కు సీఎం పరామర్శ

ఇటీవల దాడికి గురైన చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్‌ను సోమవారం సీఎం రేవంత్ ఫోన్ ద్వారా పరామర్శించారు. దాడిని తన దృష్టికి ఎందుకు తీసుకురాలేదన్నారు. ఇలాంటి దాడులను సహించేది లేదని స్పష్టం చేశారు. దాడికి పాల్పడ్డవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను సీఎం ఆదేశించారు. రంగరాజన్ పై దాడి కేసులో పోలీసులు

- మిగతా 2 లో

ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు 18కి వాయిదా

విశాలాంధ్ర-హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు ఈ నెల 18కి వాయిదా వేసింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సుప్రీంలో పిటిషన్ దాఖలు చేయగా సోమవారం విచారణ జరిగింది. జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ వినోద్ చంద్రన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తెలంగాణ స్పీకర్ తరపున ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చాం, తమకు వాదనలు వినిపించేందుకు రెండు మూడు రోజులు సమయం కావాలని కోరారు. దీనిపై అత్యున్నత న్యాయ స్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. పార్లమెంటరీ ప్రక్రియను ఫ్రస్టేషన్‌కు గురి చేయొద్దని చెప్పింది. ప్రజాస్వామ్యంలో పార్టీలకు హక్కులు ఉంటాయి, తగిన సమయం అంటే ఏంటి అని ప్రశ్నించింది. పార్టీ మారి పది నెలలు అవుతుందని, ఇది

- మిగతా 2 లో

50 వేల ఓట్ల మెజార్టీతో గెలిస్తే రాజకీయ సన్యాసం

- అదానీ, అల్లుడి కోసమే కొడంగల్‌లో అరాచకాలు
- సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ధ్వజం

విశాలాంధ్ర - హైదరాబాద్: కుటుంబం, అదానీ, అల్లుడి కోసమే కొడంగల్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అరాచకాలు సృష్టిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తన మనుషులకు రూ. వేల కోట విలువైన భూములను దోచిపెట్టడానికే లగచర్ల రైతులపై అక్రమకేసులు బనాయించారని విమర్శించారు. కొడంగల్‌లో సోమవారం రైతు మహాధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కేటీఆర్ మాట్లాడుతూ... ఎన్నికల హామీలను అమలుచేస్తున్నానని చెప్పుకుంటున్న రేవంత్ రెడ్డి... ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి పట్నం నరేందర్ రెడ్డిపై ఉప ఎన్నికలో పోటీ చేస్తే కొడంగల్ ప్రజలే తీర్పు చెబుతారన్నారు. 50 వేల మెజార్టీకి ఒక్క ఓటు తగ్గినా తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని కేటీఆర్ సవాల్ విసిరారు. 14 నెల పదవీకాలంలో రైతులు, మహిళలు, వృద్ధులు, యువత కోసం ఒక్క పని కూడా చేయలేదని మండిపడ్డారు. ఎకరం రూ.60 - 70 లక్షలు విలువ చేసే భూములకు రూ.10 లక్షలు పరిహారం ఇవ్వడం ఏంటని అడిగినందుకు లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు బనాయించారని దుయ్యబట్టారు. అర్ధరాత్రి పోలీసులను ఊరు మీదికి పంపి లంబాడి ఆడబిడ్డలను రేవంత్ రెడ్డి అవమానించాడని ధ్వజమెత్తారు. కొడంగల్ రైతుల భూ పోరాటానికి బీఆర్ఎస్ అండగా నిలబడిందని స్పష్టం చేశారు.

సొంత భూముల్లో ఫార్మా కంపెనీలు పెట్టాలి

కల్వకుర్తి పక్కన వెల్దండలో తన కున్న సొంత భూముల్లో రేవంత్ రెడ్డి ఫార్మ కంపెనీలు పెట్టాలని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.20 లక్షలకు బీఆర్ఎస్ పార్టీ తరపున మరో రూ. ఐదు లక్షలు కలిపి ఇస్తామన్నారు. దామరగిద్ద తండా రైతుల కోసం కూడా పోరాడుతామని హామీ ఇచ్చారు. రూ.4,350 కోట్లతో కొడంగల్ కు నీళ్లు తెస్తానని రేవంత్ రెడ్డి చెబుతున్నారని, కానీ కాంట్రాక్టర్లకు ఆయన మనుషులకు కమీషన్ ఇవ్వడానికి తప్ప కొడంగల్ ప్రజల కోసం కాదన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో 1,53,000 ఎకరాలకు నీళ్లు ఇచ్చే సొలత్ ని 90శాతం పనులు కేసీఆర్

- మిగతా 2 లో

అమిత్‌షానే రాజీనామా చేయాలి

- బీరేన్‌సింగ్ కీలుబొమ్మ మాత్రమే
- అల్లర్లకు ఆజ్యం పోశారు
- బీజేపీని దుయ్యబట్టిన ప్రతిపక్షాలు
- ప్రధాని మణిపూర్ వెళ్లాలని డిమాండ్

న్యూఢిల్లీ: కొంతకాలంగా బీజేపీ పాలిత మణిపూర్ రాష్ట్రం హింసతో అట్టుడుకుతున్న విషయం తెలిసిందే. డబుల్ ఇంజన్ సర్కారు జాతుల మధ్య వైరాన్ని నివారించడంలో ఘోరంగా విఫలమైందని విమర్శలు వెల్లువెత్తుతున్న క్రమంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ ఆదివారం రాజీనామా చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే సింగ్ రాజీనామాతో ప్రతిపక్షాలు శాంతించలేదు. ఇది నిజమైన దిద్దుబాటు కంటే పతనాన్ని అరికట్టడానికి బీజేపీ చేసిన ప్రయత్నంగా భావిస్తున్నాయి. ఈ విషయమై కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఇతర ప్రతిపక్ష పార్టీలు సోమవారం నరేంద్ర మోదీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించాయి. దాదాపు రెండు సంవత్సరాలుగా జాతుల ఘర్షణతో పెద్ద ఎత్తున ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరగడంతో పాటు వేలాదిమంది ప్రజలు నిరాశ్రయులైనప్పటికీ అల్లర్లను ప్రేరేపించిన బీరేన్‌సింగ్‌ను కొనసాగించడానికి కేంద్రంలోని మోదీ సర్కారు అనుమతించిందని మండిపడ్డాయి. మణిపూర్ సీఎం

- మిగతా 2 లో

'డబుల్ ఇంజన్' ఘోర వైఫల్యం

మోదీ తప్పు అంగీకరించాలి: సీపీఐ

న్యూఢిల్లీ: మణిపూర్‌లో జాతుల ఘర్షణను అదుపులోకి తెచ్చి సాధారణ పరిస్థితులను పునరుద్ధరించడంలో బీజేపీ డబుల్ ఇంజన్ సర్కారు ఘోరంగా వైఫల్యం చెందిందని సీపీఐ జాతీయ సమితి విమర్శించింది. దాదాపు రెండు సంవత్సరాల హింస, గందరగోళం తర్వాత మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్. బీరేన్ సింగ్ రాజీనామా చేయడం ఇందుకు నిదర్శనమని తెలిపింది. సీపీఐతో సహా ప్రతిపక్ష పార్టీలు చాలా కాలంగా ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ బీజేపీ డబుల్ ఇంజన్ సర్కారు సరైన చర్యలు తీసుకోకపోవడం ఎంతోమంది ప్రాణాలను కోల్పోవడం, వేలాది మంది నిరాశ్రయులవ్వడం వంటి పరిణామాలకు దారితీసింది. మణిపూర్ ప్రజలు బీరేన్ సింగ్, బీజేపీ రెండింటిపై పూర్తిగా నమ్మకం

- మిగతా 2 లో

విద్య కాషాయీకరణకు మోదీ యత్నం

- యూజీసీ మార్గదర్శకాలు వెనక్కి తీసుకోవాలి
- ఏఐఎస్ఎఫ్ జాతీయ సదస్సులో దినేశ్ సి రంగరాజ్

విశాలాంధ్ర-హైదరాబాద్: జాతీయ నూతన విద్యావిధానం పేరుతో విద్యను పూర్తిగా తమ ఆధిపత్యంలోకి తీసుకుంటూ... విద్య కాషాయీకరణ, కేంద్రీకరణ, కార్పొరేటీకరణ, వ్యాపారీకరణను ప్రోత్సహించేలా కేంద్రం నిర్ణయాలు తీసుకుంటుందని ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేశ్ సిరంగరాజ్ మండిపడ్డారు. హిమాయత్ నగర్ సత్యానారాయణ రెడ్డి భవన్‌లో ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సమావేశం ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు విరాజ్ దేవాంగ్ అధ్యక్షతన సోమవారం జరిగింది. సింగరాజన్ మాట్లాడుతూ... దేశంలో నూతన విద్యావిధానం పేరుతో వర్సిటీల స్వయం ప్రతిపత్తి దెబ్బతీసే ప్రయత్నం కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చేస్తున్నదని విమర్శించారు. దానిలో భాగమే యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్(యూజీసీ) జారీ చేసిన ముసాయిదా మార్గదర్శకాలని, ఇది ఉన్నత విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తుందన్నారు. ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్నవారినే వర్సిటీల్లో నియమించడానికి తీసుకుంటున్న చర్యలని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్ అజెండా అమలుకు బీజేపీ ప్రయత్నం చేస్తుందన్నారు. కేంద్ర బడ్జెట్లో విద్యారంగానికి కనీసం 10 శాతం

- మిగతా 2 లో

జగన్‌ది వింత వాదన

- అర్హత లేకుండా ప్రతిపక్ష హోదా ఎలా ఇస్తారు?
- సీఎంతో సమానంగా సమయం అడగటం అవివేకం: అయ్యన్నపాత్రుడు విస్మయం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అసెంబ్లీలో ప్రతిపక్ష నేత హోదాపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వింత వాదనలు వినిపిస్తున్నారని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు విస్మయం వ్యక్తం చేశారు. సోమవారం మధ్యాహ్నం దిల్లీ వెళ్లిన ఆయన లోక్‌సభ

- మిగతా 2 లో

24 నుంచి అసెంబ్లీ సమావేశాలు 2లో

సాయుధ పోరాట సేనానులు - 12

గొప్ప పోరాట స్ఫూర్తి, సమకాలీన సామాజిక పరిస్థితులపై అవగాహనఉంటే కొద్ది మంది అయినా తమ వర్గ స్వభావాన్ని విడనాడగలుగుతారు. తెలంగాణ సాయుధ పోరాట సమయంలో భూస్వాముల కుటుంబాల్లో పుట్టిన చాలా మంది తమ భూములను పేదలకు పంచేసి తుపాకీ పట్టుకుని సాయుధ రైతాంగ పోరులో భాగస్వాములయ్యారు.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

24 నుంచి అసెంబ్లీ సమావేశాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్ శాసనసభ, శాసనమండలి సమావేశాల తేదీలు ఖరారు చేస్తూ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. భారత రాజ్యాంగం ఆర్టికల్ 174 (1) కింద 16వ ఆంధ్రప్రదేశ్ శాసనసభ మూడవ సమావేశాలను 2025 ఫిబ్రవరి 24వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ శాసనమండలి 47వ సమావేశాలకు కూడా విడిగా నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ సమావేశాలు అదే రోజు ప్రారంభం కానున్నట్లు శాసనమండలి కార్యదర్శి ప్రసన్న కుమార్ సూర్యదేవర తెలిపారు. తొలిరోజు ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ డాక్టర్ అబ్దుల్ నజీర్ ప్రసంగించనున్నారు.

డిమాండ్‌కు తగ్గ నాణ్యమైన విద్యుత్

(మొదటిపేజీ తరువాయి)

యాసంగి పంటల ప్రభావంతో భారీగా విద్యుత్ డిమాండ్ పెరుగుతుందన్నారు. గత ఏడాది మార్చిలో ఏర్పడిన రికార్డు స్థాయి అత్యధిక డిమాండ్ 15,623 మెగావాట్లు ఉండగా ఈనెల ఏడో తేదీన ఎదుర్కొన్న అత్యధిక డిమాండ్ 15,920 మెగావాట్లు ఉందన్నారు. డిమాండ్ ఎంత పెరిగినా దానికి తగ్గట్టు సరఫరా అందిస్తామని భట్టి స్పష్టం చేశారు. విద్యుత్ సంస్థల అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత ఇసుక

(మొదటిపేజీ తరువాయి)

ఐదుగురిని అరెస్ట్ చేశారు.

రామరాజ్యం పేరుతో దాడులా: మంత్రి శ్రీధర్ బాబు

రామ రాజ్యం పేరుతో దాడులు చేసే వారిని ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. రామరాజ్యం పేరుతో చిలుకూరి బాలాజీ టెంపుల్ ప్రధాన అర్చకుడు రంగరాజన్ పై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఇది హేయమైన చర్య, రామరాజ్యం పేరుతో రౌడీయిజం చేస్తూ అరాచకాలకు పాల్పడుతున్న వారిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. హిందుత్వ భావాన్ని దుర్వినియోగం చేస్తున్న వారి పట్ల పోలీసులు, ప్రజలు, రాజకీయ పార్టీలు అప్రమతంగా ఉండాలన్నారు. ధర్మాన్ని కాపాడుతూ సమాజ హితం కోసం పని చేస్తున్న అర్చకులపై దాడులు అమానుషమన్నారు.

చంద్రయాన్-3తో కొత్త ఆవిష్కరణలు

(మొదటిపేజీ తరువాయి)

శాస్త్రవేత్తలు తాజాగా గుర్తించారు. చంద్రుడి దక్షిణ ధ్రువానికి దగ్గరగా ఉన్న ఆ ప్రాంత తొలి భౌగోళిక పటాన్ని తాజాగా భారత ఫిజికల్ రీసెర్చ్ ల్యాబొరేటరీ బృందం రూపొందించింది. దీన్ని విశ్లేషించిన శాస్త్రవేత్తలు... ఆ ప్రాంతం దాదాపు 3.7 బిలియన్ సంవత్సరాల పూర్వం ఏర్పడిందని అంచనా వేశారు. భూమిపై తొలి జీవ రూపాలు ఆ సమయంలోనే ఆవిర్భవిం చాయి. దీనికి సంబంధించిన అధ్యయనం 'సైన్స్ డైరెక్ట్'లో ప్రచురితమైంది. భౌగోళిక మ్యాపింగ్ అనేది ఓ ప్రాథమిక ప్రక్రియ అని ఆ బృందం పేర్కొంది. ఒక గ్రహం ఉపరితల ఆకృతి ప్రాదేశిక, తాత్కాలిక క్రమాలను అర్థం చేసుకోవడంలో ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని వెల్లడించింది. చంద్రయాన్-3 మిషన్ ఆగస్టు 23, 2023లో చంద్రుడి దక్షిణ ధ్రువంపై విజయవంతంగా దిగిన విషయం తెలిసిందే. భారత వైజ్ఞానిక సత్తాను ఇది ప్రపంచానికి చాటిచెప్పింది.

నేటి నుంచి మన్యం బంద్

(మొదటిపేజీ తరువాయి)

చింతకాయల అయ్యనపాత్రుడు వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరి ప్రకటించాలని, షెడ్యూల్ ప్రాంత 100 శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ నియామక చట్టం చేయాలనీ, ఆదివాసిల కోసం ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించాలని, పాడేరు మెడికల్ కాలేజీలో పోస్టులన్నీ స్థానిక ఆదివాసులతోనే భర్తీ చేయాలని, మన్యంలో చంద్రబాబు ప్రభుత్వం ప్రతిపాదించిన పవర్ ప్రాజెక్టుల ఆలోచనను తక్షణమే విరమించుకోవాలన్న ప్రధాన డిమాండ్లతో మన్యం బంద్ చేపడుతున్నట్లు ప్రకటించారు. కాగా స్పీకర్ వ్యాఖ్యలను నిరసిస్తూ నాటి నుంచి ఏజెన్సీ ప్రాంతం మొత్తం ఆందోళనలు జరుగుతున్నాయి. ఈ అంశంపై గిరిజన ప్రాంతం లోని అధికార కూటమిలోని బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన నేతలు నోరు విప్పలేదు. 48 గంటల బంద్‌కు వారు సహకారం అందిస్తారా లేదా అనేది మంగళవారం తేలిపోనుంది. ప్రతిపక్ష వైఎస్ఆర్ సీపీ సహా వామపక్ష పార్టీలు, గిరిజన, విద్యార్థి, యువజన సంఘాలు బంద్‌కు మద్దతు ప్రకటించాయి.

ట్రంప్‌తో భేటీకి ఎదురుచూస్తున్నా

(మొదటిపేజీ తరువాయి)

మూడు రోజుల పర్యటన కోసం ఫ్రాన్స్ బయలుదేరారు. ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌తో కలిసి ఏఐ యాక్షన్ సమ్మిట్‌లో పాల్గొంటారు. ఆ తర్వాత అక్కడ నుంచి ఆయన అమెరికా వెళ్తారు. ట్రంప్ జనవరిలో అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రధాని మొదటిసారిగా అమెరికా పర్యటనకు వెళ్తున్నారు. "ఫ్రాన్స్ నుండి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆహ్వానం మేరకు నేను రెండు రోజుల అమెరికా పర్యటనకు వెళ్తాను. నా స్నేహితుడు అధ్యక్షుడు ట్రంప్‌ను కలవడానికి నేను ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. జనవరిలో ఆయన చారిత్రాత్మక ఎన్నికల విజయం, పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఇది మా మొదటి సమావేశం అయినప్పటికీ భారతదేశం, అమెరికా మధ్య సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని నిర్మించడంలో ఆయన మొదటి పదవీకాలంలో కలిసి పనిచేయడం నాకు గుర్తుంది" అని తెలిపారు. టెక్నాలజీ, వాణిజ్యం, రక్షణ మరియు శక్తితో సహా కీలక రంగాలలో ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు ఈ పర్యటన మంచి అవకాశంగా ఉంటుందని ప్రధాని మోదీ అన్నారు. వాషింగ్టన్‌లో ట్రంప్‌తో ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించిన తర్వాత అక్కడ వ్యాపారవేత్తలు, ఇండియన్ కమ్యూనిటీతో మోదీ మాట్లాడనున్నారు. సుంకాలు విధిస్తానని, అక్రమ వలసదారుల్ని అమెరికా నుంచి పంపిస్తానని ట్రంప్ హెచ్చరిస్తున్న నేపథ్యంలో, మోదీ పర్యటన కీలకంగా మారింది. కాగా ఇండియా-ఫ్రాన్స్ సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే దిశగా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ తో చర్చలు జరుపుతానని మోదీ వెల్లడించారు. మార్సిల్లేలో కాన్సులేట్ ను కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు.

నాణేల తయారీ నిలిపివేయండి: ట్రంప్

వాషింగ్టన్: రెండోసారి అమెరికా అధ్యక్ష పీఠాన్ని అధిరోహించిన డొనాల్డ్ ట్రంప్ తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. దేశంలో నాణేలను ముద్రించడం ఆపేయాలని అమెరికా ట్రెజరీని ఆదేశించారు. ప్రభుత్వ ఖర్చును తగ్గించుకోవడంలో భాగంగా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. అమెరికా సుదీర్ఘకాలంగా దాని విలువ కంటే రెండింతల అదనపు ఖర్చుతో కాయిన్‌లను ముద్రిస్తున్నదని, ఇది చాలా వృథా వ్యయమని ట్రంప్ వ్యాఖ్యానించారు. 'కొత్త కాయిన్‌లను ముద్రించడం ఆపేయాలని నేను అమెరికా ట్రెజరీకి సంబంధించిన నా సెక్రెటరీకి సూచించాను. కాయిన్ విలువ కంటే దాని ముద్రణ కోసం ప్రభుత్వం చేసే ఖర్చు రెండింతలు అదనంగా ఉంటోంది. దేశ బడ్జెట్ నుంచి వృథాను అరికట్టడం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నాం.' అని ట్రంప్ ఓ ప్రకటనలో తెలిపారు. అయితే అమెరికాలో నాణేల ముద్రణ నిలిపివేయడంపై గతంలో ఎన్నో బిల్లులు అమెరికా కాంగ్రెస్ ముందుకు వచ్చాయి. కానీ అవేవీ కాంగ్రెస్ ఆమోదం పొందలేదు.

ఉక్కు, అల్యూమినియం దిగుమతిపై సుంకాలు

అంతర్జాతీయ వాణిజ్య యుద్ధానికి తెరతీసేలా మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. విదేశాల నుంచి అమెరికాకు దిగుమతయ్యే స్టీల్, అల్యూమినియంపై 25శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు. ఆదివారం న్యూఓర్లియన్స్‌కు వెళ్లే ముందు మీడియాతో మాట్లాడిన ట్రంప్... ఈ మేరకు ప్రకటన చేశారు. మంగళవారం నాటికి వీటిపై పరస్పర సుంకాలను ప్రకటిస్తామని వెల్లడించారు. ఆ తర్వాత అవి వెంటనే అమల్లోకి వస్తాయని స్పష్టం చేశారు. అమెరికా అధికారిక గణాంకాల ప్రకారం.. ట్రంప్ విధించబోయే 25శాతం సుంకం ప్రభావం కెనడా, బ్రెజిల్, మెక్సికో వాణిజ్య రంగంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉన్నట్లు సమాచారం. వీటితో పాటు సౌత్ కొరియా, వియత్నాంలు సైతం భారీ సుంకాన్ని చెల్లించాల్సి ఉంటుంది. కెనడా నుంచి 79శాతం అల్యూమినియం అమెరికాకు ఎగుమతి అవుతుంది. 2024 మొదటి 11 నెలల్లో అమెరికాకు 79 శాతం ఎగుమతి చేసింది. కెనడా తర్వాత అల్యూమినియం స్క్రాప్, అల్యూమినియం మిశ్రమం ప్రధాన సరఫరాదారుగా మెక్సికో కొనసాగుతుంది. ఈ తరుణంలో ట్రంప్ నిర్ణయాలు ఆయా దేశాల వాణిజ్య విభాగంలో ఆటు పోట్లు ఎదురు కానున్నాయి.

హసీనా మద్దతుదారులపై దాడులు...
1300 మంది అరెస్టు

ఢాకా: బంగ్లాదేశ్‌లో యూనస్ సర్కారు ప్రత్యర్థులను వేధించేందుకు సరికొత్త చర్యలు మొదలుపెట్టింది. బంగ్లాదేశ్‌లో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు కావస్తున్న నేపథ్యంలో దేశంలో అస్థిరతను సృష్టించే వారిని లక్ష్యంగా చేసుకుంది. ఈ క్రమంలోనే మాజీ ప్రధాని షేక్ హసీనా మద్దతుదారులపై ఆపరేషన్ డెవిల్స్ హంట్ పేరిట దాడులు దాడులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా దాదాపు 1300 మందిని ఇప్పటికే అరెస్ట్ చేశారు. ఢాకా శివారులోని గాజీపూర్‌లో విద్యార్థులపై దాడి చేసిన వారిని అదుపులోకి తీసుకునేందుకు 'ఆపరేషన్ డెవిల్ హంట్'ను ప్రారంభించినట్లు ఇంటీరియర్ మినిస్ట్రీ అధిపతి జహంగీర్ ఆలమ్ చౌద్రీ చెప్పుకొచ్చారు. 'బంగ్లాదేశ్‌లో విద్యార్థి ఉద్యమం తర్వాత చేపట్టిన దాడులు మరింత పెరిగాయి. వారి ఏరివేతే లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగుతుంది. దుష్టశక్తులను అంతం చేసే వరకు ఇది ఆగదు' అని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా.. ఇటీవల హేక్ హసీనా కుటుంబ భవనాలపై కొందరు దాడులు చేసి ధ్వంసం చేశారు. ఈ క్రమంలో బంగబంధు షేక్ ముజిబుర్ రహ్మాన్ స్మారక భవనంపై దాడి చేశారు. ఈ దాడిలో భవనం పూర్తిగా దెబ్బతిని.. మ్యూజియం కూడా ధ్వంసమైంది. ఈ నేపథ్యంలో ప్రజలు సంయమనంతో వ్యవహరించాలని మహమ్మద్ యూనస్ కూడా విజ్ఞప్తి చేశారు. ఇటీవల ఓ మంత్రిపై దాడికి ఈ గ్యాంగ్‌లే కారణమని సమాచారం.

శిథిల గాజా అతిపెద్ద రియల్ ఎస్టేట్

వాషింగ్టన్: గాజా ప్రాంతాన్ని అతిపెద్ద రియల్‌ఎస్టేట్ సైట్ అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజా వ్యాఖ్యలు చర్చనీయాంశ మయ్యాయి. సూపర్ బౌల్ వీక్షించేందుకు వచ్చిన సందర్భంగా మాట్లా డుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. "గాజాలోకి ప్రజలను తిరిగి అనుమ తించడం అతిపెద్ద తప్పుగా భావిస్తు న్నాను. హమాస్ తిరిగి బలోపేతం కావాలని నేను అనుకోను. గాజాను ఓ పెద్ద రియల్ ఎస్టేట్ సైట్‌గా నేను భావిస్తున్నాను. దానిని అమెరికా స్వాధీనం చేసుకొని.. ఏమాత్రం తొందరలేకుండా.. మెల్లగా అభివృద్ధి చేస్తుంది. అదే సమయంలో పశ్చిమాసియాలో శాంతిని తీసుకొస్తుంది" అని పేర్కొన్నారు. ఆ శిథిల ప్రదేశాన్ని చదును చేసి.. సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఐరాస లెక్కల ప్రకారం ఇజ్రాయెల్ హమాస్‌పై చేపట్టిన యుద్ధం దెబ్బకు దాదాపు 90శాతం మంది గాజా వాసులు ఇళ్లను వదిలి వెళ్లిపోయారు.

అక్రమ వలసలకు ముగింపు పలుకుతాం: బ్రిటన్

లండన్: తమ దేశంలో ఉంటున్న అక్రమ వలసదారుల విషయంలో అమెరికా బాటలోనే బ్రిటన్ పయనించనుంది. సోమ వారం అక్రమ వలసదారుల విష యమై బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ కీలక ప్రకటన చేశారు. 'అక్రమ వలసలకు ఇక ముగింపు పలుకు తాం. బ్రిటన్‌కు అక్రమ వలసలు పెరిగాయి. చాలా మంది అక్రమంగా బ్రిటన్‌కు వచ్చి పనిచేస్తున్నారు'అని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. వాస్తవానికి గతేడాది జులైలో బ్రిటన్‌లో లేబర్ పార్టీ అధికారం లోకి వచ్చినప్పటి నుంచే కీర్ స్టార్మర్ ప్రభుత్వం సరిహద్దు భద్రతపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ క్రమంలోనే ఈ ఏడాది జనవరిలో ఇమ్మిగ్రేషన్ విభాగం అధికారులు వందల మంది అక్రమ వర్కర్లను అరెస్టు చేశారు. వీరంతా చట్టవ్యతిరేకంగా బ్రిటన్‌లోకి అడుగుపెట్టి.. బార్‌లు, రెస్టారెంట్లు, కార్ వాషింగ్ కేంద్రాలు, ఇతర స్టోర్లలో పని చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దాదాపు 828 ప్రాంగణాల్లో తనిఖీలు చేపట్టి.. 609 మందిని అరెస్టు చేశారు. గతేదాది జులై నుంచి ఇప్పటివరకు దాదాపు 4వేల మంది అక్రమ వర్కర్లను అరెస్టు చేసినట్లు యూకే హెూంశాఖ గణాంకాలు పేర్కొన్నాయి. ఉద్యోగాల ఆశ జూపి వీరిని కొన్ని క్రిమినల్ గ్యాంగ్‌లు ప్రమాదకర మార్గాల్లో తీసుకొచ్చినట్లు బ్రిటన్ అధికారులు చెబుతున్నారు.

విద్య కాషాయీకరణకు మోదీ యత్నం

(మొదటిపేజీ తరువాయి)

కేటాయింపులు చేయకుండా, జీడీపీలో ఆరు శాతం నిధులు కేటాయించకుండా వివక్ష చూపుతున్నారని ధ్వజమెత్తారు. వీసీల ఎంపికలో రాష్ట్ర గవర్నర్లకు ఎక్కువ అధికారాన్ని ఇస్తున్నాయని, ఇది అత్యంత ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే యూజీసీ ముసాయిదా మార్గదర్శకాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థుల ఆగ్రహానికి కేంద్రం గురికాక తప్పదని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎస్.ఎ. స్టాలిన్, సంఘమిత్ర జెనా, జాతీయ సహాయ కార్యదర్శులు కె.శివారెడ్డి, కబీర్, హమీమ్ హంజా, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శి కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్, జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, జాతీయ సమితి సభ్యులు గ్యార నరేశ్, బానోత్ రాఘురాం, గ్యార క్రాంతి, నాగజ్యోతి, నాసర్ జీ, వలరాజు, సాయి కుమార్, ప్రీతి పాల్గొన్నారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు 18కి వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

రీజనబుల్ టైం కాదా అని వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టు ప్రకారం రీజనబుల్ టైం అంటే మూడు నెలలే... అంటూ బీఆర్ఎస్ తరపు న్యాయవాది తన వాదనల్ని వినిపించారు. ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు... కేసు విచారణను 18కి వాయిదా వేసింది. కాగా, ఏడుగురు ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్‌పై నిర్ణయం తీసుకోవడంలో తెలంగాణ స్పీకర్ జాప్యం చేస్తున్నారంటూ కేటీఆర్ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. స్పీకర్, ఎమ్మెల్యేలు పి.శ్రీనివాస్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, టి.ప్రకాశ్‌గౌడ్, అరెకపూడి గాంధీ, గూడెం మహిపాల్‌రెడ్డి, ఎం.సంజయ్‌కుమార్‌లను ప్రతివాదులుగా చేర్చారు. జస్టిస్ గవాయ్ ధర్మాసనం సోమవారం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. అసెంబ్లీ కార్యదర్శి తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు.

జగన్‌ది వింత వాదన

(మొదటిపేజీ తరువాయి)

స్పీకర్ ఓం బిర్లాను కలిశారు. సభా నియమాలు, చట్టాలపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 22 నుంచి రెండు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించాలని ఆయనను ఆహ్వానించారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుతో కలిసి అయ్యన్నపాత్రుడు మీడియాతో మాట్లాడారు. జగన్ ప్రతిపక్ష నేత కాదు. ఆ హోదాకు తగిన సంఖ్యా బలం వైసీపీకి లేదనేది జగమెరిగిన సత్యం. కానీ అది జగన్‌కు తెలియకపోవడమే బాధాకరం. చట్టాలు, నిబంధనలు మార్చి జగన్‌కు సమయం ఇవ్వలేం కదా! అని స్పీకర్ అన్నారు. ఆయన ముందు శాసనసభ నియమాలు, చట్టాలు గురించి తెలుసుకోవాలని సూచించారు. అర్హత లేకపోయినా ప్రతిపక్ష హోదా కావాలని అడగడం, ముఖ్యమంత్రికి ఇచ్చినంత సమయం ఆయన మాట్లాడటానికి కూడా ఇవ్వాలని అడగడం, ఆయన ప్యాలెస్‌లో కూర్చొని మీడియాతో మాట్లాడిన వాటికి అసెంబ్లీలో మంత్రులు, సీఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేయడం వింతగా ఉందని అయ్యన్నపాత్రుడు ఎద్దేవా చేశారు. భారతదేశంలో ఎక్కడైనా ఇలాంటిది ఉందా? చట్టాలపై కనీసం అవగాహన ఉండే మాట్లాడుతున్నారా? అని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబుకు ఇచ్చినంత సమయమే తనకూ కావాలంటున్న జగన్ ఏ రూల్ ప్రకారం ఇవ్వాలో చెప్పాలన్నారు. అనుమతి లేకుండా 60 రోజులు అసెంబ్లీకి రాకపోతే చర్యలు తీసుకోవచ్చునన్నారు. ఫలానా కారణం వల్ల సభకు రాలేకపోతున్నానని స్పీకర్‌కు లేఖ ఇవ్వాల్సి ఉంటుందని, సభ్యుల లేఖలో సహేతుక కారణం ఉంటే స్పీకర్ అనుమతి ఇస్తారని తెలిపారు. సభకు రాని సభ్యులు వ్యక్తిగతంగా లేఖలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. వైసీపీలో మిగతా ఎమ్మెల్యేలకు మాట్లాడే అవకాశం జగన్ ఇవ్వాలని, కనీసం వారి నియోజకవర్గాల సమస్యలను చెప్పుకొనే అవకాశం కల్పించాలని సూచించారు. సభకు వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడాలని జగన్, ఆపార్టీ ఎమ్మెల్యేలను కోరుతున్నానన్నారు. అసెంబ్లీ హాజరు జాబితాలో నకిలీ సంతకాలు పెట్టేందుకు కుదరదని స్పీకర్ అయ్యన్న స్పష్టం చేశారు. శాసనసభ్యుల అవగాహన కార్యక్రమానికి 22వ తేదీ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను, రెండో రోజు మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడిని ఆహ్వానించినట్లు స్పీకర్ తెలిపారు.

హైదరాబాద్‌కు నేపాల్ మీడియా ప్రతినిధులు

విశాలాంధ్ర - హైదరాబాద్: విభిన్న రంగాలలో అమలు చేస్తున్న వృద్ధి ప్రాధాన్యతలు, సాధిస్తున్న ప్రగతి, సామాజిక పరిస్థితులు, చారిత్రక, సాంస్కృతిక వైభవంపై సదవగాహన కల్పించి, ఆయా దేశాలతో అనుబంధాన్ని పటిష్ట పరిచేందుకు భారత విదేశీ వ్యవహారాల శాఖ కృషి చేస్తోంది. అందులో భాగంగా పబ్లిక్ డిప్లొమసి, మీడియా అవుట్ రీచ్ కార్యక్రమం కింద విదేశీ మీడియా డెలిగేట్ల పర్యటనలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల ఐదో తేదీ నుంచి 12 మంది నేపాల్ మీడియా బృందం మన దేశంలో పర్యటిస్తున్నారు. నేపాల్ మీడియా బృందంలో సునీల్ ఒలి, బిశ్వాస్ రెగ్మి, సుదర్శన్ సప్కోటా, కమల్ కుమార్ బస్నెట్, సరస్వతి దకల్, సుజిత్ మహత్, రాధ ఖనల్, దిలీప్ పౌడెల్, అమన్ కొయిరాలా, కిరణ్ కుమార్ ఉపాధ్యాయ, నిర్మల్ ఘిమిరే, బిష్ణు ప్రసాద్ జంకాల్ ఉన్నారు. బృందం ఈ నెల 13 వరకు హైదరాబాద్ లో పర్యటిస్తుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ప్రముఖ ఫార్మా కంపెనీ అయిన భారత్ బయోటెక్, మేనేజ్మెంట్ విద్యను అందిస్తున్న ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, రామోజీ ఫిల్మ్ సిటీ, చారిత్రక వైభవ నిలయాలుగా ఉన్న చార్మినార్‌తో పాటు గోల్కొండ కోటను నేపాల్ మీడియా డెలిగేట్లు సందర్శిస్తారు. వారణాసి నుంచి శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి సోమవారం సాయంత్రం చేరుకున్న నేపాల్ మీడియా బృందానికి రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు స్వాగతం పలికారు.

పెద్దిరెడ్డి కుటుంబం ఓ మాఫియా: వర్ల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పెద్దిరెడ్డి కుటుంబం రాష్ట్రంలో ఒక మాఫియాలా తయారై ఆటవిక సామ్రాజ్యాన్ని నిర్మించుకుందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య విమర్శించారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... గతంలో తన అక్రమ సంపాదనతో జగన్‌ను పడగొట్టి తాను ముఖ్యమంత్రి కావాలని కూడా పెద్దిరెడ్డి అనేక సార్లు ప్రయత్నించారని వర్ల ఆరోపించారు. అధికారాన్ని గుప్పెట్లో పెట్టుకొని...గనులు, ఖనిజం, ఇసుక, ప్రభుత్వ స్థలాలు, పేదల, అటవీ భూములు, ఎర్రచందనం, యథేచ్ఛగా దోచుకున్నారని ధ్వజమెత్తారు.

అమిత్‌షానే రాజీనామా చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

బీరేన్ సింగ్ రాజీనామాపై లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందిస్తూ... రెండేళ్లుగా మణిపూర్ లో జాతుల హింసకు బీరేన్ సింగ్ కారణమయ్యారని విమర్శించారు. ప్రధాని మోదీతో కలిసి మణిపూర్ ను విభజించేందుకు కుట్ర చేశారు. మైతేయి, కుకీ తెగల మధ్య చెలరేగిన హింస 250 మంది ప్రాణాలు తీసింది. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. తీవ్రహింస, ప్రాణనష్టం జరుగుతున్నా.. మణిపూర్ సీఎం గా బీరేన్ సింగ్ కొనసాగిస్తూ ప్రధాని మోదీ అల్లర్లకు ఆజ్యం పోశారు. దాదాపు రెండేళ్లపాటు బీరేన్ సింగ్ మణిపూర్ లో విభజన రాజకీయాలు చేశారు. అల్లర్లకు ఆజ్యం పోసిన బీరేన్ సింగ్ ను ప్రధాని మోదీ ప్రోత్సహించారు. ప్రజల ఒత్తిడి, సుప్రీంకోర్టు విచారణ, కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానం భయంతో సీఎం బీరేన్ సింగ్ రాజీనామాకు సిద్ధపడ్డారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. మణిపూర్ లో తక్షణమే శాంతి నెలకొల్పాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. శాంతిని పునరుద్ధరించి మణిపూర్ ప్రజల గాయాలను మాన్పడం తక్షణ ప్రాధాన్యత అన్నారు. ప్రధాని మోదీ వెంటనే మణిపూర్ లో పర్యటించాలన్నారు. ప్రజల గోడును వినాలి. అక్కడ సాధారణ పరిస్థితులు తీసుకురావడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని రాహుల్ గాంధీ సూచించారు.

మణిపూర్ ఇంకా మండుతూనే ఉంది: టీఎంసీ

టీఎంసీ నాయకుడు కీర్తి ఆజాద్ స్పందిస్తూ... "బీరేన్ సింగ్ ముందుగానే రాజీనామా చేసి ఉండాలి. గత రెండేళ్లలో జరిగిన దారుణాలు, అత్యాచారాలు, గృహ దహనాలను వారు ఎలా నిర్లక్ష్యం చేశారో చూస్తే వారు దానిని నియంత్రించ లేకపోయారని స్పష్టమవుతుంది." అన్నారు. మణిపూర్ ఇంకా మండుతోంది. దీనికి బాధ్యులు బీజేపీయేనని వారు తెలుసుకోవాలని ఆయన అన్నారు. శివసేన (యూబీటీ) నాయకుడు సంజయ్ రౌత్ ప్రధానమంత్రిపై విమర్శలు గుప్పించారు. "హింసకు ముఖ్యమంత్రి బాధ్యత వహించాలి. కొన్ని ఆడియోలు వైరల్ అయ్యాయి... ప్రధాని ఇంకా అక్కడికి వెళ్లలేదు" అని ఆయన అన్నారు. శివసేన (యూబీటీ) ఎంపీ ప్రియాంక చతుర్వేది స్పందిస్తూ... ఇది చాలా ఆలస్యం. మణిపూర్ ప్రజలు ఆయన రాజీనా మాను డిమాండ్ చేస్తూ రెండు సంవత్సరాలు గడిచినా... హెూంమంత్రి బీరేన్ సింగ్‌కు మద్దతు ఇవ్వడం కొనసాగించారు. స్వంత పార్టీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటు వేస్తారని భయపడ్డారు. అందుకే ఆయన రాజీనామా చేయాల్సి వచ్చిందని తెలిపారు. ఆర్జేడీ ఎంపీ మనోజ్ కుమార్ ఝా కూడా ఇదే అభిప్రాయం వ్యక్తపర్చారు. సమాజ్ పార్టీ ఎంపీ చంద్ర శేఖర్ ఆజాద్ స్పందిస్తూ... బీరేన్‌సింగ్ రాజీనామా చేయడానికి అనుమతించకూడద న్నారు. 'ఆయన రాజీనామా చేయకూడదు - ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. కేంద్ర ప్రభుత్వం, మోదీ జీ, మహిళల గౌరవం విషయంలో దృఢమైన వైఖరి తీసుకుని ఉంటే, వారిని తొలగించి ఉండేవారని నేను నమ్ముతున్నాను" అని ఆజాద్ అన్నారు. కాగా మణిపూర్‌లో పరిస్థితి దారుణంగా ఉండటానికి కారణం కాంగ్రెస్ పార్టీయేనని బీజేపీ ఎంపీ ప్రతాప్ చంద్ర సారంగి ఆరోపించారు.

ఆలస్యంతో అధిక నష్టం: ఖర్గే



బీజేపీ మణిపూర్ ముఖ్యమంత్రి రాజీనామా... గుర్రం పారిపోయిన తర్వాత అశ్వశాల తలుపు మూసేసిన చందంగా ఉందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొ న్నారు. 21 నెలలుగా మణిపూర్‌లో హింస జరుగుతుంటే... అన్ని వర్గాల ప్రజలను తమను తాము రక్షించుకోవడానికి బీజేపీ ప్రభుత్వం వదిలేసిందన్నారు. 258 మంది మరణించారు, 5,600 పైగా ఆయుధాలు, 6.5 లక్షల రౌండ్ల మందుగుండు సామగ్రి పోలీసు ఆయుధశాలల నుండి దోచుకోబడ్డాయి. 60వేలమందికి పైగా నిరాశ్రయులయ్యారు. వేలాది మంది ఇప్పటికీ సహాయ శిబిరాల్లో నివసిస్తున్నారని తెలిపారు. "జనవరి 2022లో తన చివరి ఎన్నికల ప్రచారం తర్వాత మోదీ జీ మణిపూర్ గడ్డపై అడుగు పెట్టలేదు. అయితే మధ్యలో అనేక విదేశాలను సందర్శించడానికి ఆయనకు సమయం దొరికింది." అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా కూడా ఇలాంటి అభిప్రాయాన్నే వ్యక్తపర్చారు. బీరేన్ సింగ్ నిష్క్రమణను "కాలం చెల్లింది" అని అభివర్ణించారు. మోదీ ప్రభుత్వంపై పదునైన విమర్శలకు పేరుగాంచిన టీఎంసీ నాయకురాలు మహువా మొయిత్రా మోదీపై ఒక్క మాట కూడా మాట్లాడలేదు. '648 రోజుల సిగ్గులేని మొండితనం తర్వాత చివరకు అవిశ్వాసంలో ఓడిపోయే ముందు రాజీనామా చేశారు. మణిపూర్ ప్రజల దుస్థితిపై కేంద్ర ప్రభుత్వాన్ని మేల్కొలపడానికి ఇది మొదటి అడుగు అని ఆశిస్తున్నాను" అని మొయిత్రా 'ఎక్స్'లో రాసుకొచ్చారు. "మణిపూర్ మాజీ ముఖ్యమంత్రి కేవలం కీలుబొమ్మ మాత్రమే. ప్రధానమంత్రి మొత్తం మణిపూర్ సమస్యను హెూంమంత్రి అమిత్‌సాకు అప్పగించారు. రాజీనామా చేయాల్సింది హెూంమంత్రి" అని రమేష్ అన్నారు. కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ స్పందిస్తూ... "ముఖ్యమంత్రిపై కేసు చాలా వివాదాస్పదమైంది. మేము ప్రవేశపెట్టబోయే అవిశ్వాస తీర్మానం ఎదుర్కొనడానికి ఆయన సొంత పార్టీలోనే తగినంత మద్దతు లేదు. ప్రభుత్వం కొంచెం సీరియస్‌గా వ్యవహరించాలని మేము కోరుకుంటున్నాము" అన్నారు.

రాజకీయ సన్యాసం

(మొదటిపేజీ తరువాయి)

హయాంలో పూర్తయ్యాయన్నారు. 10శాతం పనులు పూర్తయితే ప్రజలకు నీళ్లు వస్తాయన్నారు.

అర్చకుడిపై దాడి హేయం

రాష్ట్రంలో పూర్తిగా శాంతిభద్రతలు క్షీణించాయని చెప్పడానికి చిలుకూరు బాలాజీ స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్ పై జరిగిన దాడి నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇలాంటి దారుణానికి ఒడిగట్టిన వారిని అణచివేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టంచేశారు. ఇటీవల దాడికి గురైన అర్చకుడు రంగరాజన్‌ను సోమవారం ఆయన నివాసానికి వెళ్లి కేటీఆర్ పరామర్శించారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం చిలుకూరులో రెండు రోజుల క్రితం కొందరు రంగారాజన్ పై దాడి చేయడం దుర్మార్గమైన చర్య మండిపడ్డారు. భగవంతుని సేవలో నిమగ్నమైన రంగరాజన్ కుటుంబ సభ్యులకే ఇలాంటి పరిస్థితి ఎదురైతే, ఇక సామాన్యుల పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. స్వామి వారి సేవలో నిమగ్నమైన కుటుంబాన్ని అవమానించడం అంటే... అది దేవుడిని కూడా అవమానించినట్టేనని అన్నారు. నిందితులందరినీ అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కుటుంబ సభ్యులకు పూర్తిస్థాయి భద్రత కల్పించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అన్నారు. అర్చకుడి కుటుంబ సభ్యులకు తాము అండగా ఉంటామని కేటీఆర్ హామీ ఇచ్చారు.

'డబుల్ ఇంజిన్' ఘోర వైఫల్యం

(మొదటిపేజీ తరువాయి)

కోల్పోయారు. ఈ రాజీనామా ఒక దిద్దుబాటుకు దారితీయాలి. ఇందులో మణిపూర్‌లోని అన్ని రాజకీయ పార్టీలు, సంబంధిత వాటాదారులు శాశ్వత శాంతి కోసం కృషి చేయాలి. ప్రధాన మంత్రి మోదీకి ఇప్పటికైనా కనువిప్పు కలగాలి. మణిపూర్ ప్రజల బాధల పట్ల కరుణ చూపాలి. పరిస్థితిని నియంత్రించడంలో వైఫల్యాన్ని అంగీకరించాలి. రాష్ట్రాన్ని సందర్శించి శాశ్వత శాంతికి మార్గం కనుగొనడంలో చొరవ చూపాలి. బీరేన్‌సింగ్ పాలనలో ప్రజాస్వామ్య హక్కుల అణచివేత జరిగింది. నిజాన్ని తొక్కిపెట్టేందుకు సీపీఐ జాతీయ కార్యదర్శి అనీ రాజా, ఎన్ఎఫ్ఐడబ్ల్యు ప్రధాన కార్యదర్శి నిషా సిద్ధూ, న్యాయవాది దీక్ష ద్వివేది సహా ఇతర సీపీఐ నాయకులు, కార్యకర్తలతో సహా అనేక మంది జర్నలిస్టులు, హక్కుల కార్యకర్తలు వేధింపులకు గురిచేశారు. ఇదిగాక లీకైన ఓ ఆడియో... హింసలో బీరేన్‌సింగ్ ప్రమేయం గురించి అనేక సందేహాలు లేవనెత్తుతోంది. ఈ ఆరోపణలపై దర్యాప్తు చేయడానికి ఉన్నత స్థాయి, నిష్పాక్షిక విచారణ జరిపించాలని సీపీఐ డిమాండ్ చేసింది.

ఎమ్మెల్సీ ఎన్నికలు పకడ్బందీగా చేపట్టాలి : కలెక్టర్

విశాలాంధ్ర - కొమరం భీం: శాసనమండలి పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎన్నికల నిర్వహణ జిల్లాలో పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన శాసనమండలి ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గానికి ఈనెల 27వ తేదీన పోలింగ్ జరగనున్నందున జిల్లాలో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా త్రాగునీరు, వెలుతురు, ఫ్యాన్లు, ఫర్నిచర్, షామియానా, మూత్రశాలలు, క్యూ లైన్లు ఇతర అన్ని ఏర్పాట్లు చేయాలని తహసిల్దార్‌ను ఆదేశించారు. అనంతరం పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు అందిస్తున్న బోధన తీరుపై ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

తునికాకు టెండర్ల జాప్యంపై ప్రభుత్వం స్పందించాలి : సాబీర్ పాషా

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల గిరిజనులకు, గిరిజనేతర పేదలకు వేసవికాలంలో ఆర్థికంగా తునికాకు ఎంతో ఉపాధి నిస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా అన్నారు. ఆ చెట్ల మోడెం (ప్రూనింగ్) నరికివేత జాప్యంపై ప్రభుత్వం స్పందించి త్వరగా టెండర్లు ఆహ్వానించాలని డిమాండ్ చేశారు. సోమవారం శేషగిరి భవన్లో అయన మట్లాడుతూ తునికాకు సేకరణ ద్వారా ప్రభుత్వానికి కూడా ప్రతి ఏటా కోట్లాది రూపాయలు లాభం వస్తుందన్నారు. తునికాకు సేకరణకు టెండర్లు ఆహ్వానించి ప్రూనింగ్ పనులు సాధ్యమైనంత త్వరగా చేపట్టాలని అప్పుడే ఆకులు ఏపుగా వస్తాయన్నారు. సీజన్ దాటిపోతున్నా ప్రభుత్వం నేటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం సరైంది కాదన్నారు. ప్రూనింగ్ పనులు జాప్యం జరిగితే ఆకు నాణ్యత లోపించే ప్రమాదం ఉందన్నారు. అష్టకష్టాలు పడి, అడవుల్లో ప్రమాదాలు ఎదుర్కొంటూ ఆకు సేకరిస్తున్న కార్మికులకు గిట్టుబాటు ధర చెల్లించాల్సిన అవసరం ఉందన్నారు. యాభై ఆకుల కట్టకు 3 రూపాయలు చెల్లించాలని, బకాయి బోనస్ తక్షణమే పూర్తి స్థాయిలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తునికాకు సేకరణ జాప్యంపై సంబంధిత శాఖ మంత్రికి లేఖ పంపినట్లు సాబీర్ తెలిపారు. ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే సిపిఐ, ఏఐకెఎస్, బికెఎంయు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

షాపింగ్‌మాల్ ఉద్యోగులకు మినిమం వేజ్ అమలు చేయాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం : కొత్తగూడెంలోని వివిధ షాపింగ్ మాల్స్‌లో పనిచేస్తున్న సేల్స్ ఉద్యోగులు, గుమస్తాలకు మినిమమ్ వేజ్ అమలు చెయ్యాలని కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షులు రాసూరి శంకర్ డిమాండ్ చేసారు. పనిగంటలు అధికంగా చేస్తున్న ఈ ప్రయివేట్ ఉద్యోగులకు ఈఎస్ఐ, ఈపీఎఫ్ ఆఫీసులు కూడా ఏర్పాటు చెయ్యాలన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం కలెక్టరేట్లో జరిగిన ప్రజాదర్బార్లో దరఖాస్తు చేశారు. సేల్స్ మెన్స్, గర్ల్స్, గుమస్తాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన గెజిట్ ప్రకారము స్థానిక జీవి మాల్, సిఎంఆర్, సౌత్ ఇండియా లాంటి షాపింగ్ మాల్ షాపుల యజమానులు సౌకర్యాలు కల్పించాలన్నారు. మినిమం వేజెస్ తోపాటు ఉదయం 9.30 నుండి రాత్రి 9.30 వరకు పనిచేస్తుంటారని అధిక పని గంటల వేతనాన్ని అమలు చేయడం లేదన్నారు. పారిశ్రామిక ప్రాంతమైన కొత్తగూడెం జిల్లాలో వేల మంది ఈపీఎఫ్, ఈఎస్ఐ సభ్యత్వం కలిగి ఉన్నారని ఏదైనా సమస్య వస్తే చెప్పుకోవడానికి ఈపీఎఫ్, ఈఎస్ఐ ఆఫీసులు లేవన్నారు. జిల్లాలో కూడా ఈ ఆఫీసులు ఏర్పాటు చేయలని కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లొ దరఖాస్తు చేశారు. శంకర్‌తోపాటు సంఘం కార్యదర్శి మదన్ శెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్‌పై సమీక్ష

విశాలాంధ్ర - జిల్లా బ్యూరో మహబూబాబాద్ : ఐ.డి.ఓ.సి లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో రాష్ట్రీయ బాల స్వస్థత కార్యక్రమం, డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్‌పై సంబందిత అధికారులతో సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మురళీధర్ అన్నారు. ఈ సందర్బంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ ఆర్‌బిఎస్‌కే రాష్ట్రీయ బాల స్వస్థత కార్యక్రమం జిల్లాలోని స్కూల్స్ అంగన్వాడి సెంటర్లలో పిల్లలందరినీ స్క్రీనింగ్ చేసి, జిల్లాలో గల డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్‌కి పంపించి వారికి చికిత్స అందించాలన్నారు. డైక్ సెంటర్లో ఫిజియోథెరపిస్ట్, దంత వైద్య నిపుణులు, సైక్రియాట్రిస్ట్, సోషల్ వర్కర్, వినికిడి సంబంధించిన నిపుణులు, పిల్లలందరికీ వైద్య సేవలు అందించాలని, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ రేఫరల్ అయిన కేసులు అన్నింటిని విధిగా సేవలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రమీల, ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ సారంగం, డాక్టర్ శ్రవణ్ కుమార్, డాక్టర్ సుధీర్ రెడ్డి, డాక్టర్ విజయకుమార్, డాక్టర్ కుమార్, డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్స్ కేవి రాజు, గీత, శారద ఆర్బిఎస్కే సిబ్బంది, డిఈఐ సిబ్బంది పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో పర్యటించిన కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : ఖానాపూర్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం ఉదయం ఖానాపూర్ మండలంలోని పలు గ్రామాలతో పాటు పట్టణ పారిశుద్ధ్య కార్యక్రమం నిశితంగా పరిశీలించారు. ఈనెల 10 నుండి 15 వరకు జరిగే ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఖానాపూర్ పట్టణంలోని 9, 10 వార్డులలో కాలువలు సిసి రోడ్లు పరిసర ప్రాంతాల్ని పరిశీలించి ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని ఆదేశించారు. మస్కాపూర్‌లో కస్తూరిబా పాఠశాలలో తరగతి గదులను, వంటశాల, గిడ్డంగి రూములను పరిశీలించారు. 10వ తరగతుల విద్యార్థులు మంచి గుర్తింపు ర్యాంకులు సాధించాలన్నారు. పాఠశాల సిబ్బంది డీఈవో తదితరులు పాల్గొన్నారు. సత్తనపల్లి గ్రామాన్ని సైతం సందర్శించి పరిశుభ్రతను తప్పకుండా పాటించాలని ఎప్పటికప్పుడు వాటి వివరాలు అందించాలని సంబంధీకులను ఆదేశించారు. ఎమ్మార్వో సుజాత ఆర్ఐ నగేష్ ఎంపీడీవో సునీత ఎంపీవో రత్నాకర్‌రావు ఐకెపి ఆశ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు చివరిరోజున 27 నామినేషన్లు

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : వరంగల్- ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్లలో భాగంగా చివరి రోజైన సోమవారం (18) మంది అభ్యర్థులు (27) సెట్ల నామినేషన్లను దాఖలు చేసినట్లు వరంగల్- ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. సోమవారం నామినేషన్లు దాఖలు చేసిన వారిలో భారతీయ జనతా పార్టీ తరఫున పులి సరోత్తమ్ రెడ్డి 2 సెట్ల నామినేషన్ దాఖలు చేశారని, లింగిడి వెంకటేశ్వర్లు ప్రజావాణి పార్టీ తరఫున 2 సెట్లు నామినేషన్లు దాఖలు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజా ఏక్తా పార్టీ తరఫున బండారు నాగరాజు 1 సెట్ నామినేషన్ దాఖలు చేశారని వెల్లడించారు. దామెర బాబురావు, ఏలే చంద్రమోహన్, పింగిలి శ్రీ పాల్, ఎస్. సుందర్రాజు, పూల రవీందర్, డాక్టర్ కొల్లిపాక వెంకటస్వామి, తలకోల పురుషోత్తం రెడ్డిలు స్వతంత్ర అభ్యర్థులుగా ఒక్కొక్కరు 2 సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా, కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి, తాటికొండ వెంకట రాజయ్య, పన్నాల గోపాల్ రెడ్డి, గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, జెట్టి శంకర్, బండారు నాగరాజు, గంగిరెడ్డి కోటిరెడ్డి, తండు ఉపేందర్లు స్వతంత్ర అభ్యర్థులుగా ఒక్కో నామినేషన్ దాఖలు చేసినట్లు ఆమె వెల్లడించారు. మొత్తం (18) మంది అభ్యర్థులు (27) నామినేషన్లు దాఖలు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు.

ఇది కార్మిక వ్యతిరేక బడ్జెట్

విశాలాంధ్ర - ఖమ్మం : కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మిక వ్యతిరేక బడ్జెట్ అని రైతులు, కార్మికులు పేద, మధ్య తరగతి ప్రజలను పూర్తిగా విస్మరించారని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు ఆరోపించారు. గతంతో పోలిస్తే కార్మిక వర్గానికి బడ్జెట్లో నిధుల కేటాయింపు తగ్గిందని సంక్షేమానికి కేటాయింపులు ఉన్న ఖర్చు చేసే పరిస్థితి లేదని ఆయన తెలిపారు. ఏఐటియుసి ఖమ్మం జిల్లా సమావేశం సోమవారం స్థానిక గిరిప్రసాద్ భవన్లో ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మి నారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శింగు నర్సింహారావు మాట్లాడుతూ కార్మిక సంక్షేమం కోసం వివిధ పథకాల ద్వారా రూ. 56 వేల కోట్లు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం కేవలం రూ.20436 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. గతంతో పోలిస్తే కేటాయింపుల్లో ఏడువేల కోట్ల రూపాయలు తగ్గాయన్నారు. బడ్జెట్కు ముందు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పిన మాటలు బడ్జెట్లో ప్రతి ఫలించలేదని నర్సింహారావు తెలిపారు. ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టగా సమావేశంలో కార్యనిర్వాహక అధ్యక్షులు రావి శివరామకృష్ణ, ఉపాధ్యక్షులు సిహెచ్ సీతామహాలక్ష్మి, నిమ్మటూరి రామకృష్ణ, సహాయ కార్యదర్శులు జాకీరుద్దీన్, రాంబాబు, పిల్లి రమేష్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయం

విశాలాంధ్ర- మరిపెడ: ప్రగతి సేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయం అని మరిపెడ మండల తహశీల్దార్ సైదులు అన్నారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని స్థానిక ఆడిటోరియంలో ప్రగతి సేవా సమితి ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి వారి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మరిపెడ తహశీల్దార్ సైదులు, అతిథులుగా మెడికల్ ఆఫీసర్ గూగులోత్ రవి, ప్రగతి సేవాసమితి వ్యవస్థాపకులు గద్దల జాన్‌లు పాల్గొని ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి క్యాంప్‌ను ప్రారంభించారు.వైద్య శిబిరంలో 68 మందికి పరీక్షలు చేయగా 34 మందిని శంకర కంటి ఆసుపత్రి హైద్రాబాద్‌కు ఆపరేషన్ కోసం పంపామని తెలిపారు. ప్రగతి సేవా సమితి తొర్రూరు క్లస్టర్ కో ఆర్డినేటర్ ఐనాల పరశు రాములు, శంకర కంటి ఆసుపత్రి క్యాంప్ కో ఆర్డినేటర్ శివగంగ, ప్రగతి సేవాసమితి మండల కో ఆర్డినేటర్ జినక సువార్త, ఏరియా కో ఆర్డినేటర్ బాషిపంగు వీరబాబు, తాళ్ళఊకల్ కో ఆర్డినేటర్ తప్పెట్ల సతీష్,మరిపెడ కో ఆర్డినేటర్ వెంకటరమణ, గాలివారిగూడెం కో ఆర్డినేటర్ ఈదుల మహేశ్వరీ, అబ్బాయిపాలెం కో ఆర్డినేటర్ జినక క్రిష్ణమూర్తి, యల్లంపేట కో ఆర్డినేటర్ నలబోతు విజయ, గుండంరాజుపల్లి కో ఆర్డినేటర్ బర్పటి సంధ్య, శంకర కంటి ఆసుపత్రి సిబ్బది అర్చన, సోనమ్, ప్రాన్స్, దివ్య, రిషాద్, పటేల్ పాల్గొన్నారు.

మా పాఠశాలలో ఉపాధ్యాయులు గైర్హాజరు కావడం లేదు : హెచ్‌ఎమ్ రాంబాబు

విశాలాంధ్ర - ఇల్లందు : మండలం, పట్టణంలో వేరే పాఠశాలల పరిస్థితి ఎలా వున్నా ఇల్లందులోని తమ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మాత్రం ఉపాధ్యాయులెవరూ విధులకు దుమ్మా కొట్టడం లేదని హెచ్‌ఎమ్ లకావత్ రాంబాబు చెప్పారు. సోమవారం విశాలాంధ్రలో ప్రచురితమైన "పరస్పర సహకారంతో విధులకు దుమ్మా కొడుతున్న ఉపాధ్యాయులు" కథనానికి ఆయన స్పందించారు. తమ పాఠశాల పరిధిలో పని చేస్తున్న ఉపాధ్యాయులు విధులకు రాని రోజు సెలవు పెడతారని చెప్పారు. విధి నిర్వహణలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయటం లేదని ఆయన విశాలాంధ్రతో అన్నారు.

శ్రీనివాస్‌కు చేయూతనిచ్చిన పరమాత్మ

విశాలాంధ్ర-గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన కొమ్ముల శ్రీనివాస్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని ఎస్సీ కాలనీ చెందిన గజవెల్లి పరమాత్మ ముందుకు వచ్చి సోమవారం హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం 3,500 రూపాయలు తన వంతు ఆర్థిక సహాయంగా అందజేశారు. గతంలో కూడా అంగన్వాడి కేంద్రంలో పిల్లలకు ప్లేట్లు, మరుగుదొడ్లకు కావాల్సిన పరికరాలను కూడా అందజేశారు. ఆర్థికపరంగా ఈ కుటుంబమైనా బాధపడుతుంటే నేనున్నానంటూ ధైర్యం ఇస్తూ సహాయం చేస్తున్నందుకు పలువురు అభినందించారు. గజవెల్లి పరమాత్మకు గూడూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు మండల ప్రవీణ్ ధన్యవాదాలు తెలిపారు.

గ్రామీణ వైద్యుల సమస్యలను మండలి దృష్టికి తీసుకెళ్తాం : ఎమ్మెల్సీ

విశాలాంధ్ర - బ్యూరో ఖమ్మం : గ్రామీణ ప్రజలకు సేవలందించే గ్రామీణ వైద్యుల గుర్తింపు విషయంపై శాసన మండలి దృష్టికి తీసుకెళ్తామని ఖమ్మం ఎమ్మెల్సీ తాత మధుసూదన్ అన్నారు. ఆదివారం ఖమ్మం బైపాస్ రోడ్డులోని ఫంక్షన్ హాల్లో జరిగిన జిల్లా గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా 22వ మహా సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలతో మమేకమై ఇంటికే వచ్చి వైద్యం చేసే గ్రామీణ వైద్యులసమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. సమస్యల సాధన కోసం కషిచేస్తున్న గ్రామీణ వైద్యులకు తమ అండదండలు నిరంతరం ఉంటాయని హామీ ఇచ్చారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం జిలా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కళావతి బాయి మాట్లాడుతూ గ్రామీణ వైద్యులు పరిమితి దాటకుండా తమ పరిమితిని గుర్తెరిగి వైద్యం చేయాలని సూచించారు. గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు అనుభవవైద్యుల సంఘాల సమాఖ్య తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ పిట్టల నాగేశ్వరరావు మాట్లాడుతూ నేడు జరిగిన జిల్లా మహాసభలో తొమ్మిది తీర్మానాలను ఆమోదించామని తెలిపారు. గ్రామీణ వైద్యులు కూడా ప్రథమ చికిత్సకు మాత్రమే పరిమితం కావాలని సూచించారు. ఈనెల 18న హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద నిర్వహించే మహాసభకు గ్రామీణవైద్యులు సంఘాలకు అతీతంగా పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

మండల ప్రజల సహకారం మరువలేనిది

విశాలాంధ్ర - పినపాక : మండల ఎంపీడీవోగా విధులు నిర్వహించి బదిలీపై ఖమ్మం వెళ్లిన రామకృష్ణను సోమవారం ఆత్మీయంగా సన్మానించారు. పినపాక మండల కేంద్రంలో తాసిల్దార్ అద్దంకి నరేష్, పినపాక ఇంచార్జ్ ఎంపీడీవో సునీల్ కుమార్, ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఏపీఓ వీరభద్రస్వామిలు సంయుక్తంగా రామకృష్ణను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామకృష్ణ మండలంలో చేసిన సేవలు అభినందనీయమన్నారు. అధికారులు ఆయనతో గల విధినిర్వహణ అనుబంధాలను పంచుకున్నారు. అనంతరం బదిలీపై వెళ్లిన రామకృష్ణ మాట్లాడుతూ మండల ప్రజల సహకారం మరువలేదన్నారు. అధికారులకు బదిలీలు సర్వసాధారణమైనప్పటికి కొన్ని ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఉండే అనుబంధాలను ఎప్పటి మరవలేమన్నారు. విధి నిర్వహణలో తనను సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు చెప్పారు. అనంతరం సెక్రటరీలు, పంచాయతీ సిబ్బంది, కార్యాలయం సిబ్బంది ఆయనను శాలువాలు, పూలమాలలు వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ తాతారావు, మండల సెక్రటరీలు, స్థానికులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

విశాలాంధ్ర - తొర్రూర్: తొర్రూరు మున్సిపల్ పరిధిలోని ఏడవ వార్డు రోడ్ నెంబర్ 6 కాకతీయనగర్‌లో గత ఆరు నెలల నుండి మంచినీళ్లు రావడంలేదని, గతలో మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌కు ఎన్నిసార్లు విన్నవించుకున్న ఫలితం లేకుండా పోయిందని టీఎల్ఎఫ్ మాజీ అధ్యక్షురాలు బందు విజయ తెలిపారు. డిసెంబర్ 30న ఏడవ వార్డు కాకతీయ నగరవాసులతో కలిసి వినతిపత్రంలో సంతకాలు పెట్టి కమిషనర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ సిబ్బంది వచ్చి రెండుచోట్ల గుంతలు తవ్వి, పైపులు మార్చాలని చెప్పి అలాగే వదిలేసి వెళ్లారన్నారు. మున్సిపల్ కమిషనర్‌కు పదేపదే విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయిందని ఆమె వాపోయారు. క్యాన్ 20 రూపాయల చొప్పున మంచినీళ్లు కొనుక్కొని తాగుతున్నామని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఎండలు మండుతున్నాయని, ఈ ఎండాకాలంలో ఒక కుటుంబానికి రెండు లేక మూడు క్యాన్లు (60 రూ.లు) వాటర్ కొనుగోలు చేయవలసి వస్తుందని ఆమె తెలిపారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ స్పందించి, వెంటనే పైపుల మరమ్మతు చేయించి ఏడవ వార్డు కాకతీయ నగర్ వాసులకు మంచినీళ్లు అందించాలని కోరారు. ఆమెతో పాటు, విజయకాంత, వెంకటమ్మ, సుక్కమ్మ, ఉపేంద్ర, గీత, రమణ, పద్మ, సుశీలమ్మ, సమ్మయ్య, ముత్యాలి, తదితర మహిళలు పాల్గొన్నారు.

సైబర్ నేరాల కట్టడిపై ప్రత్యేక దృష్టి

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి,సింగరేణి: సైబర్ నేరాల కట్టడిపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీఎస్‌సీఎస్‌బీ) ఆదేశాల మేరకు రామగుండం పోలీస్ కమీషనరేట్‌లో ప్రత్యేక దృష్టి సారించడం జరిగింది రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ప్రతి పోలీసు స్టేషన్‌లో ఉన్న సైబర్ వారియర్ సిబ్బందికి పోలీసుస్టేషన్లలో నమోదయ్యే సైబర్ నేరాల దర్యాప్తును తీసుకోవాల్సిన చర్యలు పై ఏర్పాటు చేసి శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అనుకోని రీతిలో సైబర్ నేరానికి గురైతే ఖంగారు పడకుండా ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలు, సైబర్ వారియర్ అందుబాటులోకి వస్తారని అన్నారు. సైబర్ వారియర్స్ 1930 ఫోన్‌లో ఫిర్యాదులను స్వీకరించడం, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో నేరాన్ని నివేదించడం, అనుమానిత ఐడెంటిఫైయర్‌లను విశ్లేషించడం, అలాగే సోషల్ మీడియా, ఆన్‌లైన్ ఆర్థిక మోసాలపై దర్యాప్తు చేయడం వంటి వాటిపై వారికి శిక్షణ, అవగాహనా కల్పించడం జరిగిందన్నారు. పోలీస్ స్టేషన్, టీఎస్‌సీఎస్‌బీ మధ్య సైబర్ వారియర్లు సమన్వయ కర్తలుగా పని చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసిపి రాఘవేంద్రరావు, సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, సైబర్ క్రైమ్ సిబ్బంది చిరంజీవి, నరేష్, కోటేష్, సైబర్ వారియర్స్ పాల్గొన్నారు.

విధి నిర్వహణలో క్రమశిక్షణ చాలా ముఖ్యం

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : ఏ ఉద్యోగికైనా క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తే మంచి గుర్తింపు వస్తుందని సింగరేణి సెక్యూరిటీ విభాగం జనరల్ మేనేజర్ చందా లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం నుండి వారం రోజుల పాటు జరిగే యస్ అండ్ పిసి డ్రిల్, పి.టి. ఇన్‌స్ట్రక్టర్ శిక్షణా తరగతుల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథి హాజరైయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యంగా సింగరేణిలో సెక్యూరిటీ సిబ్బందికీ క్రమశిక్షణ ముఖ్యమన్నారు. వారం రోజుల డ్రిల్, పి.టి. ఇన్‌స్పెక్టర్ శిక్షణ భవిష్యత్తులో చాలా ఉపయోగపడుతుందన్నారు. ఈ శిక్షణలో సెక్యూరిటీ సిబ్బంది క్రమశిక్షణతో ఈవెంట్స్ చేయడం వల్ల శారీరక, మానసిక ధారుఢ్యం పెంపొందే అవకాశం ఉందన్నారు. సింగరేణిలో యస్ అండ్ పిసి విభాగం పటిష్టంగా ఉండేందుకు కావలసిన అన్ని రకాల చర్యలు, అభివృద్ధికి సహాయ సహకారాలు యాజమాన్యం అందిస్తుందన్నారు. సెక్యూరిటీ సిబ్బంది మెరుగైన వృత్తి నైపుణ్యం, అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ సంస్థ ఆస్తులు, స్థలాలను పరిరక్షించాలని జియం కోరారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఇన్స్పెక్టర్ డి.నారాయణరెడ్డి, జి. భాస్కర్ రెడ్డి, జమేదార్, ట్రైనింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

భారతీయులపై కొత్త యు.ఎస్.వలస విధానాల ప్రభావం

ముంబయి: యునైటెడ్ స్టేట్స్‌లో కొత్తప్రభుత్వం అనేక వలస సంస్కరణలను ప్రతిపాదించింది, ఇవి భారతీయ జాతీయులపై, ముఖ్యంగా ఉద్యోగ ఆధారిత వీసాలు, గ్రీన్ కార్డు, చట్టపరమైన నివాస పద్ధతులను కోరుకునే వారిపై గొప్ప ప్రభావాన్ని చూపుతాయి. గెహిస్ ఇమ్మిగ్రేషన్, ఇంటర్నేషనల్ లీగల్ సర్వీసెస్ ఈ మార్పులను నిశితంగా పరిశీలిస్తోంది. అభివృద్ధి చెందుతున్న వలస ప్రక్రియలో వ్యక్తులు, వ్యాపారాలకు మార్గదర్శకత్వం అందించడానికి యూఎస్ వలస కోసం చూస్తున్న భారతీయులను ప్రభావితం చేసే కొన్ని తాజా విధానాలు ప్రకటించారు. భారతప్రభుత్వం యూఎస్‌లో చట్టవిరుద్ధంగా నివసిస్తున్న కనీసం 18,000 మంది భారతీయ పౌరులను తిరిగి పంపడానికి అంగీకరించింది. యూఎస్-భారత్ సంబంధాలను కాపాడటానికి, హెచ్-1బీ వంటి వీసా కార్యక్రమాలకు నిరంతర ప్రాప్యతను పొందటానికి విస్తృత దౌత్యప్రయత్నాలలోభాగంగా ఈచర్య వచ్చింది. ప్రస్తుతం పత్రాలులేని స్థితిలో ఉన్న భారతీయ జాతీయులు మరింత కఠినమైన అమలు చర్యలను ఎదుర్కోవచ్చు, చట్టపరమైన సంప్రదింపులను అవసరమైనదిగా చేస్తుంది.

నవనీత్ ఎడ్యుకేషన్ లిమిటెడ్ 'నవనీత్ ఏఐ' ఆవిష్కరణ

ముంబై: విద్యా రంగంలో అగ్రగామిగా ఉన్న నవనీత్ ఎడ్యుకేషన్ లిమిటెడ్, ఉపాధ్యాయులకు జ్ఞానం, వనరులను సులభంగా యాక్సెస్ చేయడానికి రూపొందించబడిన ఒక వినూత్న వేదిక అయిన నవనీత్ ఏఐని ప్రారంభించినట్లు ప్రకటించింది. నవనీత్ విస్తృతమైన విద్యా సామగ్రి కేటలాగ్‌ను ఉపయోగించడం ద్వారా, నవనీత్ ఏఐ సాధనాలు ఉపాధ్యాయులు క్విజ్‌లు, హెూంవర్క్, పీపీటీలు, ఫ్లాష్‌కార్డ్‌లు, సారాంశాలు, మరిన్నింటిని సృష్టించడానికి ఇంటరాక్టివ్, యూజర్-ఫ్రెండ్లీ ప్లాట్‌ఫామ్‌ను అందించడం ద్వారా పాఠాలను మరింత సమర్థవంతంగా అందించడంలో సహాయపడతాయి. దశాబ్దాలుగా, భారతదేశం అంతటా ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రసిద్ధ నవనీత్ డైజెస్ట్‌లు, సమగ్ర వర్క్‌బుక్‌లు, నవనీత్ 21 మోస్ట్ లైక్లీ క్వశ్చన్ సెట్‌లు, ప్రీ-ప్రైమరీ, వివిధ పిల్లల పుస్తకాలు వంటి నవనీత్ ప్రఖ్యాత విద్యా వనరులపై ఆధారపడ్డారు.

కదంబం సింగిల్ మాల్ట్ విస్కీ విడుదల

హైదరాబాద్: మోనికా ఆల్కోబెవ్ లిమిటెడ్ సహకారంతో అమృత్ డిస్టిలరీస్ తాజాగా జీఎంఆర్ హైదరాబాద్ డ్యూటీ ఫ్రీలో అమృత్ కదంబం విస్కీని అందుబాటులో ఉంచినట్లు వెల్లడించింది. ఈ ఆవిష్కరణ ప్రీమియం ఇండియన్ విస్కీ ప్రపంచంలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. ప్రయాణికులకు అమృత్ అత్యుత్తమ సృష్టిలలో ఒకదాన్ని ఆస్వాదించడానికి ఒక ప్రత్యేక అవకాశాన్ని అందిస్తుంది. భారతదేశంలోని జీఎంఆర్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం డ్యూటీ ఫ్రీ స్టోర్లలో ప్రత్యేకంగా అమృత్ కదంబం అందుబాటులో ఉంది. ఇది భారతీయ విస్కీ నైపుణ్యం ఈ అద్భుతమైన వ్యక్తీకరణను ఆస్వాదించేందుకు ప్రయాణికులకు ఒక ప్రత్యేక అవకాశాన్ని అందిస్తుందని అమృత్ డిస్టిలరీస్ మేనేజింగ్ డైరెక్టర్ రక్షిత్ ఎన్. జగ్దేల్ అన్నారు.

కాప్‌స్టన్ సర్వీసెస్ ఆర్థిక ఫలితాలు విడుదల

హైదరాబాద్: ఎండ్-టు-ఎండ్ మ్యాన్‌పవర్ సొల్యూషన్స్ ప్రొవైడర్ అయిన కాప్‌స్టన్ సర్వీసెస్ లిమిటెడ్, డిసెంబర్ 31, 2024తో ముగిసిన క్యూ3 9ఎం ఎఫ్‌వై25కి తన ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. క్యూ3 ఎఫ్‌వై25లో మొత్తం ఆదాయం రూ. 182.41 కోట్లుగా ఉంది, ఇది క్యూ3 ఎఫ్‌వై24లో రూ.137.47 కోట్లతో పోలిస్తే, 32.69% పెరిగింది. ఈబీఐటీడీఏ రూ. 8.34 కోట్లుగా ఉంది, ఇది క్యూ3 ఎఫ్‌వై24లో రూ.5.88 కోట్లతో పోలిస్తేబీ 41.84% వృద్ధిని నమోదు చేసింది. ప్యాట్ రూ.4.53 కోట్లుగా ఉంది, ఇది రూ. 2.69 కోట్లు, ఇది 68.40% పెరిగింది. మొత్తం ఆదాయం రూ. 504.40 కోట్లుగా ఉంది, ఇది 9ఎం ఎఫ్‌వై24లో రూ.379.72 కోట్లు, ఇది 32.83% పెరిగింది. ఈబీఐటీడీఏ రూ.22.5 కోట్లుగా ఉంది, ఇది 9ఎం ఎఫ్‌వై24లో రూ. 16.76 కోట్లుబీ 34.19% వృద్ధిని నమోదు చేసింది. నికర లాభం రూ. 11.79 కోట్లుగా ఉంది, ఇది రూ. 9.81 కోట్లు, ఇది 20.18% పెరిగింది.

అమెజాన్ 'ప్యార్ బజార్' సెలక్షన్‌లో ఆఫర్ల వెల్లువ

బెంగుళూరు: ఈ వాలెంటైన్స్ డేని మరింత ప్రత్యేకం చేసుకోవాలని, మరింత అందుబాటు ధరలో అమెజాన్.ఇన్‌లో కొత్త స్టోర్ ఫ్రంట్ అయిన అమెజాన్ బజార్‌లో పొందాలని అమెజాన్ కోరుతోంది. ఈ స్టోర్ బజార్ ఫ్యాషన్, గృహాలంకరణ, వంటగది ఉత్పత్తులు, ఫోన్ యాక్సెసరీలపై భారీ తగ్గింపులను ఆఫర్ చేస్తుంది. చక్కని రొమాంటిక్ డేట్‌కు సొబగులు అద్దేందుకు మెరిసే జ్యువలరీ మొదలుకుని, వీ-డే అలంకరణకు వ్యక్తిగత అభిరుచిని తెలియచెప్పే మనసును హత్తుకునే గృహాలంకరణ సామాగ్రి వరకు వాలెంటైన్స్ డే కోం కావలసినవి అన్నీ అమెజాన్ బజార్ వారి ప్రత్యేకంగా రూపొందించిన ప్యార్ బజార్ విభాగంలో లభిస్తాయి, కేవలం రూ. 99తో ప్రారంభం. బడ్జెట్‌ను గురించి జాగ్రత్త వహించే షాపర్లు కూడా ఫ్రీ డెలివరీ, డెలివరీ లభించిన తర్వాత చెల్లింపు, ఇబ్బందులు లేని 5-రోజుల రిటర్న్‌ల సౌకర్యాలను పొందవచ్చు. యూపీఐ చెల్లింపుల పై అదనంగా క్యాష్‌బ్యాక్ ఆఫర్లను కూడా మీరు పొందవచ్చు.

రిక్తం గ్రూప్ అధునాతన 'జెడ్‌ఇంటర్వ్యూఏఐ' ఆవిష్కరణ

హైదరాబాద్: నియామక ప్రక్రియలో ఉన్న సమస్యలను అధిగమించడమే లక్ష్యంగా రిక్తం గ్రూప్ తన అధునాతన 'జెడ్‌ఇంటర్వ్యూఏఐ'ను ఆవిష్కరించింది. ఈ నూతన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ప్లాట్‌ఫారమ్ ఆటోమేటెడ్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తూ నియామక ప్రక్రియను సరికొత్తగా మార్చనుంది. ఇది హెచ్‌ఆర్ రంగంలో విప్లవాత్మక మార్పులకు ఆజ్యం పోయనుంది. ఈ మేరకు బంజారా హిల్స్ తాజ్ దక్కన్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్‌ఇంటర్వ్యూఏఐ వ్యవస్థాపకుడు, సీఈవో (రిక్తం టెక్నాలజీ కన్సల్టింగ్‌లో డైరెక్టర్) సిద్ధరామ్ శింగశెట్టి మాట్లాడుతూ కృత్రిమ మేధస్సును ఉపయోగించి టాలెంట్ హైరింగ్‌ను సులభతరం చేస్తున్నామని చెప్పారు. దీని ద్వారా సంస్థలు సమయాన్ని, వనరులను ఆదా చేసుకోవచ్చని తెలిపారు. పదిహేనేళ్ళుగా రిక్తమ్ టెక్నాలజీ కన్సల్టింగ్ ప్రపంచవ్యాప్తంగా టయోటా, నైకి, గూగుల్, ప్రాక్టర్, గాంబుల్ వంటి ప్రముఖ కంపెనీలకు కన్సల్టింగ్ సేవలు అందిస్తుందని తెలిపారు.

ఐస్ మేక్ రిఫ్రిజరేషన్ ఆదాయ వృద్ధి

హైదరాబాద్: భారతదేశంలో వినూత్న శీతలీకరణ పరిష్కారాల ప్రదాత, 50కి పైగా రకాల శీతలీకరణ పరికరాల ప్రముఖ తయారీదారు అయిన ఐస్ మేక్ రిఫ్రిజిరేషన్ లిమిటెడ్, డిసెంబర్ 31, 2024 (క్యూ3ఎఫ్‌వై25)తో ముగిసిన మూడవ త్రైమాసికానికి దాని ఆడిట్ చేయని ఏకీకృత ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. బలమైన మార్కెట్ డిమాండ్, కార్యాచరణ సామర్థ్యాల కారణంగా కంపెనీ బలమైన ఆదాయ వృద్ధిని నివేదించింది. కార్యకలాపాల నుండి వచ్చే ఆదాయం వైఓవై 34% పెరిగి రూ. 110.56 కోట్లకు చేరుకుంది. ఈబీఐటీడీఏ 56% పెరిగి రూ.06.89 కోట్లకు చేరుకుంది. పన్నుకు ముందు లాభం రూ.3.59 కోట్ల వద్ద ఉంది, మరియు నికర లాభం 39% మెరుగుపడి రూ.1.81 కోట్ల కు చేరుకుంది. 2025 ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల్లో, కార్యకలాపాల నుండి ఏకీకృత ఆదాయం 25% పెరిగి రూ. 299.17 కోట్ల కు చేరుకుంది.

కలెక్టర్ రాకపోతే గ్రీవెన్స్ డే రద్దు చేయాలి



విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే ప్రయోజనకరంగా ఉండాలని కలెక్టర్ హాజరు కాని సందర్భాల్లో రద్దు చెయ్యాలని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి, యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట శివశంకర్ డిమాండ్ చేసారు. సోమవారం ఆయన ఒక ప్రకటనలో గ్రీవెన్స్ డే నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనేక సందర్భాల్లో జాయింట్ కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ స్థానిక సంస్థలు అధికారులతో గ్రీవెన్స్‌ని నడుపుతున్నారని ఆరోపించారు. కలెక్టర్ లేనప్పుడు లేనప్పుడు గ్రీవెన్స్ రద్దు చెయ్యాలని డిమాండ్ చేసారు. ఎన్ని పిటిషన్లు ఇచ్చినా సదరు అధికారులు వాటిని పట్టించుకోవడంలేదన్నారు. ప్రజాదర్బార్లో వచ్చిన బాధితుల దరఖాస్తులను బుట్టదాఖలు చేస్తున్నట్లు శివశంకర్ అభియోగం మోపారు. ముఖ్యంగా జిల్లా మంత్రుల పర్యటనలు, ప్రధాన మీటింగ్ల సందర్భాల్లో కలెక్టర్ గ్రీవెన్స్ కు అటెండ్ కానీ పక్షంలో రద్దు చేయడమే మెలన్నారు. జిల్లా నలుమూలల నుంచి బాధితులు ఎంతో ఆశతో తమ సమస్యలు కలెక్టర్ తో నేరుగా అభ్యర్థిస్తే పరిష్కారం అవుతాయని భావిస్తారని తెలిపారు. తీరా గ్రీవెన్స్ కు వచ్చాక ఆయన లేకుంటే ఇతర అధికారులు ఆమేరకు స్పందించడం లేదని ఆరోపించారు. దరఖాస్తు చేసుకున్నా ప్రజల సమస్యలు ఏళ్ళతరబడి పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసారు. కలెక్టర్ లేని రోజుల్లో గ్రీవెన్స్ నడపకూడదని సూచించారు. పదేపదే ఒక సమస్య కోసం ఎన్నిసార్లు పిటిషన్లు ఇవ్వాలని ఆవేదన వ్యక్తం చేసారు.

సంపాదకీయం

బలి పశువు బీరేన్ సింగ్

గత ఏడాది మే మూడవ తేదీ నుంచి మణిపూర్ మెయితీలకు, కుకీల మధ్య కలహాల్లో అగ్ని గోళంగా మారినా మోదీ చలించలేదు. దాదాపు గత 21 నెలల నుంచి మణిపూర్‌లో అల్ల కల్లోల పరిస్థితులు కొనసాగుతున్నా, దాదాపు 250 మంది కలహాలకు ఆహుతైనా, 70వేల మంది నిర్వాసితులైనా మోదీకి చీమ కుట్టినట్టయినా లేదు. మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌ను పావుగా వినియోగించుకుని మోదీ మెయితీ-కుకీ వర్గాల మధ్య తంపులు పెట్టి పబ్బం గడుపుకున్నారు. అధికారమే పరమావధి అయిన మోదీ హయాంలో రాజకీయాలు ఇంతకన్నా భిన్నంగా ఉంటాయని అనుకోవడం భ్రమ. 2002 గుజరాత్ మారణకాండ సమయంలో మోదీ ఎలా వ్యవహరించారో ఏడాది పై నుంచి మణిపూర్‌లో బీరేన్ సింగ్ కూడా అదే పని చేశారు. బీజేపీ అధికారంలో కొనసాగడం కోసం మెయితీలకు-కుకీలకు మధ్య చిచ్చు పెట్టారు. ఆ రెండు వర్గాలూ పరస్పర హననంలో పోటీలు పడ్డాయి. నెత్తురు ఏరులై పారింది. మహిళల మీద అత్యాచారాలు జరిగాయి. అత్యాచారాలకు గురైన మహిళలను నగ్నంగా ఊరేగించారు. దేశమంతా గగ్గోలు మొదలైంది. తరచుగా ప్రపంచాన్ని చుట్టబెట్టి వచ్చే, ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా పదులకొద్దీ ఎన్నికల సభల్లో ప్రసంగించడానికి తీరిక దొరికే మోదీకి అగ్ని గుండంలా మారిన మణిపూర్ వెళ్లడానికి మాత్రం మనసొప్పలేదు. తీరిక దొరకలేదు. ప్రతిపక్షాలు అక్కడ రాష్ట్రపతి పాలన విధించాలని సూచించినా ఆయన కిమ్మనలేదు. ఎట్టకేలకు మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ ఆదివారం రాజీనామా చేశారు. కాదు ఆయన చేత అమిత్ షా రాజీనామా చేయించారు. బీరేన్ సింగ్ సమర్థుడా, అసమర్థుడా అన్న విషయం చర్చనీయాంశం కాదు. కానీ మోదీ, అమిత్ షాకు తెలియకుండా ఆయన ఇన్నాళ్లూ వ్యవహరించారనుకోవడం భ్రమ. ఇప్పుడు బీరేన్ సింగ్ చేత రాజీనామా చేయించడం మణిపూర్ లో కలహాగ్ని చల్లార్చడానికి కాదు. మోదీ పలుకుబడి దెబ్బ తినకుండా చూడడానికే బీరేన్ సింగ్‌ను బలి పశువు చేశారు. ఇటీవల బయటకొచ్చిన బీరేన్ సింగ్ టేపులు ఆయనను బోనులో నిలబెట్టాయి. ఆ సెగ అమిత్ షాకు, మోదీకి కూడా తగలక మానదు. మణిపూర్ శాసనసభ బడ్జెట్ సమావేశాలు సోమవారమే ప్రారంభం కావాల్సి ఉంది. కానీ ప్రతిపక్షాలు ఆయన ప్రభుత్వం మీద అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నాయి. బీజేపీ శాసనసభ్యులే ఆయన మీద గుర్రుగా ఉన్నారు. వారు అవసరమైతే తమ ప్రభుత్వం మీద వచ్చే అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇచ్చే ప్రమాదం ఉంది. అప్పుడు బీజేపీ అసలు స్వరూపం బయట పడక తప్పదు. అగ్ర నాయకుడి పరువు పోవడం కన్నా ఒక బంటును బలిపెట్టడమే మేలనుకున్నారు. బీరేన్ చేత రాజీనామా చేయించారు. బీరేన్ టేపులు బీజేపీకి ప్రాణ సంకటంగా తయారైనాయి. ఆ టేపును మణిపూర్ హింసాకాండపై దర్యాప్తు జరుపుతున్న జ్యుడీషియల్ కమిషన్ కు అందచేశారు. ఈ టేపును 2023లో బీరేన్ నివాసంలోనే రికార్డు చేశారంటున్నారు. ఈ టేపులను పరిశీలించిన ట్రూత్ లాబ్ అనే సంస్థ ఆ టేపులలో ఉన్న గొంతు బీరేన్ గొంతుతో 93 శాతం సరిపోలుతోందని తేల్చింది. మణిపూర్ హింసా కాండలో బాంబులను వినియోగించడాన్ని కూడా బీరేన్ అనుమతించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆ టేపుల్లో ఉన్నది బీరేన్ గొంతేనని దీని మీద స్వతంత్ర సంస్థ చేత దర్యాప్తు చేయించాలని కుకీలకు సంబంధించిన మానవ హక్కుల సంఘం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ట్రూత్ లాబ్ ను సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎం.ఎన్.వెంకటాచలయ్య అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఆ ప్రయోగశాల నివేదికలను ఇంతకు ముందు కూడా న్యాయస్థానాలు ఆమోదించాయి. ఈ టేపుల్లో ఉన్న కంఠ ధ్వని 93 శాతం బీరేన్ గొంతుతో సరిపోలుతోందని ఆ ప్రయోగశాల నివేదిక ఇచ్చింది. ఈ టేపుల విషయాన్ని మరో మారు ఖరారు చేయడానికి గత మూడవ తేదీన సుప్రీంకోర్టు అనుమతించింది. ఈసారి ఈ టేపును పరీక్షించే బాధ్యత ప్రభుత్వ అధీనంలోని కేంద్ర ఫోరెన్సిక్ ప్రయోగశాలకు అప్పగించారు.

మణిపూర్ కుంపటి ఆరకపోవడం, బీరేన్ సింగ్ మీద ఆయన పార్టీకి చెందిన ఎమ్మెల్యేలే అసంతృప్తి వ్యక్తం చేయడం ఆయన అధికారంలో కొనసాగడం దుర్లభం అయిపోయింది. ప్రతిపక్షాలు ప్రతిపాదించాలనుకున్న అవిశ్వాస తీర్మానానికి బీజేపీ ఎమ్మెల్యేలే మద్దతు ఇస్తే ఆ పార్టీ అగ్ర నాయకుల పరువు మంటగలిసేది. మోదీ ప్రతిష్ఠ చెక్కు చెదరకూడదంటే బీరేన్ సింగ్‌ను బలి పెట్టక తప్పదనుకున్నారు. ఇటీవల మరి కొంత మంది బీజేపీ నాయకులు కూడా బీరేన్ మీద అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మణిపూర్ లో అగ్గి రగులుతున్నా గత 21 నెలల నుంచి బీజేపీ కేంద్ర నాయకత్వం ఆయనకు దన్నుగానే ఉంది. మెయితీలకు బీరేన్ నాయకుడిగా ఉన్నారు. వారి తరఫున ఆయనే మాట్లాడుతూ వచ్చారు. రాష్ట్రంలోని రెండు జాతుల వారు కలహించుకుంటున్నప్పుడు ముఖ్యమంత్రి స్థానంలో ఉన్నవారు ఒక వర్గాన్ని వెనకేసుకొస్తే ఎంతటి విపత్కర పరిస్థితి ఎదురవుతుందో మణిపూర్‌లో స్పష్టంగా రుజువైంది. బీరేన్‌ను మరి కొంతకాలం కొనసాగనిస్తే బీజేపీ కుటిల రాజకీయ బండారం బయట పడేది. బీరేన్ నిషేధంలో ఉన్న మెయితీ దళాల మద్దతు కూడా సమీకరించారు. ఆ రాష్ట్రంలో సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం అమలును ఉపసం హరించిన తరవాత మెయితీలు మరీ రెచ్చి పోయారు. మెయితీ దళాలు పోలీసు వాహనాలను కూడా వినియోగించడం ప్రభుత్వ పెద్దల ఆశీస్సులకు నిదర్శనం. ఇది అరాచకాన్ని ప్రోత్సహించడమే. రాష్ట్రంలోని కుకీల మీద కక్ష కట్టినట్టు ప్రవర్తించడమే. ఈ దళాలు రాష్ట్ర ఆయుధాగారాల నుంచి ఆయుధాలు లూటీ చేయడానికి కూడా బీజేపీ ప్రభుత్వం నిస్సిగ్గుగా అనుమతించింది. పార్లమెంటు నిండు కొలువులో కేంద్ర హోం మంత్రి ఇప్పటి దాకా బీరేన్ ను సమర్థిస్తూనే వచ్చారు. అంటే బీజేపీ కుత్సిత రాజకీయాల తీవ్రత ఏమిటో అర్థం చేసుకోవచ్చు. బీరేన్ ను వ్యతిరేకించే వారిని సాయుధులైన మెయితీలు బెదిరించారు. వారి ఆస్తులను ధ్వంసం చేశారు. బీజేపీ కేంద్ర నాయకత్వం, బీజేపీ శాసనసభ్యుల్లో ఎక్కువ మంది మద్దతు ఉన్నంత కాలం బీరేన్ కొనసాగారు. కానీ బీజేపీలోనే బీరేన్ మీద వ్యతిరేకత పెరగడంతో ఆయన చేత రాజీనామా చేయించక తప్పలేదు. బీజేపీలోని అసంతృప్త ఎమ్మెల్యేలు కాంగ్రెస్ ప్రతిపాదించదలచుకున్న అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇచ్చే దశకు వచ్చేటప్పటికి తమకే ఎక్కడ మోసం వస్తుందోనని భయపడ్డ బీజేపీ అధిష్ఠానం బీరేన్ చేత రాజీనామా చేయించింది. బీరేన్ తొలగినంత మాత్రాన మణిపూర్‌లో శాంతి నెలకొంటుందన్న ఆశ ఎటూ లేదు.

ఓటమి పాఠం నేర్వాలి

నిత్య చక్రవర్తి

దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపొంది పాలక ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఓటమి చెందడంతో ఇండియా ఐక్యసంఘటనకు గట్టి దెబ్బతగిలింది. అంటే దీని అర్థం ఆప్ లేదా ఇండియా ఐక్య సంఘటన అంతిమంగా కూలిపోయిందని కాదు. కొంతమంది మీడియా, టీవీ ఛానల్స్ వ్యాఖ్యాతలు ఆప్, ఇండియా ఐక్య సంఘటన పని అయిపోయిందని మాట్లాడు తున్నారు. గెలుపోటముల విషయాలను మాత్రమే గమనంలోకి తీసుకుని వ్యాఖ్యలు చేస్తున్నారు. రెండు దఫాలు ఆప్ గెలిచి పరిపాలించింది. దిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు నాలుగు రోజుల ముందు అంటే ఫిబ్రవరి 1వ తేదీన 2025-26 ఆర్థిక సంవత్సరానికి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనలలో 12లక్షల వరకు ఆదాయపు పన్ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం, 8వ వేతన కమిషన్ వేయడానికి అంగీకరించ దంతో మధ్యతరగతి వేతన జీవులు, ఇతరులు ఆకర్షితులై బీజేపీకి ఓటు వేశారనడంలో ఏ మాత్రం అనుమానంలేదు. రెండు పార్టీల మధ్య 2శాతం ఓట్లు మాత్రమే తేడా ఉంది. బడ్జెట్ ఆప్‌ని గణనీయంగా దెబ్బతీసింది. అంతమాత్రం చేత బీజేపీ గెలుపు, ఆప్ ఓటమికి మధ్య గొప్ప తేడా ఉందని భావించరాదు. దిల్లీ ఓటర్లలో మధ్యతరగతి వేతన జీవులు 1.56శాతం ఉన్నారు. దాదాపు వీరంతా బీజేపీకే ఓటు వేసి ఉంటారు. ఆదాయపు పన్ను ఊరట వీరిని ఎక్కువగా ప్రభావితం చేసింది. బీజేపీకి 45.56శాతం ఓట్లు లభించగా, ఆప్‌కి 43.57శాతం ఓట్లు వచ్చాయి. బీజేపీకి 48సీట్లు రాగా, ఆప్‌కి 22సీట్లు వచ్చాయి.

ఇండియా ఐక్య సంఘటనలో భాగస్వాము లైన ఆప్, కాంగ్రెస్ ఓట్లు కలిసి మొత్తం 50శాతం ఓట్లున్నాయి. సీట్ల విషయం చూస్తే, 14సీట్లు అదనంగా వచ్చేవి. రెండు పార్టీల మధ్య పొత్తు ఉన్నట్లయితే 70 సీట్లలో 36సీట్లు గెలిచి కనీస మెజారిటీతో విజయం పొందేవారు. దళితులు, పేదలు, ముస్లింలలో ఆప్ బలం ఇప్పటికీ అలాగే నిలిచింది. ఆప్ ఓట్లు పడిన విధానం ఈ విషయాన్ని ధృవీకరిస్తోంది. మధ్యతరగతి ఓటర్లు ఆప్ నుంచి బీజేపీకి బదిలీఅయ్యారు. పేదల ఓట్లు ఆప్, కాంగ్రెస్‌కు దాదాపు పదిలంగా ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల ముందు ఆప్, కాంగ్రెస్‌లు పొత్తు అంశంలో క్షేత్రస్థాయి పరిస్థితులను ఆలోచించలేదు. ఒక పార్టీపై మరోపార్టీ వ్యతిరేకంగా ఆలోచించాయి. ఈ ఎన్నికల్లోనే కాకుండా మధ్యప్రదేశ్, హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లో కూడా ఇదే విధంగా ఆలోచించి దెబ్బతిన్నాయి. ఇప్పటికైనా ఈ రెండు పార్టీలు క్షేత్రస్థాయి పరిస్థితిని లోతుగా పరిశీలించి సయోధ్య కుదుర్చుకోవాలి. ముఖ్యంగా కాంగ్రెస్ ఈ విషయంలో తప్పుదారి పడుతోంది. త్వరలో జరగనున్న ఎన్నికల్లోనైనా ఇండియా ఐక్యసంఘ టన పార్టీల మధ్య సయోధ్య కుదిరి కలిసికట్టుగా పోటీ చేసేలా చూడవలసిన పెద్దబాధ్యత కాంగ్రెస్ మీద ఉంది. ఓటమిని కేజ్రీవాల్ అంగీకరించి ప్రతిపక్షపార్టీగా బాధ్యతగా పనిచేస్తానని వాగ్దానం చేశారు. పార్లమెంటరీ వ్యవస్థలో ఇది ప్రజాస్వామ్య విధానం.

ప్రస్తుతం ఏర్పడనున్న రాజకీయ పరిస్థితిని పరిశీలించాలి. ఇంతవరకు ఆప్ పంజాబ్, దిల్లీ రాష్ట్రాల్లో పరిపాలిస్తోంది. ఇప్పుడు దిల్లీలో ఓటమిపాలైంది. పంజాబ్‌లో మాత్రమే అధికారంలో ఉంది. పంజాబ్ మీద బీజేపీ గట్టిగా దృష్టిపెడుతోంది. బీహార్‌లో ఎన్నికలు జరగనున్న దృష్ట్యా ఆ రాష్ట్రంపై ఉన్నతస్థాయి నాయకత్వం అన్ని రకాలుగా దృష్టి పెడుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపుకోసం ఎలాంటి విధాలనైనా ఆచరించేందుకు వెనుకాడకపోవచ్చు. ఈ సంవత్సరం చివరిలో పంజాబ్, బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. పంజాబ్‌లో ఆప్ ప్రభుత్వం ఒడిదుడుకుల పాలయ్యే అవకాశాలు న్నాయి. ఇందుకు బీజేపీ గట్టి ప్రయత్నం చేస్తోంది. దిల్లీ, పంజాబ్‌లో ఎన్నికల విధానంలో కొన్ని పోలికలున్నాయి. పంజాబ్‌లో ఆప్ గత ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించింది.

ఇండియా ఐక్య సంఘటనలో భాగస్వాము లైన ఆప్, కాంగ్రెస్ ఓట్లు కలిసి మొత్తం 50శాతం ఓట్లున్నాయి. సీట్ల విషయం చూస్తే, 14సీట్లు అదనంగా వచ్చేవి. రెండు పార్టీల మధ్య పొత్తు ఉన్నట్లయితే 70 సీట్లలో 36సీట్లు గెలిచి కనీస మెజారిటీతో విజయం పొందేవారు. దళితులు, పేదలు, ముస్లింలలో ఆప్ బలం ఇప్పటికీ అలాగే నిలిచింది

ఈ నేపథ్యంలో ఆప్‌ను ఓడించాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ క్రియాశీలంగా పనిచేస్తోంది. అదే సమయంలో బీజేపీ కూడా తన పరిస్థితిని రాష్ట్రంలో మరింత విస్తరించేందుకు చిన్నచిన్న పార్టీలను కొత్తగా తనతో కలుపుకునిపోయేందుకు ప్రయత్నం చేస్తోంది. ఇక్కడ కూడా ఆప్, కాంగ్రెస్‌పైన పోటీ చేయాలని బీజేపీ భావిస్తోంది. ఆప్,కాంగ్రెస్ పొత్తు కుదుర్చుకోకపోతే త్రిముఖ పోటీ జరుగుతుంది. మళ్లీ దిల్లీలో వచ్చిన ఫలితమే రావచ్చు. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని ఆప్, కాంగ్రెస్ పొత్తు కుదుర్చుకోవడం వల్ల మేలు జరగవచ్చు. బీహార్‌లో ఇండియా ఐక్య సంఘటన భాగస్వాములు కలిసికట్టుగా ఎన్నికలలో పాల్గొనవలసిన అవసరం ఎంతైనాఉంది. అది కూడా ఇప్పటికే పనిచేస్తున్న మహాఘట్‌బంధన్ ఎటువంటి అరమరికలు లేకుండా ఆర్‌జేడీ నాయకత్వంలో, నితీష్ కుమార్ నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని సమర్థ మంతంగా ఎదుర్కోవాలి. సీట్ల సర్దుబాటు విషయంలోనూ ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఎంతైనా అవసరం. ఎన్నికలకు చాలా ముందుగానే ఆర్‌జేడీ, కాంగ్రెస్ సీట్ల సర్దుబాటు విషయంలో చర్చించి సర్దుబాటు కుదుర్చుకుని కలిసికట్టుగా ప్రచారం సాగించాలి. బీహార్‌లో సీపీఐ(ఎమ్‌ఎల్) కు కార్మికవర్గంలో బలమైన పట్టు ఉంది. ఆర్‌జేడీ, కాంగ్రెస్, వామపక్షపార్టీలైన సీపీఐ, సీపీఐఎం, సీపీఐ(ఎమ్‌ఎల్) మధ్య పటిష్టమైన సయోధ్యకుదిరే అవకాశం ఉంది. వామపక్షాలు 2020 అసెంబ్లీ ఎన్నికల్లో 19సీట్లలో పోటీచేసి 12 సీట్లలో గెలుపొందాయి. 2025 అసెంబ్లీ ఎన్నికల్లో మరిన్ని సీట్లు గెలిచే అవకాశం ఉంది. ఆర్‌జేడీ ఈ అంశాన్ని గమనంలోకి తీసుకుని సహకరించవలసి ఉంది. హర్యానా, మహారాష్ట్ర, దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో చేసిన తప్పులను గుర్తించి సయోధ్యతో కలిసి పోటీచేసి తప్పనిసరిగా విజయం సాధించ వలసిన అవసరం ఇండియా ఐక్యసంఘటనకు ఉన్నది.

ఈ సంవత్సరం అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన బీజేపీ గట్టి విశ్వాసంతో పనిచేస్తోంది. మహారాష్ట్ర, హర్యానా, యూపీ ఉప ఎన్నికల్లో గెలుపొందిన ధీమాతో బీజేపీ పనిచేస్తోంది. గెలుపు ఓటములు సాధారణమే. అయితే ఓటమి నుంచి తగిన పాఠాలు నేర్చుకుని జరిగిన తప్పులను గుర్తించి వాటికి పరిష్కార మార్గాలను అనుసరించాలి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో జరిగిన తప్పులను గుర్తించిన బీజేపీ సరిదిద్దుకుని దిల్లీ ఎన్నికల్లో పోటీచేసి గెలుపొందింది. బీజేపీ విధానాన్ని గుర్తించి ఇండియా ఐక్య సంఘటన భాగస్వామ్యపార్టీలు కలిసికట్టుగా రానున్న ఎన్నికల్లో పోటీచేయాలి.

కుక్క కాపలా

చింతపట్ల సుదర్శన్

అరుగు మీద ఉషారుగా అటూ ఇటూ గెంతుతున్నది డాగీ. గోడకు ఆనుకుని కూచుని ఉన్న డాంకీ దానివైపే చూస్తూ ఉంది దిగులుగా. తనను తాను మరిచిపోయి అడుగులేస్తున్న డాగీ ఎందుకో డాంకీ వైపు చూసింది. ఇదేంటి డాంకీ ముఖంలో ఏదో తేడా కొడ్తున్నది అనుకుంది. అనుకున్నదే తడవు అడిగేసింది. అదేంటి 'బ్రో' ఏడుపు మొగం పెట్టావు. పేపర్లో ఏదైనా విషాద వార్తని నమిలేయ లేదు కదా అంది. లేదు. అదేం లేదు అని దాటవేయ బోయింది డాంకీ. లేదు అంటే ఏదో ఉందన్న మాటే. ఎలెక్షన్లో ఎంత ఖర్చు పెట్టినా ఎన్ని అచ్చక బుచ్చకములాడినా ఓడిపోయిన అభ్యర్థిలా అవుపడ్తున్నావు. అలసలెందుకు ఏడుస్తున్నావో చెప్పి ఏడవరాదూ అంది డాగీ చిరాగ్గా. మనుషులే అవసరం ఉన్నా లేకపోయినా అనవసరంగా ఏడుస్తారు. పక్కవాడు బాగుంటే ఏడుస్తారు. బాగుపడుతుంటే ఏడుస్తారు. అసలు ఏ చీకూ చింతా లేకుండా నవ్వే వాళ్లని చూసి ఏడుస్తారు. ఏడవటం, డ్రామాలాడటం మనుషులకు బాగా అలవాటు కాని గాడిదలు అనవసరంగా ఏడవవు అంది గట్టిగా డాంకీ.

మరయితే ఎందుకా ఏడుపు మొఖం. అనవసరంగా ఏడవవు

రంగస్థలం

గాడిదలన్నావు అంటే అవసరంగా ఏడుస్తాయనే కదా. ఇప్పుడు ఏ అవసరం మీద కళ్లు ఒత్తుకుంటున్నావో చెప్తావా మరి అంది డాగీ. నా కోసమా నాకు ఏమయ్యింది. చూడు ఎంత ఉత్సాహంగా ఎంత ఉల్లాసంగా ఉన్నానో, అంది డాగీ తోక ఎగరేస్తూ.

పాపం డాగీ ఇన్నాళ్లూ పొత్తులో ఉన్న పార్టీల్లా కల్సి ఉన్నాం. నీ 'అరుపు' వేరు, నా 'ఓండ్ర' వేరు. నీ పర్సనాలిటీ వేరు నా ఎత్తూ ఒడ్డూ వేరు. అయితేనేం ఏ సిద్ధాంతం లేని, పేపరు కోసమే కల్సి ఉండే పార్టీల వారిలా కల్సి ఉన్నాం. ఇప్పుడిక విడిపోక తప్పదేమో అంది డాంకీ. విడిపోవడానికి, ఎవరికి వారు మేమే గొప్ప అనుకోవడానికి మనమే పార్టీ కూటమిలోని వాళ్లం కాదే. అసలు పాయింటుకి రా అంది డాగీ. ఏం చెప్పను డాగీ నిన్ననే నవిలాను ఆ వార్త. అదేదో చట్టంలో కుక్కలను చంపే వెసులుబాటు ఉందని, 'డిస్ట్రాయ్' చేస్తే అనగా చంపేసే అనుమతి ఇవ్వమని మున్సిపాలిటీ వారు హైకోర్టుకు వెళ్లారంట.

నిర్ఘాంత పోయింది డాగీ. తను విన్నదేమిటో ఉన్న ఫళాన అర్థం కానేలేదు. ఏమిటీ ఏమన్నావు? అని ప్రశ్నించింది ముక్కులోంచి గాలి వేగంగా వదిలేస్తూ. నిన్న పేపర్‌లో నవిలిందే అన్నాను. కుక్కల స్టెరిలైజేషన్, వాక్సినేషన్‌కు గత ఐదేళ్లలో నలభై కోట్లు ఖర్చయినాయని అయినా సిటీలో నలభై వేలకు పైగా కుక్కకాటు కేసులున్నాయని వాదించారు మున్సిపాలిటీ వారు.

నలభై కోట్లు ఖర్చయినవా? ఎవరి జేబులోకి ఎన్ని వెళ్లినయో కూడా చెప్పలేక పోయేరా. పేరు కుక్కలది పెత్తనం మనుషులది. జనాభా విషయంలోను, కుల గణన విషయంలోను, ఓటర్ల జాబితాలోను, ఆదాయ వ్యయాల పద్దుల్లోను అన్నీ కాకి లెక్కలేగా వీళ్లు చూపించేది. వాళ్లూ వాళ్లే ఏమన్నా ఏడవనీ, లెక్కల్లో, అంకెల్లో గారడీలు చేసి మామూలు మనుషుల్ని తికమక పెట్టనీ కానీ మా కుక్కల సంగతి వాళ్లకెందుకు. కుక్క లెక్కలు వాళ్లకు అవసరమా? అంది డాగీ ఓ చోట కూలబడుతూ.

అసలుకే మోసం వస్తుంటే లెక్కల మాట ఎందుకులే? ముందు ప్రాణాల సంగతి చూసుకో కుక్కలన్నింటినీ చంపేస్తామంటున్నారు అంది డాంకీ. చంపేస్తారా? కుక్కలన్నింటినీ చంపేస్తారా? కుక్కలనేవే లేకుండా చేసి మనుషులు హాయిగా కులాసాగా ఉంటారా అంది డాగీ ఉక్రోషంగా. అన్నింటినీ అంటే అన్నిటినీ అనికాదు ప్రమాదకరమైన కుక్కల్ని చంపేస్తారట అని డాంకీ అంటుండగానే అరుగు ఎక్కిన అబ్బాయి, ప్రమాదకరమైనవి అంటే అరిచే కుక్కలా, కరిచే కుక్కలా. అరిచే కుక్కలు కరవవంటారు కానీ కొన్ని కరుస్తయి కదా. అలాగే అరవని కుక్కలు హఠాత్తుగా మీద పడి కండ పీకుతాయి కదా అన్నాడు.

వచ్చావా రా 'బ్రో' మీ మనుషులు తప్ప భూమ్మీద ఎవరూ బతకకూడదా. ఎక్కడో ఏదో కుక్క తిండి దొరక్క, ఎండకు ఎండి వానకు తడిసి అడిగే దిక్కుమొక్కూ లేక ఎవరినన్నా కరిచిందే అనుకో అంత మాత్రానికి కుక్కలన్నిటినీ చంపెయ్యాలా అంది డాగీ. అవును మరి మనుషులకో న్యాయం, పశువులకో న్యాయం. పెళ్లాన్ని చంపి ఉడకపెట్టే వాడొకడు, తండ్రి గొంతులో కత్తి ఒకడు దింపితే, తాత పొట్టలో కత్తి గుచ్చే వాడొకడు. ఇలాగ చంపే వాళ్లందరికీ బెయిళ్లూ, జెయిళ్లూ, సాక్ష్యాలూ, తీర్పులు, పెరోల్‌లు క్షమార్పణలు అంది డాంకీ. అసలు మనుషుల్లోనే ఉన్నారు అనేక మంది ప్రమాదకారులు. ముందు వారిని ఏరిపారేసే పని చెయ్యవచ్చుగా అనవసరంగా కుక్కల ప్రాణాలు తీయకపోతే అంది డాగీ.

మనుషుల్లోనూ కుక్కల్లా చచ్చే వాళ్లున్నారు. కాకపోతే అర్థబలం, అంగ బలం ఉన్నవాళ్లకి చట్టంలో ఉన్న లొసుగులు చుట్టంలా పని చేస్తయి అన్నాడు అబ్బాయి. ఏది ఏమైనా డాంకీ చెప్పిందాన్ని బట్టి కుక్కనైన నేను నా కుక్క ప్రాణాలకి కుక్కలా కాపలా కాయాలింక అన్నది డాగీ.

సాయుధ పోరాట సేనానులు -12

ఆర్వీ రామారావ్

గొప్ప పోరాట స్ఫూర్తి, సమకాలీన సామాజిక పరిస్థితులపై అవగాహనఉంటే కొద్ది మంది అయినా తమ వర్గ స్వభావాన్ని విడనాడగలుగుతారు. తెలంగాణ సాయుధ పోరాట సమయంలో భూస్వాముల కుటుంబాల్లో పుట్టిన చాలా మంది తమ భూములను పేదలకు పంచేసి తుపాకీ పట్టుకుని సాయుధ రైతాంగ పోరులో భాగస్వాములయ్యారు. మల్లు స్వరాజ్యం అలాంటి వారే. దాదాపు ఆమె కుటుంబం అంతా సాయుధ పోరాటంలో పాల్గొన్న వారే. ఆమె తండ్రి ఆమెకు సామ్రాజ్యం అని పేరు పెట్టాలనుకుంటే తల్లి చొక్కమ్మ స్వరాజ్యం అని పేరు పెట్టారు. నిజంగానే నిజాం నిరంకుశ పాలన నుంచి హైదరాబాద్ సంస్థానానికి విముక్తి కల్పించిన వారిలో భాగస్వామి అయి స్వరాజ్యం తన తల్లి పెట్టిన పేరును సార్థకం చేశారు.

ప్రజలను సమీకరించడం, గడీలోని దొరల మీద తిరుగుబాటు చేయడం, పేదలకు ధాన్యం పంచి పెట్టడంతో ఆమె ఇంటిని పోలీసులు తగులబెట్టారు. సాయుధ పోరాట కాలంలో ఆమెను పట్టి ఇచ్చిన వారికి పదివేల రూపాయల బహుమతి ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఆమెపేరు చెప్తేనే పోలీసులకు హడల్. ఆమె వడిశెలతిప్పి రాయి విసిరితే పోలీసులు పరారయ్యేవారు. మల్లు స్వరాజ్యం పుట్టింది 500 ఎకరాలున్న మోతుబరుల ఇంట్లోనే. కానీ తన అన్న

భీమిరెడ్డి నరసింహారెడ్డి అడుగు జాడల్లో ఆమె 16వ ఏటనే సాయుధ పోరాటంలో భాగస్వామి అయ్యారు. ఆమె భర్త మల్లు వెంకట నరసింహారెడ్డి కూడా సాయుధ పోరాటంలో భాగస్వామే. వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో ప్రజలను చైతన్య పరచడానికి స్వరాజ్యం చేసిన కృషి అపారమైంది. ఆమె గేయాలు పాడి ప్రజలను ఆకట్టుకునేవారు. ఆమె తల్లి చొక్కమ్మ స్వయంగా పోరాటంలోకి దిగినా తన పిల్లలను ప్రోత్సహించారు. మహిళలను చైతన్యవంతం చేయడానికి స్వరాజ్యం చేసిన కృషి స్ఫూర్తి దాయకం అయింది. ముదిమి వయసులో కూడా ఆమె యువతను మీకు పోరాడే శక్తి ఉందా అని ప్రశ్నించేవారు. సాంస్కృతిక రంగంలోనూ ఆమె కృషి ఎన్నదగింది. స్వయంగా పాడేవారు. పాటలు కట్టేవారు. నల్లగొండ జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం నుంచి సీపీఐ(ఎం) అభ్యర్థిగా ఆమె 1978లో శాసనసభకు ఎన్నికయ్యారు. మళ్లీ ఆమె 1983లోనూ అదే నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు. మల్లు స్వరాజ్యం పేల్చిన తూటాలు నిజాం బలగాలను, రజాకార్లను భయకంపితం చేస్తే ఆమె మాటలు, ప్రసంగాలు ప్రజలను కదిలించేవి. భూమికోసం పోరాటం, మద్యపాన నిషేధ ఉద్యమం, మహిళా విముక్తి పోరాటం-వెరసి సకల పోరాటాల్లోనూ స్వరాజ్యం చూపిన ధైర్య సాహసాలు నిరుపమాన మైనవి. సాయుధ రైతు ఉద్యమ

సమయంలో తాను పేల్చిన బుల్లెట్ల మాదిరిగానే పాలక వర్గాన్ని తీవ్రంగా, కచ్చితంగా తాకిన శక్తిమంతమైన వక్త అయిన కామ్రేడ్ స్వరాజ్యం ప్రజల హృదయాలను కూడా కదిలించి, వారి హక్కుల కోసం పోరాడటానికి వారిని సమీకరించగలదు. భూమి కోసం పోరాటం, మద్యపాన నిషేధం లేదా మహిళా విముక్తి కోసం పోరాటం ఏదైనా, ఆమె ప్రజలను కార్యాచరణకు ప్రేరేపించింది. ఆమె బోధించిన విలువలకు సజీవ ఉదాహరణగా నిలిచారు.

మంచం పట్టినప్పుడు కూడా, ఆమె సీపీఐ(ఎం) మహిళా సంఘం కార్యాలయంలోనే ఉండడానికి ఇష్టపడ్డారు. మహిళా కార్యకర్తలతో తన చివరి రోజులను గడిపారు. తన తల్లి నుంచి అలవడిన మానవతా విలువలతో పెరిగిన స్వరాజ్యం చిన్నప్పటి నుంచీ పేదలతో కలిసిపోయి బాల్య వివాహాలు, కుల వివక్ష వంటి భూస్వామ్య, తిరోగమన సంప్రదాయాలను వ్యతిరేకించారు. కమ్యూనిస్టుపార్టీ ఇచ్చిన పిలుపుమేరకు స్వరాజ్యం పోరాటంలోచేరి పోలీసులకు దొరకకుండా మారుపేర్లతో ప్రజల మధ్యకు వెళ్లి ఉద్యమాన్ని నిర్వహించారు. ఆమె సమ్మక్కగా గిరిజనుల మధ్యకు వెళ్లారు. రాజక్క ఆమె మరో పేరు. 'రాజక్క దళం' అనే మహిళా విప్లవకారుల బృందానికి నాయకత్వం వహించారు.

త్వరగా జనగణన

కేంద్రాన్ని డిమాండ్ చేసిన సోనియా

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం వీలైనంత త్వరగా జనగణన చేపట్టాలని కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ డిమాండ్ చేశారు. 140 కోట్ల మందికి ఆహార భద్రత కల్పించాలనే ఉద్దేశంతో యూపీఏ హయాంలో తాము జాతీయ ఆహార భద్రతా చట్టం తీసుకొచ్చామని, జనగణన జరగకపోవడం వల్ల 14 కోట్ల మంది ప్రజలు జాతీయ ఆహార భద్రతా చట్టం ప్రయోజనాలు కోల్పోతున్నారని సోనియా చెప్పారు. 2011 జనాభా లెక్కలనే పరిగణనలోకి తీసుకోవడం వల్ల ఇలా జరుగుతోందని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం త్వరగా జనగణన నిర్వహించాలని కోరారు. 2013 సెప్టెంబరులో తాము రూపొందించిన ఎన్ఎఫ్ఎస్ఏ చట్టం దేశంలోని 140 కోట్ల జనాభాకు పోషకాహార భద్రత కల్పించడంలో ఓ మైలురాయిగా మారిందని అన్నారు. ముఖ్యంగా కోవిడ్ సమయంలో ఈ చట్టం లక్షలాది కుటుంబాల కడుపు నింపిందని గుర్తుచేశారు. త్వరగా జనగణన చేపట్టడం వల్ల ఎన్ఎఫ్ఎస్ఏ కింద ఎందరో పేదలు లబ్ధి పొందుతారని అన్నారు. ప్రజలకు ఆహార భద్రత ప్రత్యేక హక్కు కాదని, అది ముమ్మాటికీ ప్రాథమిక హక్కు అని సోనియాగాంధీ స్పష్టంచేశారు. రాజ్యసభ సమావేశంలో పాల్గొన్న సోనియాగాంధీ జీరో అవర్‌లో ప్రజల ఆహార భద్రత గురించి ప్రసంగించారు. స్వతంత్ర భారతదేశంలో మొట్టమొదటిసారిగా ఎన్డీఏ పాలనలో దేశంలో జనాభా గణన నాలుగేళ్లకు పైగా జాప్యం జరిగిందని సోనియా విమర్శించారు. వాస్తవానికి 2021లోనే జనగణన నిర్వహించాల్సి ఉండగా కేంద్ర ప్రభుత్వం దానిని విస్మరించిందని అన్నారు. తిరిగి ఎప్పుడు చేపడతారనే విషయంపై ఇప్పటి వరకు స్పష్టత లేదని అసహనం వ్యక్తంచేశారు. జాతీయ ఆహార భద్రతా చట్టం ద్వారా 2011 జనాభా లెక్కల ప్రకారం దాదాపు 81.35 కోట్లమంది ప్రజలు లబ్ధి పొందారని సోనియా తెలిపారు. గ్రామీణ జనాభాలో 75 శాతం, పట్టణ జనాభాలో 50 శాతం ప్రజలు దీనిద్వారా ప్రయోజనం పొందారన్నారు.

ప్రపంచంలో అతిపెద్ద ట్రాఫిక్ జామ్

- 300 కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు
- కుంభమేళా భక్తుల కష్టాలు

లక్నో: ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో కొనసాగుతున్న మహా కుంభమేళా ముగింపు తేదీ గడువు సమీపిస్తున్న తరుణంలో ప్రపంచ నలుమూలల నుంచి భక్తులు పోటెత్తుతున్నారు. ఫలితంగా కుంభమేళా వెళ్లే మార్గంలో ప్రపంచంలోనే అతిపెద్ద ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సుమారు 300 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. శనివారం నుంచి లక్షల వాహనాలు ప్రయాగ్‌రాజ్ వైపు మళ్లాయి. దీంతో భక్తులు త్రివేణి సంగమం (గంగ, యమునా, సరస్వతి నదుల సంగమం) వద్ద పవిత్ర స్నానమాచరించేందుకు సమయానికి చేరుకోలేకపోతున్నారు. రోజుల సమయం పట్టనున్నడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. భక్తుల తాకిడి ఎక్కువ కావడంతో ప్రయాగ్‌రాజ్ సంగం రైల్వే స్టేషన్‌ను అధికారులు శుక్రవారం వరకు మూసివేశారు. ప్రయాగ్‌రాజ్ ప్రవేశం సమీపంలో నవాబగంజ్‌లో 30 కిలోమీటర్లు, గౌహనియాలో 16 కిలోమీటర్లు, వారణాసి మార్గంలో 12 నుండి 15 కిలోమీటర్ల ట్రాఫిక్ జామ్ ఉంది. ట్రాఫిక్ జామ్ వల్ల జనజీవనం స్తంభించింది.

గంటలపాటు ట్రాఫిక్‌లోనే

ప్రయాగ్‌రాజ్ వైపు వెళ్లే మార్గాలన్నీ వాహనాలతో కిక్కిరిపోతున్నాయి. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్, సివనీ, కట్నీ, మైహర్, సాత్నా, రివా జిల్లాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. దాదాపు 200–300 కి.మీ మేర ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయినట్లు ఎంపీ పోలీసులు చెబుతున్నారు. 50 కి.మీ మేర దూరానికే 10 నుంచి 12 గంటల సమయం పడుతుందని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రయాగ్‌రాజ్‌కు వెళ్తున్న వాహనాల రద్దీ దృష్ట్యా... మధ్యప్రదేశ్‌లోని అనేక జిల్లాల్లో ట్రాఫిక్‌ను ఎక్కడికక్కడే నిలిపివేశారు.

ఇదేమి నిర్వహణ: అఖిలేశ్

కుంభమేళాలో ట్రాఫిక్ కష్టాలపై సమాజ్‌వాది పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ మండిపడ్డారు. ఇదేమి నిర్వహణ అంటూ యూపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కుంభమేళా నిర్వహణలో యోగి ప్రభుత్వ వైఫల్యం కారణంగానే ప్రయాగ్‌రాజ్ ప్రజలు ట్రాఫిక్ కష్టాలు ఎదుర్కొంటున్నారని సోషల్ మీడియా వేదికగా విమర్శించారు. ప్రతిచోట వాహనాల రద్దీ నెలకొనడంతో భక్తులకు ఆహార ధాన్యాలు, కూరగాయలు, ఔషధాలు, పెట్రోల్, డీజిల్ వంటివి అందటం లేదన్నారు. దీంతో కోట్లాది మంది ప్రజలకు ఆకలిదప్పులు తప్పట్లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ట్రాఫిక్ రద్దీ పెరుగుతుండడంతో భక్తులు ఆహారం, విశ్రాంతి లేక నీరసించిపోతున్నారని పేర్కొన్నారు. ఆదివారం ప్రయాగ్‌రాజ్‌కు భక్తులు పెద్దఎత్తున పోటెత్తడంతో వందల కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయిన దృశ్యాలను అఖిలేశ్ సోషల్ మీడియాలో పంచుకున్నారు. రాష్ట్రంలో రాజ్యాంగ వ్యవస్థ విఫలమయినప్పుడు ప్రభుత్వాన్ని అధికారం నుంచి తప్పిస్తారు. అదేవిధంగా అసమర్థులు చేసే అసత్య ప్రచారాలను నమ్మకుండా కుంభమేళా వైఫల్యాన్ని విశ్లేషించి... ప్రజలు సమర్థుడైన వ్యక్తికి పరిపాలనా బాధ్యతలు అప్పచెప్పాలి' అని పేర్కొన్నారు.

గూగుల్‌లో చూసి వెళ్లండి: మధ్యప్రదేశ్ సీఎం

భోపాల్: మహా కుంభమేళాలో భక్తుల రద్దీ కొనసాగుతుండటంతో మధ్యప్రదేశ్ నుంచి ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లే మార్గాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. వాహనాల రద్దీ దృష్ట్యా... రాబోయే రెండు రోజులపాటు ప్రయాగ్‌రాజ్ వైపు వెళ్లొద్దని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ యాత్రికులకు సూచించారు. ట్రాఫిక్ పరిస్థితులను గూగుల్‌లో చూసుకుంటూ ముందుకు సాగాలన్నారు. 'ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలతో రివాంచల్‌తోపాటు ప్రయాగ్‌రాజ్‌కు సమీపంలో ఉన్న జిల్లాలపై ట్రాఫిక్ ఒత్తిడి పెరిగింది. మరో రెండురోజులు ఈ మార్గంలో వెళ్లవద్దని అందరికీ విజ్ఞప్తి చేస్తున్నా. గూగుల్‌లో చెక్ చేసుకొని... రద్దీ లేకుంటే ముందుకు సాగాలని కోరుతున్నా. ఆ మార్గంలో ఏమైనా ట్రాఫిక్ ఇబ్బందులుంటే అనువైన ప్రదేశంలో వేచి ఉండండి' అని ముఖ్యమంత్రి సూచించారు. ప్రయాగ్‌రాజ్‌కు భారీ సంఖ్యలో తరలిరావడం శుభపరిణామమే అయినప్పటికీ వారి సురక్షిత ప్రయాణం, భద్రతపై ఆందోళన చెందుతున్నామన్నారు. రద్దీకి అనుగుణంగా మహా కుంభమేళాలో ఏర్పాట్లు కల్పించడం సవాలుగా మారిందని, ప్రయాగ్‌రాజ్ యంత్రాంగంతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు చేస్తున్నామని సీఎం యాదవ్ పేర్కొన్నారు.

హైకోర్టు కేసులన్నీ వాయిదా



లక్నో: ఉత్తప్రదేశ్‌లో జరుగుతున్న మహాకుంభ్‌లో పుణ్య స్నానాలు ఆచరించేందుకు దేశం నలుమూలల నుంచి కోట్లాది మంది భక్తులు వస్తుండడంతో ప్రయాగ్‌రాజ్ దారులన్నీ కిక్కిరిసిపోతున్నాయి. వందల కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోతోంది. దీనివల్ల... అలహాబాద్ హైకోర్టులో గత కొన్ని వారాల నుంచి కేసులన్నీ పెండింగ్ పడుతున్నాయి. పిటిషన్‌దారులు నిర్ధారిత సమయానికి కోర్టుకు రాలేకపోతున్నారు. గత్యంతరం లేక ఆ కేసులను వాయిదా వేస్తున్నారు. ఆల్ట్‌న్యూస్ జర్నలిస్టు, ఫ్యాక్ట్ చెకర్ మొహమ్మద్ జుబేర్ దరఖాస్తు చేసుకున్న పిటిషన్‌పై సోమవారం అలహాబాద్ కోర్టులో విచారణ జరగాల్సి ఉంది. ఘజియాబాద్ దస్నా దేవి ఆలయం కేసులో నమోదు అయిన క్రిమినల్ కేసును కొట్టివేయాలని జుబేర్ పిటిషన్ వేశారు. ఆ కేసును అలహాబాద్ కోర్టు వాయిదా వేసింది. కుంభమేళా వల్ల ట్రాఫిక్ జామ్ అధికంగా ఉందని, దీంతో పిటిషనర్లు కోర్టుకు హాజరుకాలేకపోయినట్లు జస్టిస్ సిద్ధార్థ వర్మ, జస్టిస్ యోగేంద్ర కుమార్ శ్రీవాత్సవ్ ధర్మాసనం పేర్కొంది. ట్రాఫిక్ నిబంధనల వల్ల ఎటువంటి ఆదేశాలు ఇవ్వలేకపోతున్నట్లు కోర్టు తెలిపింది. ఇరు పార్టీలకు చెందిన వారు హాజరుకాలేకపోయినట్లు కోర్టు తెలిపింది. దీంతో జుబేర్‌కు ఈ నెల 17వ తేదీ వరకు అరెస్టు నుంచి తాత్కాలిక ఉపశమనం లభించింది.

త్రివేణి సంగమంలో రాష్ట్రపతి పుణ్యస్నానం

ప్రయాగ్‌రాజ్: మహా కుంభమేళాలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సోమవారం పాల్గొన్నారు. ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమం వద్ద ఆమె పుణ్యస్నానం ఆచరించారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో కుంభమేళాలో భద్రత కట్టుదిట్టం చేశారు. ప్రయాగ్‌రాజ్ చేరుకున్న రాష్ట్రపతికి ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్వాగతం పలికారు. తర్వాత వారితో కలిసి ద్రౌపదీ ముర్ము బోటులో పర్యటించారు. మార్గమధ్యంలో వలస పక్షులకు ఆమె ఆహారం అందించారు. అనంతరం త్రివేణి సంగమం వద్దకు చేరుకొని పుణ్యస్నానమాచరించి... పూజలు చేశారు. 144 ఏళ్లకోసారి వచ్చే ఈ మహా కుంభమేళా జనవరి 13న ప్రారంభం కాగా... భారత్‌తోపాటు విదేశాల నుంచి భారీసంఖ్యలో భక్తులు హాజరవుతున్నారు. ఫిబ్రవరి 26 వరకు ఈ వేడుక జరగనుంది. ఇప్పటివరకు పెద్దసంఖ్యలో రాజకీయ, సినీ, వ్యాపారరంగాలతో పాటు ప్రముఖులు, సామాన్య పౌరులు కలిపి 44 కోట్ల మంది పుణ్యస్నానం ఆచరించారని యూపీ ప్రభుత్వ వెల్లడించింది.

మంచినీళ్లే లేవు... సైకిల్ ట్రాక్‌లు కావాలా

పిటిషనర్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ప్రత్యేక సైకిల్ ట్రాక్‌లు నిర్మించాలంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సైక్లింగ్ ప్రమోటర్ దేవిందర్ సింగ్ నాగి వేసిన పిటిషన్‌పై ధర్మాసనం విచారించింది. ప్రజలకు ఇళ్లు నిర్మించేందుకు ప్రభుత్వాల వద్ద తగినన్ని నిధులు లేవని, బస్తీ ప్రజలకు మంచినీళ్లు కూడా అందించలేకపోతున్నారని, ఇలాంటి సందర్భాల్లో మీకు సైకిల్ ట్రాక్‌లు కావాలని పగటి కలలు కంటున్నారా అని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, ఉజ్వల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. ప్రజలకు కావాల్సిన ప్రాముఖ్యతలపై దృష్టి పెట్టాలని ధర్మాసనం తెలిపింది. మురికి వాడలకు వెళ్లండి... అక్కడ ప్రజలు ఏ స్థితిలో బతుకుతున్నారో చూడండి, ప్రజలకు ఇళ్లు కట్టించేందుకు ప్రభుత్వం వద్ద కావాల్సినంత డబ్బు లేదు, కానీ మీరు మాత్రం సైక్లింగ్ ట్రాక్‌ల గురించి కలలు కంటున్నారని కోర్టు పేర్కొంది. ప్రాముఖ్యతల విషయంలో తప్పుదోవ పడుతున్నామని, ప్రాధాన్యతలను సరైన మార్గంలో పెట్టాలని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 గురించి ఎక్కువ ఆందోళన చెందాల్సిన అవసరం ఉందని, ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీరు అందడం లేదని, ప్రభుత్వ స్కూళ్లను మూసివేస్తున్నారని, ఇలాంటి టైంలో మీకు సైకిల్ ట్రాక్‌లు కావాల్సి వస్తోందా అని కోర్టు మందలించింది. అనేక రాష్ట్రాల్లో సైకిల్ ట్రాక్‌లు ఉన్నాయని, సుప్రీంకోర్టు బయట కూడా ఓ సైకిల్ ట్రాక్ ఉన్నట్లు పిటిషనర్ దేవిందర్ పేర్కొన్నారు.

చెత్తకుప్పలో రాకెట్లు... పోలీసులు స్వాధీనం

చండీగఢ్: పంజాబ్‌లోని పాటియాలాలో అనుమానిత సామగ్రి ఉన్నట్టు సమాచారం అందడంతో పోలీసులు సోదాలు చేపట్టారు. చెత్తకుప్పలో ఉన్న సుమారు 10 రాకెట్లకు చెందిన అమ్యునీషన్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే... రాజ్‌పురా రోడ్డు మార్గంలో ఉన్న ఓ చెత్తకుప్పలో ఆ రాకెట్ సామాగ్రిని స్థానికులు కనుగొన్నారు. అనుమానిత సామాగ్రి ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. అధికారులు ప్రస్తుతం ఆ ప్రాంతాన్ని సీజ్ చేశారు. అక్కడ దర్యాప్తు ప్రారంభించారు. 2022లో పంజాబ్‌లోని తార్న్ తరన్ జిల్లా పోలీసు స్టేషన్‌పై రాకెట్ ప్రొపెల్డ్ గ్రెనేడ్(ఆర్పీజీ) దాడి జరిగింది. పాటియాలా నుంచి ఆ పోలీసు స్టేషన్ సుమారు 200 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఆ మధ్యే మొహాలీలోని పంజాబ్ పోలీసు ఇంటెలిజెన్స్ ఆఫీసుపై కూడా దాడి జరిగిన విషయం తెలిసిందే.

యమునా శాపంతోనే ఓటమి: ఢిల్లీ ఎల్జీ

న్యూఢిల్లీ: ఆమ్‌ఆద్మీ పార్టీ నేత ఆతిశీ ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. లేఖ సమర్పించడానికి ఆమె రాజ్‌భవన్‌కు వెళ్లారు. లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాకు ఆతిశీ రాజీనామా పత్రాన్ని ఇచ్చిన సమయంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేసినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ప్రజాసమస్యలపై పదేపదే హెచ్చరించినా ఆప్ నేతలు పట్టించుకోలేదని, యమునా నది శాపం వల్లే ఆమ్‌ఆద్మీ పార్టీ ఢిల్లీ ఎన్నికల్లో పరాజయం పొందిందని ఆతిశీతో ఆయన అన్నట్లు సమాచారం. శాసనసభ ఎన్నికల్లో ఢిల్లీలో ఆప్ ఓటమి వెనుక దేశ రాజధానిలోని అనేక సమస్యలతో పాటు యమునా నదీజలాల వివాదం కూడా కీలకపాత్ర పోషించినట్లు ప్రచారం జరుగుతోంది. యమునా నది ఢిల్లీలో 52 కి.మీ. పొడవునా ప్రవహిస్తుంది. 15 నియోజకవర్గాల మీదుగా వెళ్లే ఈ నది చాలాకాలం నుంచి పర్యావరణపరంగా నిర్లక్ష్యానికి గురైంది. ఈ నదిని ప్రక్షాళన చేస్తానని ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ 2020లో హామీ ఇచ్చారు. దీనిని నిలబెట్టుకోకపోవడంపై ఎన్నికల ప్రచారంలో బీజేపీ ఆరోపణలు చేసింది. దీంతో కేజ్రీవాల్ మండిపడి ఢిల్లీ ప్రజలకు హాని తలపెట్టేందుకు బీజేపీ పాలిత హర్యానా ప్రభుత్వం ఈ నదీజలాలను విషపూరితం చేస్తోందని ఆరోపించారు. దీనిని బీజేపీ భావోద్వేగ అంశంగా మార్చుకుంది.

ఒత్తిడికి దూరంగా ఉండండి

పరీక్షాపే చర్చలో విద్యార్థులకు మోదీ సలహాలు

న్యూఢిల్లీ: పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రయత్నించారు. ఇందుకుగాను ఈ ఏడాది కూడా ఆయన సోమవారం 'పరీక్షా పే చర్చా' కార్యక్రమం నిర్వహించారు. దీనికి సంబంధించిన వీడియోను ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. ఢిల్లీలోని సుందరవనంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇంతకుముందు ఒక పెద్ద హాల్‌లో పరీక్షలకు సంబంధించిన అనుమానాలు, ఒత్తిడి తట్టుకోవడం ఎలా అనే అంశాలపై వివరించే మోదీ... ఈసారి భిన్నంగా విద్యార్థులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమం కోసం 3.15 కోట్ల మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకోగా, వారిలో 19.80 లక్షల మంది టీచర్లు, 5.20 లక్షల మంది తల్లిదండ్రులు ఉన్నారు. నేరుగా 36 మంది, మిగతావారంతా వర్చువల్‌గా పాల్గొన్నారు. సుందరవనంలో విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ప్రధాని బదులిచ్చారు. పరీక్షలే సర్వస్వం కాదని, మనం రోబోలం ఎంతమాత్రం కాదని, మనషులమని, ఒక దగ్గరే గిరిగీసుకొని ఉండొద్దని విద్యార్థులకు మోదీ సూచించారు. 'బయటినుంచి వచ్చే ఒత్తిడి మీద కాకుండా చదువుమీద దృష్టిపెట్టాలి. స్టేడియంలో వీక్షకులు కేకలేస్తూ, కేరింతలు కొడుతూ ఎంతగా శబ్దాలు చేస్తున్నా... బ్యాటర్ దృష్టి మాత్రం బంతిపైనే ఉంటుంది. అలాగే విద్యార్థులు కూడా నేర్చుకోవడంపైనే దృష్టిపెట్టాలి' అని మోదీ హితబోధ చేశారు. కంటినిండా నిద్ర, సమతుల ఆహారం ముఖ్యమని, ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. 'ప్రతి విద్యార్థికి భిన్నమైన నైపుణ్యం ఉంటుంది. కొంతమంది చదువులో ముందుంటారు. మరికొందరికి మంచి డ్రెస్సింగ్ స్టైల్ ఉంటుంది. విద్య సమగ్ర అభివృద్ధి కోసం ఉద్దేశించినది. విద్యార్థులు నాలుగు గోడలకే పరిమితం కాకూడదు. వారు తమ అభిరుచుల వైపు మళ్లేందుకు స్వేచ్ఛ అవసరం. పరీక్షలే సర్వస్వం అనే భావనలో జీవించకూడదు. పిల్లలకు సలహాలు ఇవ్వకూడదు. వారిలో ఎలాంటి నైపుణ్యాలు ఉన్నాయో గమనించాలి. వారిలో ఉన్న విశిష్ట ప్రతిభను వెలికితీయాలి' అని చిన్నారులు, టీచర్లకు మోదీ సూచించారు. ఈ సందర్భంగా క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌ను ప్రధాని ఉదహరించారు. 'సచిన్‌కు చదువు కంటే ఆటల మీదే ఆసక్తి ఎక్కువ ఉండేది. దాన్ని గుర్తించిన అతడి తల్లిదండ్రులు ఆ దిశగా ప్రోత్సహించారు' అని ప్రధాని గుర్తుచేశారు. 'సమయపాలన అన్నింటికంటే ముఖ్యం. రేపు మీరు ఏం చేయాలని అనుకుంటున్నారో ఒక కాగితం మీద రాసుకోవాలి. ఏ పని కోసం ఎంత సమయం వెచ్చించాలో ఆలోచించుకోండి. మీకు ఇష్టమైన సబ్జెక్ట్‌కు ఎక్కువ సమయం, ఇష్టం లేని దానికి తక్కువ సమయం కేటాయించొద్దు. దానికి భిన్నంగా చేయండి. కష్టమైన పాఠ్యాంశాన్ని సవాలుగా స్వీకరించండి' అని సలహా ఇచ్చారు. కాగా, కేరళ నుంచి వచ్చిన విద్యార్థి ఆకాన్షా ప్రధాని మోదీని హిందీలో పలకరించారు. దాంతో ఆశ్చర్యపోయిన ఆయన... ఇంత చక్కగా హిందీ ఎలా నేర్చుకున్నావని ప్రశ్నించారు. 'నాకు హిందీ అంటే చాలా ఇష్టం. నేనొక కవిత కూడా రాశా' అంటూ దానిని చదివి వినిపించారు. మీరు ప్రధాని కాకపోయి ఉంటే ఏ మంత్రిత్వ శాఖ తీసుకుంటారని ఓ విద్యార్థి మోదీని అడిగారు. దీనికి ఆయన బదులిస్తూ.. 'నైపుణ్యాభివృద్ధి శాఖ అంటే ఆసక్తి' అని ఆయన చెప్పారు.

రక్షణరంగంలో శరవేగంగా భారత్

ఏరో ఇండియా షో ప్రారంభోత్సవంలో రాజ్‌నాథ్

బెంగళూరు: బెంగళూరులోని యలహంక వైమానిక కేంద్రంలో ఏరో ఇండియా 2025 షో ప్రారంభమైంది. ఇది 14వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడుతూ 'భారత్‌లో మహాకుంభ మేళా జరుగుతోంది. ఏరో ఇండియా రూపంలో మరో మహాకుంభ మేళా ఇక్కడ మొదలైంది. ప్రయాగ్‌రాజ్‌లోది ఆత్మపరిశీలనకు... బెంగళూరులోది సృజనాత్మకత, పరిశీలన కోసం. అక్కడిది అంతర్గత సమైక్యత కోసమైతే... ఇక్కడిది బాహ్యభద్రత కోసం. ఏరో ఇండియా మహాకుంభ మేళాలో భారత్ శక్తి కనిపిస్తుంది. వికాస్ భీ.. విరాసత్ భీ అన్న మోదీ నినాదానికి అనుగుణంగా ఉంది. గత ఏరో ఇండియా నుంచి ఇప్పటివరకు మేము చాలా పురోగతి సాధించాం. అస్త్ర క్షిపణి, కొత్తతరం ఆకాశ్ క్షిపణి, అండర్ వాటర్ అటానమస్ వెహికల్, అన్‌మ్యాన్డ్ సర్ఫేస్ వెస్సల్ వంటివి ఉన్నాయి. భవిష్యత్తులో మరింత వేగంగా ముందుకువెళతాం' అని చెప్పారు. కర్నాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ 'దేశలో వైమానిక రంగానికి బెంగళూరు రాజధాని. సృజనాత్మకత, ప్రపంచస్థాయి భాగస్వామ్యాలను ఆకర్షించేందుకు కర్నాటక ఎప్పుడూ ముందుంటుందన్నారు. దేశ ఏరోస్పేస్, రక్షణ రంగాల పరిశోధనల్లో 60 శాతం ఇక్కడి నుంచే వస్తాయి. వాణిజ్య, రక్షణ విమానాశ్రయాలు నిర్వహిస్తున్న ఏకైక నగరం బెంగళూరే' అని పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో 27 దేశాల రక్షణ మంత్రులు, డిప్యూటీ మంత్రులు, 15 దేశాల రక్షణ, సేవారంగాల అధిపతులు, 12 దేశాల రక్షణశాఖ కార్యదర్శులు పాల్గొన్నారు. మొత్తం 80 దేశాలకు చెందిన ప్రతినిధులు ఈ వేదిక నుంచి తమ రక్షణ ఉత్పత్తులను ప్రదర్శిస్తారు. ఇక రాష్ట్రంలో కార్యాలయాలు ఉన్న హెచ్ఏఎల్, బోయింగ్, ఎయిర్‌బస్, ఇస్రో, ఎన్ఏఎల్, రోల్స్‌రాయిస్, ఎయిర్ ఇండియా, జీఈ ఏరోస్పేస్, మహీంద్ర ఏరోస్పేస్ తదితరాల ఆధునిక ఉత్పత్తులు ఈ ప్రదర్శలో ఆకర్షణగా నిలువనున్నాయి.

బెంగాల్‌పై ప్రభావం చూపదు

- ఇక్కడ కాంగ్రెస్‌కు బలం లేదు
- సొంతంగానే అధికారంలోకి వస్తాం: సీఎం మమతా బెనర్జీ

కోల్‌కతా: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితం వచ్చే ఏడాది జరగనున్న పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలపై ఎటువంటి ప్రభావం చూపదని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పేర్కొన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశానికి ముందు సోమవారం పార్టీ ఎమ్మెల్యేలతో జరిగిన అంతర్గత సమావేశంలో మమత మాట్లాడుతూ... బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తాం. మూడింట రెండొంతుల మెజారిటీతో సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం. ఇక్కడ కాంగ్రెస్‌కు బలం ఏమీ లేదని మమత స్పష్టం చేశారు. ఈ మేరకు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీ ఎన్నికల ఫలితం గురించి ప్రస్తావిస్తూ... ఇండియా కూటమిలోని రెండు పార్టీలు (ఆప్, కాంగ్రెస్) కలిసి పనిచేసి ఉంటే ఫలితాలు భిన్నంగా ఉండేవని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారని వర్గాలు తెలిపాయి. "కాంగ్రెస్ దాదాపు 5 శాతం ఓట్లు పొందడం ఫలితంపై ప్రభావం చూపింది. కాంగ్రెస్ పట్టు వీడి ఆప్‌తో ఎన్నికల అవగాహనకు వచ్చి ఉంటే ఫలితాలు భిన్నంగా ఉండేవి. హర్యానాలో కూడా ఆప్ కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వలేదు. రెండు కూటమి భాగస్వాములు కలిసి పోటీ చేసి ఉంటే హర్యానాలో బీజేపీ తిరిగి అధికారంలోకి వచ్చేది కాదని ఆమె నమ్ముతున్నారు" అని నదియా జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే పేర్కొన్నారు. బెంగాల్‌లో కూడా ఇదే పరిస్థితి ఉంటుందని ముఖ్యమంత్రి భావించడం లేదని ఆ ఎమ్మెల్యే అన్నారు. ఎందుకంటే తృణమూల్ మాదిరిగా ఇతర చోట్ల బీజేపీ సవాలును ఎదుర్కోవడానికి ఇతర ప్రతిపక్ష పార్టీలకు సంస్థాగత బలం లేదని చెప్పుకొచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్, ఎస్పీ, మహారాష్ట్రలో కాంగ్రెస్, శివసేన, ఎన్సీపీ (ఎస్పీ) ఎన్నికల పొత్తు కుదుర్చుకోవడం... బీజేపీని 240 స్థానాలకు పరిమితం చేయడంలో దోహదపడింది. ఇండియా ఐక్యసంఘటనలో తృణమూల్ భాగమైనప్పటికీ బెంగాల్‌లో ఆ పరిస్థితి లేదు. బెంగాల్‌లో ఎన్నికలు జరగడానికి ఏడాది కంటే కొంచెం ఎక్కువ సమయం ఉన్నందున పార్టీ పాత, కొత్త కార్యకర్తలతో కలిసి పనిచేయాలని, నియోజకవర్గాల్లోని ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మమత ఎమ్మెల్యేలను ఆదేశించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి, డైమండ్ హార్బర్ ఎంపీ అభిషేక్ బెనర్జీ పార్టీలో సంస్థలో మార్పుల కోసం తన సిఫార్సులను సమర్పించినప్పటికీ... పార్టీ విద్యార్థులు, యువజన విభాగంలో మార్పులపై తమ సూచనలను 15 రోజుల్లోగా రాష్ట్ర మంత్రి అరూప్ బిశ్వాస్‌కు సమర్పించాలని మమత ఎమ్మెల్యేలను కోరారు.

'శీష్ మహల్'కు కొత్త సీఎం దూరం?

న్యూఢిల్లీ: ఆప్ అధినేత కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా శీష్‌మహల్ పేరుతో విస్తృత ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన బీజేపీ... ఇప్పుడు తమ ముఖ్యమంత్రి అదే శీష్‌మహల్‌లో ఉండబోరని చెబుతోంది. ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు చక్కర్లు కొడుతున్నాయి. కేజ్రీవాల్ సీఎంగా పనిచేసిన సమయంలో సివిల్ లైన్స్‌లో 6 ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్ బంగ్లాను అధికారిక నివాసంగా ఉపయోగించేవారు. ఆ బంగ్లాను 'శీష్ మహల్ (అద్దాల మేడ)'గా బీజేపీ ప్రచారం చేసింది. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి ఆయన 7-స్టార్ రిసార్ట్‌గా మార్చుకున్నారని విమర్శించింది. నాలుగు కోట్ల మందికి ఇళ్లు కట్టించామని, కానీ.., తానేమీ అద్దాల మేడ కట్టుకోలేదని ప్రధాని మోదీ సైతం ఆరోపణలు గుప్పించారు. ఆప్ మోసాలకు ఆ మహల్ ఓ ఉదాహరణ అని బీజేపీ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లింది. ఆప్ ప్రభుత్వంపై వచ్చిన ఈ అవినీతి ఆరోపణలు అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీని దెబ్బతీశాయి. విమర్శలకు తావులేకుండా ఆ బంగ్లాకు దూరంగా ఉండాలని బీజేపీ యోచిస్తున్నట్లు సమాచారం.

నోరు అదుపులో పెట్టుకోండి

యూట్యూబర్‌కు సీఎం ఫడ్నవీస్ హెచ్చరిక

ముంబై: భారత్‌లో ప్రముఖ యూట్యూబర్, బీర్ బైసెప్స్‌గా పాపులర్ అయిన కంటెంట్ క్రియేటర్ రణవీర్ అలహాబాదియాకు మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ హెచ్చరికలు జారీ చేశారు. ఏమైనా మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకోవాలని, సమాజం తలదించుకునేలా వ్యవహరించవద్దని ఫడ్నవీస్ అన్నారు. ఏమి జరిగిందంటే... ఇండియాస్ గాట్ టాలెంట్‌లో యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియా నోరు జారారు. దీంతో అలహాబాదియాపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇండియాస్ గాట్ టాలెంట్‌లో రణ్‌వీర్ అలహాబాదియా ఓ కంటెస్ట్‌తో రాయలేని భాషలో ఓ జోకు వేశాడు. ఆ జోక్‌తో అలహాబాదియాతో సహా పక్కనే ఉన్న అతిథులు, న్యాయనిర్ణేతలు పగలబడి నవ్వారు. ఆ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై న్యాయవాదులు సైతం అలహాబాదియాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలహాబాదియా చేసిన కామెంట్స్‌పై సీఎం ఫడ్నవీస్ స్పందించారు. 'అలహాబాదియా వ్యాఖ్యల గురించి నాకు సమాచారం అందింది. అయితే నేను ఆ వీడియో చూడలేదు. చాలా అసభ్యకరంగా మాట్లాడారని, అలా మాట్లాడటం తప్పే అవుతుందని అన్నారు. ప్రతి ఒక్కరికీ మాట్లాడే స్వేచ్ఛ ఉంటుంది. కానీ మనం ఇతరుల స్వేచ్ఛను హరించకూడదు. ప్రతి ఒక్కరికీ పరిమితులు ఉంటాయి. ఎవరైనా వాటిని దాటితే చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది' అని స్పష్టం చేశారు.

యూట్యూబర్ క్షమాపణ

ఓ షోలో అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన ప్రముఖ యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియా క్షమాపణలు తెలిపాడు. నెట్టింట పెద్దఎత్తున విమర్శలు రావడంతోపాటు ముంబైలో పోలీసు కేసు నమోదు చేశారు. హద్దులు దాటినవారిపై చర్యలు తప్పవని ఫడణవీస్ హెచ్చరించిన క్రమంలో అలహాబాదియా క్షమాపణలు చెప్పక తప్పలేదు.

విశాలాంధ్ర హైదరాబాద్

పూలే వారసులైన మాలి కులస్తుల సమస్యలు పరిష్కరించాలి

డిప్యూటీ సీఎంకు మాలి సామాజికవర్గ నేతల విజ్ఞప్తి

విశాలాంధ్ర - హైదరాబాద్ : పూలే దంపతుల వారసత్వం కలిగిన మాలి కులస్తుల సమస్యలు పరిష్కరించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పటేల్, ప్రధాన కార్యదర్శి షిండే తదితరులు సోమవారం హైదరాబాదులోని ప్రజాభవన్‌లో విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో మాలి కులస్తులు ఎస్టీలుగా ఉండగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత బీసీల జాబితాలో చేర్చడంతో అన్ని రంగాల్లో వెనుకబడి పోయామని వారు విజ్ఞప్తి చేశారు. 2008లో వైయస్సార్ సీఎంగా ఉన్నప్పుడు జ్యోతిబాపూలే జయంతి వర్ధంతిలను అధికారికంగా నిర్వహించారని, ప్రగతి భవన్‌కు మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌గా పేరు మార్చి ప్రజాపాలనను అందించడం శుభ పరిణామం అని తెలిపారు. మాలి కులస్తులకు ఎస్టీ హోదా కల్పించాలని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో మాలి కులస్తులకు టికెట్లు కేటాయించాలని, హైదరాబాదులో మాలి ఆత్మగౌరవ భవనాన్ని నిర్మించాలని కోరారు. అనేక సంవత్సరాలుగా మాలి కులస్తులు సాగుచేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, తెలంగాణ యూనివర్సిటీకి సావిత్రి పూలే బాయి తెలంగాణ యూనివర్సిటీగా నామకరణం చేయాలని, ట్యాంక్ బండ్‌పై పూలే దంపతుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని కోరారు. సావిత్రి పూలే బాయి జన్మదిన జనవరి 3ని మహిళ ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించి రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా వేడుకలు నిర్వహించడం దేశ చరిత్రలోనే సంచలన నిర్ణయం అని.. మాలి కులస్తుల జాతీయ అధ్యక్షుడు విలాసరావు పాటిల్, సావిత్రిబాయ్ పూలే వంశీయులు డాక్టర్ దిలీప్ గణపతి పాటిల్ బృందం డిప్యూటీ సీఎం ఘనంగా సన్మానించారు.

సమస్యలు పరిష్కరించాలి : ఎమ్మెల్యే మర్రి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో జోనల్ కమీషనర్ రవి కిరణ్‌ను కలసి పలు సమస్యలపై చర్చించి పరిష్కరించాలని ఆయన కోరారు. ఎల్‌ఈడి థీమ్ పార్క్ చాణిక్యపురి కాలనీలో ఏర్పాటు చేయడం, గంగపుత్ర సంఘం ఓల్డ్ నేరేడ్మెట్‌లో మొదటి అంతస్తు కమ్యూనిటీ హాల్ నిర్మాణం, విమలాదేవి నగర్‌లో మరియు ఇతర కాలనీలలో సిసి రోడ్ నిర్మాణం, వర్ద రెడ్డి కాలనీలో ఉన్న ప్రభుత్వ పార్క్ స్థలంలో పవర్ బోర్ కొరకు దరఖాస్తు అందజేశారు. విష్ణుపురి ఎక్సటెన్షన్‌లో బాక్స్ డ్రయిన్ కొరకు ప్రతిపాదించారు. దీని పైన జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సునిత రాము యాదవ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు జగదీష్ గౌడ్, రాము యాదవ్, జనార్ధన్, సతీష్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను లా ఆఫీసర్ చంద్రావతితో కలిసి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి స్వీకరించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో (57) ఫిర్యాదులు అందాయన్నారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టరు సూచించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖలలో ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంట వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

ప్రజావాణిలో అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్ రెడ్డి ఫిర్యాదు

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ మహానగరంలో బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్క్ వద్ద రహదారి విస్తరణ పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో తన ఇంటి స్థలం సేకరణపై పునరాలోచన చేయాలని ప్రభుత్వాధికారులను టాలీవుడ్ ప్రముఖ హీరో అల్లు అర్జున్ మామ, కాంగ్రెస్ పార్టీ నేత చంద్రశేఖర్ రెడ్డి కోరారు. అందులోభాగంగా సోమవారం గ్రీన్ లాండ్స్‌లోని మహాత్మ జ్యోతిరావు పూలే భవనంలో నిర్వహిస్తున్న ప్రజావాణికి ఆయన ఫిర్యాదు చేశారు. ఈ రహదారి విస్తరణలో భాగంగా తన ప్లాట్‌లో ఓ వైపు 20 అడుగులు, మరో వైపు 36 అడుగుల భూమి సేకరించే అంశంపై వివరణ ఇవ్వాలంటూ అధికారులను ఆయన కోరారు. కేబీఆర్ పార్క్ చుట్టూ జంక్షన్ల అభివృద్ధి చేయాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గతంలో కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. దానికోసం రూ. 1,100 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించిన సంగతి తెలిసిందే.

ప్రజావాణి ఫిర్యాదుల సత్వర పరిష్కారంపై దృష్టి

జిహెచ్ఎంసి కమీషనర్ ఇలంబర్తి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజావాణిలో అందిన ఫిర్యాదుల సత్వర పరిష్కారంపై దృష్టి సారించామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి తెలిపారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో నగరంలోని వివిధ ప్రాంతాల నుండి పలు సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన ప్రజల నుండి కమీషనర్ ఇలంబర్తి వారి సమస్యలను అడుగుతూ అర్జీలను స్వీకరించారు. పలు సమస్యలకు అప్పటికప్పుడు పరిష్కారం దిశగా సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజావాణిలో ఆయా విభాగాలకు సంబంధించి అందిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులన్నింటినీ విభాగాల వారీగా పరిశీలన చేసి ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని, అదేవిధంగా సర్కిల్ వారీగా ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో అత్యధికంగా టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించిన ఫిర్యాదులు అందుతున్నాయని, 2025 జనవరి నుండి ఇప్పటి వరకు టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి 330 ఫిర్యాదులు అందగా, అందులో 190 ఫిర్యాదులను పరిష్కరించినట్లు తెలిపారు. ఆయా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రతి వారం సమీక్షిస్తున్నట్లు కమీషనర్ తెలిపారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 59 విన్నపాలు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి 34, ఇంజనీరింగ్ మెయింటెనెన్స్ 6, ట్యాక్స్, వెటర్నరీ విభాగాలకు 3 చొప్పున, ఫైనాన్స్, హెల్త్, ఎలక్ట్రికల్ విభాగాలకు రెండు చొప్పున, శానిటేషన్, లేక్స్, యు.సి.డి విభాగాలకు ఒకటి చొప్పున ఫిర్యాదులు అందగా, ఫోన్ ఇన్ ద్వారా 4 ఫిర్యాదులు అందాయని తెలిపారు. జిహెచ్ఎంసి పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 96 అర్జీలు అందాయని, అందులో కూకట్ పల్లి జోన్‌లో 41, ఎల్బీనగర్, శేరిలింగంపల్లి జోన్‌లలో 13 చొప్పున, సికింద్రాబాద్ జోన్‌లో 11, చార్మినార్ జోన్‌లో 7, ఖైరతాబాద్ జోన్‌లో ఒక్క ఫిర్యాదు అందిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు, గీతా రాధిక, పంకజ, అశోక్ సామ్రాట్, రఘు ప్రసాద్, వేణుగోపాల్ రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, యాదగిరిరావు, యు.బి.డి డైరెక్టర్ వెంకటేశ్వర్లు, అడిషనల్ సి.సి.పిలు ప్రదీప్, గంగాధర్, (ఎల్.ఏ) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాము నాయక్, ఎస్టేట్ అధికారి ఉమా ప్రకాష్, జె.సి రెవెన్యూ మహేష్ కులకర్ణి, డిప్యూటీ సీఈ పసారెడ్డి, వాటర్ వర్క్స్ సాయి రమణ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు ఎమ్మెల్సీ అభ్యర్థులే కరువు

అట్టహాసంగా కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రస్తుతం జరుగుతున్న పర్యభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు బీఆరెస్ తరఫున నిలబడేందుకు అభ్యర్థులు కరువయ్యారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ - మెదక్ - ఆదిలాబాద్ - నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్ రెడ్డి నామినేషన్ అట్టహాసంగా దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొనగా నాలుగు జిల్లాల ఇంచార్జి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క కొండా సురేఖ జూపల్లి కృష్ణారావు, ఆయా జిల్లాల మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, తదితరులు హాజరయ్యారు. ముందుగా ఉదయం 10:30 గంటలకు ఎస్ఆర్ఆర్ కాలేజి గ్రౌండ్ నుండి కలెక్టర్ వరకు ర్యాలీగా వెళ్ళి నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌పై టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ మండిపడ్డారు. ఫాంహౌస్‌కు పరిమితమైన కేసీఆర్‌కు విపక్ష హోదా ఎందుకని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ మధ్య దోస్తీ ఉందని ఆరోపించారు. అసలు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి బీఆరెస్‌కు అభ్యర్థులు లేరన్నారు. 8 మంది బీజేపీ ఎంపీలు ఉంటే బడ్జెట్‌లో తెలంగాణకు వచ్చిన నిధులు గాడిద గుడ్డు అంటూ వ్యాఖ్యానించారు. కేటీఆర్ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని, బీఆర్ఎస్‌లో కేటీఆర్, హరీష్, కవిత మధ్య మూడు ముక్కలాట నడుస్తోందన్నారు. మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌లు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 55 వేలకు పైగా ఉద్యోగాలు కల్పించామన్నారు. పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిస్తే పట్టభద్రుల సమస్యలను ప్రభుత్వంతో చర్చించి పరిష్కారం కోసం కృషి చేస్తారని పేర్కొన్నారు. కనివిని ఎరుగని రీతిలో కాంగ్రెస్ ఏడాది పాలన సాగిందని, ఇకముందు కూడా అలాగే సాగుతోందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి మరింత బలం చేకూర్చే విధంగా నరేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. నాలుగు నియోజకవర్గాల నుంచి పట్టభద్రుల కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి బలపరచడానికి వచ్చిన అందరికి హృదయ్ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ మతతత్వ ఎజెండాతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తోందని కావున ఎమ్మెల్సీ ఎన్నికలో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని అభ్యర్థించారు.

మెట్రో నగరాల్లోని విద్యార్థులకు ధీటుగా ఎదగాలి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మహబూబ్‌నగర్ : మెట్రో నగరాలలోని విద్యార్థులకు ధీటుగా మహబూబ్ నగర్ విద్యార్థులు అన్నింట్లో సమానంగా ఎదగాలనే ఉద్దేశంతో పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల కు డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్‌ను అందిస్తున్నామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని అప్పన్నపల్లిలోని మయూరి నర్సరీ దగ్గర గల కేశవరెడ్డి హైస్కూల్ విద్యార్థులకు ఎమ్మెల్యే తన సొంత నిధులతో 2డి, 3డి యానిమేషన్ డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్‌ను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పదవతరగతి వార్షిక పరీక్షలు ఇంకా 40 రోజుల సమయం మాత్రమే ఉందని, ఎట్టి పరిస్థితుల్లోనూ మీ సమయాన్ని వృథా చేయకుండా, కాలక్షేపం చేయకుండా చదువు పైన మీదృష్టి కేంద్రీకరించి పదవ తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన విద్యార్థులకు సూచించారు. మహబూబ్‌నగర్‌ను అన్ని రంగాల్లో ఫస్ట్ చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని, విద్యలో, క్రీడల్లో, ఉద్యోగాల్లో, ఉద్యోగ కల్పనలో చిన్నారులు క్రమశిక్షణలో, పెద్దలను గౌరవించడంలో మన మహబూబ్‌నగర్ ఫస్ట్‌గా నిలవాలని ఆయన అన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులు మాట్లాడుతూ మాకు మీరు ఇచ్చిన ఈ ఆత్మీయ కానుక మాకు వార్షిక పరీక్షల్లో ఎంతగానో ఉపయోగపడుతుందని, మేము కూడా చాలా కష్టపడి, ఇష్టపడి చదివి మంచి ఫలితాలు సాధిస్తామని ఎమ్మెల్యేకి హామీ ఇచ్చారు. మాకు ఈ విలువైన డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్ ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాం అని అన్నారు. అనంతరం పాఠశాల సిబ్బంది ఎమ్మెల్యేని ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిన్నికృష్ణ, అకాడమిక్ ఇంచార్జి చంద్రశేఖర్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, నాయకులు ఖాజా పాషా, మోతిలాల్, పాపారాయుడు తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా ప్రకటనలు.. కార్పొరేట్ శక్తులకు అనుకూలం

సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్ బోస్



విశాలాంధ్ర - హైదరాబాద్ : కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కార్పొరేట్ దోపిడీ శక్తులకు అనుకూలంగా ప్రకటనలు చేస్తున్నారని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్ బోస్ మండిపడ్డారు. అందులో భాగంగానే వచ్చే ఏడాది మార్చి 31 నాటికి దేశంలో నక్సలిజం లేకుండా అంతం చేస్తామని పదేపదే ప్రకటనలు చేస్తున్నారని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో పీడిత ప్రజలపై కొనసాగుతున్న అణిచివేత, పీడన, వివక్ష, దోపిడి ఉన్నంతకాలం ఉద్యమాలు, పోరాటాలు కొనసాగుతాయన్నారు. సమాజంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో మార్పు రాకుండా ఒక నక్సలైట్ భావజాలాన్ని లేకుండా చేయడం అసాధ్యం అన్నారు. గతంలో పాలకులు ఇదేవిధంగా కమ్యూనిస్టు పార్టీలను, నక్సలైట్ పార్టీలను లేకుండా చేస్తామని ప్రగాల్భాలు పలికి చివారికి వారు అధికారం కోల్పోయారని అన్నారు. మధ్య భారతం అడవిలో ఉన్న ప్రకృతి సంపదను కార్పొరేట్ వర్గాల ప్రయోజనాల కోసం ప్రజలను అక్కడి నుంచి బయటికి వెళ్లగొట్టి సంపదను దోచుకోవాలనేది అమిత్ షా ఆలోచన అన్నారు. 75 ఏళ్ల స్వతంత్ర భారతంలో ఆదివాసి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయన్నారు. విద్యా, వైద్యం పట్టించుకున్న పరిస్థితి పాలకులకు లేదన్నారు. వడ్డీ వ్యాపారస్తుల దుర్మార్గాలు, ఫారెస్ట్ అధికారుల దుర్మార్గాలు, అటవీ సేకరణ ఉత్పతులకు సరిఅయిన ధర ఇవ్వకుండా తీవ్రంగా ఆదివాసులను మోసానికి గురి చేశారన్నారు. మాట్లాడిన ప్రజలపై అటవీ అధికారులు పోలీస్ డిపార్ట్మెంట్ దాడులు చేసేవారు. వాళ్లపై కేసు నమోదు చేసి జైళ్లను నింపిందన్నారు. ఇట్లాంటి పరిస్థితులు ఈ ఆకలి అణచివేతల నుంచే పోరాటాలు ప్రారంభమయ్యాయన్నారు. ఆ పోరాటాలు అనేక ఆదివాసి ప్రాంతాలలో చెరువుల నిర్మాణము, స్కూల్లో నిర్మాణం, వ్యవసాయ పంటల అవగాహనను పెంచడం జరిగిందన్నారు. వారి జీవితంలో మార్పులు కనిపించాయన్నారు. ఇప్పుడు ఉన్నటువంటి కేంద్ర ప్రభుత్వం అక్కడ ఉన్న ఆదివాసి ప్రజలను అడవి నుంచి బలవంతంగా పంపించి ఖనిజ సంపదను దోచుకోవాలనుకుంటున్నారు. ఈ దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలకు మద్దతుగా ఉన్న మావోయిస్టు పార్టీని తుదముట్టించడానికి అనేక కుట్రలు పన్నుతు ప్రతి రోజు భూటకపు ఎన్కౌంటర్ల పేరుతో ప్రజలను, ఉద్యమకారులను చంపేసి మానవ హననానికి పాల్పడుతున్నారన్నారు. ప్రశాంతంగా ఉన్న పచ్చని అడవి ప్రాంతాన్ని రక్తపు టెర్లతో ముంచుతున్నారన్నారు. దేశానికి మరొక దేశంతో యుద్ధము జరిగితే పాల్గొనాల్సిన సైనికులు దేశంలో ప్రజలపై యుద్ధం ప్రకటించడం అంతర్జాతీయ న్యాయ సూత్రాలకి విరుద్ధమన్నారు.

తక్షణమే సుప్రీంకోర్టు కలగజేసుకొని దండకారణ్య ప్రాంతాల్లో జరుగుతున్న మారణ హోమాన్ని ఆపివేసి సైనిక బలగాలను అక్కడి నుంచి ఉపసంహరించుకునేలా కేంద్ర ప్రభుత్వన్ని ఆదేశించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

బర్డ్ ఫ్లూ వ్యాధితో అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రక్క రాష్ట్రంలో ఫౌల్ట్రీలలో బర్డ్ ఫ్లూ వ్యాధి సోకుతున్నందున కోళ్ల ఫారాల యజమానులు గుర్తుతెలియని బర్డ్స్ చనిపోతే వెంటనే సంబంధిత వెటర్నరీ దవఖానాలో సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమంలో వెటర్నరీ అధికారి బర్డ్ ఫ్ల్యూ వ్యాదిపై ప్రభుత్వం ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలని సూచించినందున కలెక్టర్ జిల్లాలోని కోళ్ళ ఫారాల యజమానులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. వెటర్నరీ సిబ్బంది కోళ్ళ ఫారాలకు వచ్చినప్పుడు సహకరించి వారికి, ఏదేని కోళ్ళ ఎక్కువ మొత్తంలో చనిపోతో వెంటనే సమాచారం అందించాలని అన్నారు. ఎక్కడైన కోళ్ళు వ్యాధి సోకి చనిపోయినట్లైతే వాటిని పాతిపెట్టి, బయో కెమికల్ పౌడర్ చల్లాలని, ఇంకా వేరే కోళ్ళ ఫారాలకు సోకకుండా నివారించాలని తెలిపారు. మన రాష్ట్రంలోని ఖమ్మంలో బర్డ్ ఫ్లూ వ్యాధి సోకినందున జిల్లాలోని పౌల్ట్రీ యజమానులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ కదిరవన్ పలాని

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్లు కదిరవన్ పలాని, డాక్టర్ ముకుందరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కదిరవన్ పలాని, ముకుందరెడ్డి పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణిలో ప్రజల నుండి 1561 దరఖాస్తులు అందాయని తెలిపారు. అట్టి అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని సంబంధిత జిల్లా అధికారులను ఆయన ఆదేశించారు. ప్రజావాణిలో, డిస్ట్రిక్ట్ సివిల్ సప్లై 743, గృహ నిర్మాణ శాఖకు 735, పెన్షన్ 55, డిఈఓ 04 ఇతర శాఖలకు సంబంధించినవి 24 దరఖాస్తులు అందాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సాయిరాం, జిల్లా అధికారులు ఆర్.రోహిణి, పవన్ కుమార్, కోటాజీ, డిఎం హెచ్ఓ వెంకటి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ అన్నారు. మల్లికార్జుననగర్‌లోని మల్లన్న దేవాలయంలో సోమవారం విగ్రహ ప్రాణప్రతిష్ఠ దేవతలు కలహ భైరవ, దక్షిణామూర్తి, విష్ణుమూర్తి, బ్రహ్మ, శ్రీచక్రం, సింహవాహనం ప్రతిష్ఠ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ దంపతులు మేకల సునీత రామ యాదవులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్ రావుల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

గాలి కంప్రెషర్ ఆపరేషన్‌లో విప్లవాత్మక మార్పులు



విశాలాంధ్ర- తశేరిలింగంపల్లి: ఇండస్ట్రియల్ ఎయిర్ కంప్రెషన్‌లో గణనీయమైన పురోగతిగా, ప్రపం చంలో అగ్రగామి ఎయిర్-కాంప్రెసర్ తయారీదారుల లో ఒకటైన ఎల్జీ ఎక్విప్మెంట్స్ తన వినూత్న కంప్రెస్డ్ ఎయిర్ స్టెబిలైజేషన్ టెక్నాలజీను ప్రకటించింది. స్టెబ్‌లైజర్ సిస్టమ్ డైనమిక్ ఎయిర్ డిమాండ్ ఉన్న ప్లాంట్‌లలో కాంప్రెసర్ ఆపరేషన్‌ను విప్లవాత్మకంగా మార్చేందుకు రూపొందించబడింది. ఇది అస్థిరమైన కాంప్రెసర్ పనితీరు, అదనపు తరచుగా జరిగే లోడ్, అన్‌లోడ్ చక్రాల వల్ల ఏర్పడే సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఇండస్ట్రియల్ సెట్టింగ్‌లలో, కాంప్రెసర్ సామర్థ్యం ప్లాంట్ గాలి అవసరం మధ్యగల వ్యత్యాసం డైనమిక్‌గా మారుతూ ఉంటుంది. ఈ వేరియబిలిటీ తరచుగా కట్-ఇన్, కట్-అవుట్ ఆపరేషన్‌లు జరగటా నికి దారితీస్తుంది. దీనివలన కాంప్రెసర్ అస్థిరత పెరిగి, ఫ్లో, కైనమాటిక్ భాగాల పనితీరు ప్రభావితం అవుతుంది. సాంప్రదాయ పరిష్కారాలు, ఉదాహరణకు రిజర్వాయర్ పరిమాణాన్ని పెంచడం, కట్-ఇన్, కట్-అవుట్ ప్రెజర్‌లను మార్చడం, లేదా వేరియబుల్ ఫ్రీక్వెన్సీ డ్రైవ్‌లు ఉపయోగించడం, సరైన పరిష్కారం ఇవ్వకపోగా, కొత్త స్టెబ్‌లైజర్‌లు లేదా అధిక ఆపరేషనల్ ఖర్చులను పరిచయం చేస్తాయి.

విద్యార్థులు సంస్కృతి, సంప్రదాయాలను అలవర్చుకోవాలి

విశాలాంధ్ర - ఆమనగల్లు : ప్రాథమిక విద్య స్థాయి నుంచే విద్యార్థులు సంస్కృతి, సంప్రదాయాలను అలవర్చుకోవాలని సద్గురు నిత్యశుద్ధానంద స్వామి క్షేత్రం రామదూత పీఠాధిపతులు శివానంద స్వామి అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని శ్రీ సరస్వతి పాఠశాలలో శ్రీ అభయాంజనేయస్వామి భజన మండలి వారి ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాల విద్యార్థులకు వేద పురాణెతిహాస ప్రహేళిక (క్విజ్) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శివానంద స్వామి ముఖ్య అతిథులుగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్కులు, ర్యాంకులు లక్ష్యంగాసాగుతున్న విద్యార్థులకు దేశం గురించి ఆలోచించే తీరిక లేకుండాపోతోందన్నారు. విద్యార్థుల్లో దేశభక్తిని, సంస్కృతి సంప్రదాయాలను నేర్పడానికి క్విజ్ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. అభయాంజనేయ భక్తమండలి కార్యదర్శి దొంతు సత్యనారాయణ, అధ్యక్షుడు నారాయణ గౌడ్, దామోదర్, అధ్యక్షుడు బుచ్చిరాములు, సహ కార్యదర్శి బావండ్ల అంజయ్య, ఉపాధ్యక్షుడు వర్కాల యాదిరెడ్డి, చల్ల శ్రీనివాస్ రెడ్డి, సరస్వతి శిశు మందిర్ అధ్యక్షుడు పాపిశెట్టి రాము, కార్యదర్శి చుక్క ఆనంద్, ప్రధానచార్యులు కవిత, గుర్రం భద్రయ్య, నాయనాచారి, మంచుకొండ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

ఆలయ ముఖద్వారానికి అనుమతులివ్వాలి

కొండా సురేఖకి వినతి పత్రం సమర్పించిన శ్రీవీరాంజనేయ స్వామి ఆలయ కమిటీ

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : జూబ్లీహిల్స్ నియోజకవర్గం యూసఫ్ గూడా డివిజన్ వెంకటగిరిలో శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంకి సుమారు 5 దశాబ్దాల చరిత్ర ఉంది. 1964లో నిర్మించిన శ్రీ వీరాంజనేయస్వామి ఆలయానికి పునర్ వైభవం తీసుకొస్తున్న సందర్భంగా, గత సంవత్సరం 2024లో ఆలయ పునర్నిర్మాణం చేసిన సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖని కలిసి ఆలయ సందర్శనానికి రావాలని కోరారు. ఆలయ ముఖద్వారానికి తగిన అనుమతులు ఇవ్వాలని ఆలయ కమిటీ సభ్యులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సానుకూలంగా స్పందిస్తూ అతి త్వరలో అనుమతి ఇవ్వడం జరుగుతుందని, అలాగే ఆలయ సందర్శన కూడా చేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యను నిర్వీర్యం చేసే కుట్రలు

ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ సిరంగరాజ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : కేంద్రం జాతీయ నూతన విద్యావిధానం -2020 పేరుతో విద్యను పూర్తిగా తమ ఆధిపత్యంలోకి తీసుకుంటూ విద్య కాషాయీకరణ, కేంద్రీకరణ, కార్పోరేటీకరణ, వ్యాపారీకరణను ప్రోత్సహించే నిర్ణయాలు చేస్తుందని దానిలో భాగమే యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యూజీసి) 2025 జారీచేసిన ముసాయిదా మార్గదర్శకాలని, ఇది ఉన్నత విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్రలని ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ సిరంగరాజ్ మండిపడ్డారు. హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని సత్యా నారాయణరెడ్డి భవన్‌లో ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సమావేశం ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు విరాజ్ దేవాంగ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ సిరంగరాజ్ మాట్లాడుతూ దేశంలో నూతన విద్యావిధానం పేరుతో యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి దెబ్బతీసే ప్రయత్నం కేంద్ర బీజేపీ మోడీ ప్రభుత్వం చేస్తున్నదని ఆయన విమర్శించారు. దానిలో భాగమే యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యూజిసి) 2025 జారీ చేసిన ముసాయిదా మార్గదర్శకాలున్నాయని అన్నారు. ఈ విధానాలు ప్రభుత్వం విద్య వ్యవస్థను ధ్వంసం చేయడానికి, ఆరెస్సెస్ నేపథ్యం ఉన్నవారినే యూనివర్సిటీలలో నియామకాలు చేయడానికి తీసుకుంటున్న చర్యలని అయన ఆరోపించారు. విశ్వవిద్యాలయాలలో ఆరెస్సెస్ ఎజెండా అమలుకు బిజెపి ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. కేంద్ర బడ్జెట్లో విద్యారంగానికి కనీసం 10 శాతం బడ్జెట్ కేటాయింపులు చేయకుండా, జిడిపిలో 6 శాతం నిధులు కేటాయించకుండా వివక్ష చూపుతున్నారని అన్నారు. నూతన విద్యావిధానం, విశ్వ విద్యాలయాల ఫండ్, ఫెలోషిప్స్ ఇవ్వకపోవడం, ఖాళీలు భర్తీ చేయకుండా ఉండడం, యూనివర్సిటీలలో ప్రజాస్వామ్య వాతావరణం లేకుండా చేయడం కోసమే యూజిసి 2025 సవరించిన నియమాలు వైస్ ఛాన్సలర్ల ఎంపికలో రాష్ట్ర గవర్నర్లకు ఎక్కువ అధికారాన్ని ఇస్తున్నాయని, ఇది అత్యంత ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే జాతీయ నూతన విద్యా విధానాన్ని ఉపసహరించుకొని, యూజీసీ 2025 ముసాయిదా మార్గదర్శకాలను వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థుల ఆగ్రహానికి కేంద్ర ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్ఎ స్టాలిన్, సంఘమిత్ర జెనా, జాతీయ సహాయ కార్యదర్శులు కే.శివారెడ్డి, కబీర్, హమిమ్ హంజా, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శి కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్, జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామక్రిష్ణ, జాతీయ సమితి సభ్యులు గ్యార నరేష్, బానోత్ రాఘురాం, గ్యార క్రాంతి, నాగజ్యోతి, నాసర్ జీ, వలరాజు, సాయి కుమార్, ప్రీతి పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన ధ్యేయం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-దుండిగల్: నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడమే ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే కేపీ వివేకానంద పేర్కొన్నారు. సోమవారం నియోజకవర్గం కోంపల్లి మున్సిపాలిటీ పరిధి ఛాంద్ర విలాస్, సిల్వర్ లీఫ్, అపర్ణా పాల్మ్ గ్రోవ్స్, రాయల్ పార్క్-2, వడ్డేర బస్తీ ప్రాంతాల్లో రూ.1.2 కోట్లతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఎమ్మెల్యే వివేకానంద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద మాట్లాడుతూ నగరాభివృద్ధిలో మౌలిక సదుపాయాల ప్రాధాన్యత ఎంతో ఉంటుందని, ప్రజలకు మెరుగైన పారిశుధ్య నీటి పారుదల సౌకర్యాలను అందించడానికి ఈ అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ప్రాజెక్టు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ప్రజలకు అధునాతన వసతులు అందించేందుకు తాను అన్నివిధాల కృషి చేస్తున్నానని ఆయన తెలియజేశారు. అనంతరం త్వరితగతిన ఈ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా కృషి చేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే కేపీ వివేకానంద ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు దేవేందర్ యాదవ్, రవీందర్ యాదవ్, వినోద్, ప్రవీణ్‌రావు, దప్పు కిరణ్, లక్ష్మణ్, సంగీత రెడ్డి, కాలనీవాసులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి ప్రాధాన్యతివ్వాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, డీఆర్ఓ సంగీతతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం (67) ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ శాఖ-35, విద్యుత్ శాఖ-04, పిడి హౌసింగ్-10, సర్వేలాండ్-4, మెప్మా-3, విద్యాశాఖ-5, డిపిఓ-2, డిఆర్డిఓ-4 మొత్తం 67 దరఖస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

భారతీయులపై అమెరికా దుర్మార్గపు పోకడలను ఖండించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : అమెరికా నుండి 104 మంది భారతీయ పౌరులను అమెరికా నుండి బహిష్కరించిన అమానవీయ మరియు ఆమోదయోగ్యం కాని విధానాన్ని తీవ్రంగా ఖండిస్తూ, అమెరికా సైనిక విమానంలో సంకెళ్లు వేసుకుని, పరిమిత కదలికతో వ్యక్తులను సుదీర్ఘ ప్రయాణం చేయమని బలవంతం చేయడం మానవ గౌరవం, ప్రాథమిక మానవ హక్కులను ఉల్లంఘించడమేనని, ఇటువంటి ప్రవర్తన శోచనీయం, తీవ్రంగా ఖండిస్తున్నామని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్ ఆధ్వర్యంలో హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్ నుండి వై జంక్షన్ కూడలి వరకు వినూత్న పద్దతిలో చేతులకు సంకెళ్లు వేసుకొని, నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫ్లెక్సీను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్రలు మాట్లాడుతూ భారత పౌరులపై అమెరికా దుర్మార్గంగా వ్యవహరించడాన్ని అభ్యంతరం చెప్పడంలో విఫలమవడం ద్వారా మరోసారి తన క్రూరమైన వైఖరిని బహిర్గతం చేసిన మోడీ ప్రభుత్వం మౌనం వహించడం సిగ్గుచేటన్నారు. ప్రపంచవ్యాప్తంగా భారతీయ ప్రయోజనాలను కాపాడతామని గొప్పలు చెప్పుకునే కేంద్ర ప్రభుత్వం వాస్తవానికి, ఇటువంటి కఠినమైన బహిష్కరణ చర్యల నేపథ్యంలో తన సొంత ప్రజలకు కనీస గౌరవాన్ని అందించడంలో మోడీ ప్రభుత్వం విఫలమైందన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికా ముందు లొంగిపోయారని మండిపడ్డారు. మోదీ అమెరికా సందర్శించినప్పుడల్లా కోట్లాది రూపాయలు ప్రచారం కోసం ఖర్చు చేస్తారు. హౌడీ మోడీ నమస్తే ట్రంప్ వంటి కార్యక్రమాల స్పాన్సర్లు 104 మంది భారతీయులు స్వదేశానికి పంపేందుకు గౌరవ ప్రదమైన ప్రయాణాన్ని ఏర్పాటు చేయలేకపోయారని, గొలుసులతో బంధించి, చేతులకు బేడీలు వేసి అత్యంత క్రూరంగా వ్యవహరించారు అని ఆగ్రహం వ్యక్తం చేశారన్నారు. దౌత్యపరంగా ఇది మోదీ సర్కారు ఘోర వైఫల్యంగా భావించాల్సి ఉంటుందన్నారు. అదే విధంగా మరికొంతమంది భారతీయ వలసదారులను బహిష్కరించాలని భావిస్తున్నందున, భారత ప్రభుత్వం తన పౌరులను మానవీయంగా గౌరవ ప్రదంగా చూసుకునేలా తక్షణ చర్యలు తీసుకోవాలని. మోదీ ప్రభుత్వం వెంటనే అమెరికా అధికారులతో చర్చలు జరిపి బహిష్కరించబడిన వారికి న్యాయమైన చికిత్స అందించాలని, విదేశాలలో ఉన్న భారతీయ పౌరుల హక్కులను కాపాడాలని వారు డిమాండ్ చేశారు. ఈ తీవ్ర అన్యాయాన్ని దృష్టిలో ఉంచుకుని, అమెరికా, భారత ప్రభుత్వాలు జవాబుదారీతనం వహించాలని డిమాండ్ చేశారు. మన పౌరుల పట్ల ఈ అవమానకరమైన ప్రవర్తనను వ్యతిరేకించడంలో భారతదేశం అటువంటి అవమానాన్ని సహించదనే బలమైన సందేశాన్ని పంపడంలో అన్ని ప్రజాస్వామ్య మరియు ప్రగతిశీల శక్తులు ఏకం కావాలని వారు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీమాన్, హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, ఉపాధ్యక్షుడు మాజీద్ అలీ ఖాన్, కళ్యాణ్, అనీల్ కుమార్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మధు, సంజయ్ కుమార్, సుమన్, గణేష్, భాను ప్రకాష్, స్వామి, వేణు, రమేష్, చెట్టుకింది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నియామక ప్రక్రియలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: నియామక ప్రక్రియలో ఉన్న సమస్యలను అధిగమించడమే లక్ష్యంగా రిక్తం గ్రూప్ తన అధునాతన 'జెడ్ఇంటర్వ్యూ ఏఐ'ను ఆవిష్కరించింది. ఈ నూతన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ప్లాట్‌ఫారమ్ ఆటోమేటెడ్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తూ నియామక ప్రక్రియను సరికొత్తగా మార్చనుంది. ఇది హెచ్ఆర్ రంగంలో విప్లవాత్మక మార్పులకు ఆజ్యం పోయనుంది. ఈ మేరకు బంజారా హిల్స్ తాజ్ దక్కన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్ ఇంటర్వ్యూ ఏఐ వ్యవస్థాపకుడు, సీఈవో (రిక్తం టెక్నాలజీ కన్సల్టింగ్‌లో డైరెక్టర్) సిద్ధరామ్ శింగశెట్టి మాట్లాడుతూ కృత్రిమ మేధస్సును ఉపయోగించి టాలెంట్ హైరింగ్‌ను సులభతరం చేస్తున్నామని చెప్పారు. దీని ద్వారా సంస్థలు సమయాన్ని, వనరులను ఆదా చేసుకోవచ్చని తెలిపారు. పదిహేనేళ్ళుగా రిక్తమ్ టెక్నాలజీ కన్సల్టింగ్ ప్రపంచవ్యాప్తంగా టయోటా, నైకి, గూగుల్, ప్రాక్టర్, గాంబుల్ వంటి ప్రముఖ కంపెనీలకు కన్సల్టింగ్ సేవలు అందిస్తుందని తెలిపారు. ప్రస్తుతం నియామక ప్రక్రియలో వేగం, కచ్చితత్వం, సమానత్వం చాలా అవసరం అన్నారు. సరైన అభ్యర్థులను ఎంపిక చేయడం ఇప్పటికీ సమస్యగా ఉందన్నారు. అనువైన అభ్యర్థుల కోసం విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారని పేర్కొన్నారు. జెడ్ఇంటర్వ్యూఏఐ ఈ సమస్యలను ఏఐ ఆధారిత ఇంటర్వ్యూల ద్వారా పరిష్కరిస్తుందని తెలిపారు. ఇంటర్వ్యూల షెడ్యూలింగ్ జాప్యాలు తొలగించడం, పక్షపాత రహిత మూల్యాంకనం, డేటా ఆధారిత విశ్లేషణలతో సమర్థవంతమైన అభ్యర్థులను ఎంపిక చేసుకోవచ్చన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధన కోసం కృషి చేయాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని టీఎస్టీవోస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ హైదరాబాద్ అధ్యక్షుడు కేఆర్ రాజ్ కుమార్ అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కు పూలమాలవేసి ఘనంగా నివాళుల ర్పించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో రవీందర్, వెంకట్, శ్రీనివాస్, లలిత్, ఎన్వి నాయుడు, బాలాపూర్, శ్రీహరి గౌడ్, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పునరుద్ధరణ పనులను పరిశీలించిన గాంధీ

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: మియాపూర్ డివిజన్ పరిధిలోని బొల్లారం రోడ్డులో సత్యలక్ష్మి నగర్‌కాలనీ వద్ద మంజీర మంచి నీటి పైప్ లైన్ అకస్మాత్తుగా పగిలిపోవడం వలన వెంటనే చేపట్టిన పైప్ లైన్ పునరుద్ధరణ పనులను, జలమండలి అధికారులు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంజీర పైప్ లైన్ పగిలిపోయిన విషయం తెలియగానే సంఘటన స్థలాన్ని పరిశీలించడం జరిగినది అని, చాలా సంవత్సరాల క్రితం వేసిన పాత పైపులు అవడం వలన, వాటి జీవిత కాలం తగ్గడం వలన, కరెంట్ అన్, ఆఫ్ చేసే క్రమంలో గల సమయంలో గ్యాస్ వాయువు ఏర్పడి పగిలిపోవడం జరుగుతుంది అని, ఇటువంటి సమస్యలు మళ్ళీ పునరావృతం కాకుండా అన్నిరకాల చర్యలు తీసుకుంటామని, ఈ సమస్య శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపడుతామని తెలియచేశారు. అదేవిధంగా మంజీర పైప్ లైన్ ఆకస్మికంగా పగిలిపోవడం చాలా దురదృష్టకరం అని, పైప్‌లైన్ పగిలిపోవడం మంచినీటి సరఫరాలో ఇబ్బంది ఎదురైనది అని, జలమండలి, జిహెచ్ఎంసీ, ట్రాఫిక్ విభాగం అధికారులు సమన్వయం చేసుకొని పైప్‌లైన్ పునరుద్ధరణ పనులు వెంటనే చేపట్టి, పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. పనులలో వేగం పెంచి,నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టి మళ్ళీ పునరావృతం కాకుండా చూడలన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు విశేష కృషి చేస్తానని, ఏ చిన్న సమస్య ఐన తన దృష్టికి వస్తే పరిష్కరిస్తానని, అన్ని వేళలో అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు డీజీఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణంలో గాంధీ దంపతులు

కన్నుల పండుగగా రాములోరి కల్యాణం

వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని వివేకానంద నగర్ కాలనీలో పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ దంపతులు, చంద్రశేఖర్ దంపతుల ఆధ్వర్యంలో వారి నివాసంలో పునర్వసు నక్షత్రం సందర్భంగా నిర్వహించిన సీతారాముల కల్యాణం మహోత్సవం సందర్భంగా పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను స్వామి వారికి కుటుంబ సభ్యులతో కలిసి అందచేసి కల్యాణం మహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ సీతారాముల కల్యాణం మహోత్సవం సందర్భంగా పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను అందచేయడం చాలా సంతోషంగా ఉంది అని శ్రీ సీతారాముల వారి కృపా కటాక్షాలతో ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండలని, స్వామి వారి కృపా ప్రజలందరి పై ఉంటుంది అని, పునర్వసు నక్షత్రం సందర్భంగా రాములోరి కల్యాణం కనుల పండుగగా, అంగరంగ వైభవంగా నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటరు దొడ్ల వెంకటేష్ గౌడ్, రాగం నాగేందర్ యాదవ్, ఉప్పలపాటి శ్రీకాంత్, నార్నె శ్రీనివాసరావు, మంజల రఘునాథ్ రెడ్డి, భక్తులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శారీరక, మానసిక దృఢత్వానికి క్రీడలు దోహదం

విశాలాంధ్ర - అమనగల్లు : క్రీడలు మన ఆనందంగా ఉండడానికి అడుకుంటామని మెడికల్ షాప్ అసోసియేషన్ నాయకులు పాపిశెట్టి రాము అన్నారు. శారీరకంగా, మానసికంగా, దృఢంగా ఉండడానికి ఎంతగానో ఉపయోగపడుతాయని ఆయన పేర్కొన్నారు. పట్టణంలోని అమనగల్లు వాలీబాల్ ప్రీమియర్ లీగ్ ఆధ్వర్యంలో టోర్నమెంట్ నిర్వహించారు. వాలీబాల్ పోటీలలో విన్నర్‌గా స్ట్రక్కర్స్ జట్టు, రన్నర్‌గా లోకల్ స్టార్ జట్టులు గెలుపొందారు గెలుపొందిన జట్లకు సోమవారం మెడికల్ షాప్ అసోసియేషన్ నాయకులు పాపిశెట్టి రాము బహుమతులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలలో గెలుపు ఓటములు సహజమని గెలిచిన వారిని చూసి ఓడిపోయిన వారు మెళకులు నేర్చుకొని మళ్లి గెలుపొందే ప్రయత్నం చేయాలని సూచించారు. ఆటలతో దేహదారుఢ్యంతో పాటు మంచి పద్ధతులు అలవడతాయని అన్నారు. క్రీడల వల్ల ఎంతో రాణించవచ్చని జీవితంలో క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు వస్తుందని రాము తెలిపారు. ఈ కార్యక్రమంలో వాలీబాల్ సీనియర్ కోచ్ మనోహర్ రెడ్డి, నిర్వాహకులు లండం జగన్, పవన్ కళ్యాణ్, ఒగ్గు మహేష్, ఎనుముల రమేష్, కోరే మహేందర్ ఆర్గనైజర్లు గోరటి దేవేందర్, కోరే రవి, సురేష్, చాంద్ పాషా, గౌస్, భరత్, మల్లేష్, వెంకట్, తదితరులున్నారు.

రుద్రగోని నర్సింగ్ గౌడ్‌ను పరామర్శించిన కార్పొరేటర్ శ్రీదేవి

విశాలాంధ్ర - కాప్రా : చర్లపల్లి డివిజన్ కంటెస్టెంట్ కార్పొరేటర్ రామచందర్ గౌడ్ కాప్రా ప్రెస్ క్లబ్ కోశాధికారి సీనియర్ జర్నలిస్ట్ రుద్రగోని నర్సింగ్ గౌడ్ మాతృమూర్తి లక్ష్మి నరసమ్మ ఆదివారం మృతి చెందిన విషయం తెలుసుకున్న చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పరామర్శించారు. ఇందులో రుద్రగోని వెంకటేష్ గౌడ్ ఎంసీపీ డైరెక్టర్ నాగిల్ల బాల్ రెడ్డి సీనియర్ నాయకులు శ్రీకాంత్ యాదవ్ ఎస్ రాజు గౌడ్ భాను తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంలో డివిజన్‌ను ఆదర్శంగా నిలుపుతా

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : సంక్షేమంలో డివిజన్‌ను ఆదర్శంగా నిలుపుతానని కార్పొరేటర్ ఆగంరాజు ముదిరాజ్ పేర్కొన్నారు. సోమవారం నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లి 17వ డివిజన్ నందు కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్ సాయికృష్ణజా హిల్స్ కాలనీలో ప్లాట్ నెం.35 నుండి 93 వరకు నూతన సిసి రోడ్డు పనులను ఆయన చేతుల మీదగా కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఆగంరాజు మాట్లాడుతూ డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఇప్పటికే పూర్తి చేశామని, ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో రాంబాబు, చంద్రశేఖర్ లక్ష్మీనారాయణ, కాలనీవాసులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర - హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ నియోజకవర్గ పాస్టర్స్ పెలోషిఫ్ నూతన కమిటీని సోమవారం హుజూర్‌నగర్‌లో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా పాస్టర్ దేవసహాయం, వర్కింగ్ ప్రెసిడెంట్ మనోజ్ కుమార్, కరుణాకర్ రెడ్డిలు, ఉపాధ్యక్షులు పోలకట్ల ధర్మయ్య, ప్రధాన కార్యదర్శి పాతకోటి దేవదానం, బత్తుల జ్యోయల్, సహయ కార్యదర్శిగా జాషువా నాయక్, గోపి, కోశాధికారిగా పెదపంగ ఆమోస్, సొలొమోను రాజులు, సలహాదారులు పాస్టర్ శ్యామ్ సుందర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్‌లోని ఏడు మండలాల దైవజనులు 100 మంది పైగా పాల్గొనీ విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఎలక్షన్ కమిటీ సభ్యులు రెవ ఉటుకూరి రాజు, తలకప్పల సుధాకర్, రెవ. కందుకూరి కృపదానం లు పాత రెండు కమిటీలను రద్దు పరచి అందరి ఏకభిప్రాయంతో రెండు కమిటీలను ఒకటిగా చేయడం జరిగిందన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు అన్నేపాక రవికాంత్ డేవిడ్ రాజు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బిషప్ దుర్గం ప్రభాకర్, జిల్లా కార్యదర్శి మాతంగి పీటర్, డా.జిఆర్ అబ్రాహాము, మేడి పౌల్, రెమిడాల రూబెన్, బొక్క ఏలీయా రాజు, యెషయా, జలగం జేమ్స్ ఏర్పుల క్రిస్టోఫర్, జాన్ ప్రకాష్ పాపగంటి హనోక్ పీటర్, ప్రధాన కార్యదర్శి పాతకోటి జాషువా, నేరేడుచర్ల మండల అధ్యక్షులు ఆర్. దానియేలు, రెవ తలకప్పల దయాకర్, పొనుగోడు పౌల్, మీసాల జేమ్స్, ముండ్ల జాకబ్, దేవా బిక్షం పాల్గొన్నారు.

కేసీఆర్ పాలన ఐఫోన్ లా ఉంటే...

రేవంత్ రెడ్డి పాలన చైనా ఫోన్‌లా ఉంది : కవిత

విశాలాంధ్ర - హైదరాబాద్ : కేసీఆర్ పాలన ఐఫోన్ లా ఉంటే రేవంత్ రెడ్డి పాలన చైనా ఫోన్ లా ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎద్దేవా చేశారు. ఐఫోన్‌కు, చైనా ఫోన్ కు ఎంత తేడా ఉంటదో, కేసీఆర్‌కు, రేవంత్ రెడ్డికి అంత తేడా ఉందని, చైనా ఫోన్ చూడదానికే బాగుంటుంది కానీ సరిగ్గా పనిచేయదని చెప్పారు. సోమవారం జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు. మాయ మాటలు చెప్పి బీసీల ఓట్లు వేయించుకొని సీఎం రేవంత్ రెడ్డి బూరడి కొట్టించారని ధ్వజమెత్తారు. తప్పుడు జనాభా లెక్కలు చెప్పడంతో బీసీ సమాజం అట్టుడుకుతోందని, సీఎం రేవంత్ రెడ్డి వెంటనే బీసీ కుల సంఘాలతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీసీల జనాభా 52 శాతం ఉందని 2014లోనే కేసీఆర్ చేపట్టిన సర్వేలో తేలిందని, కానీ లెక్కపెట్టడం కూడా రాని రేవంత్ రెడ్డి సర్కారు తప్పుడు లెక్కలు చెబుతోందని అన్నారు. బీసీల సంఖ్యను తక్కువ చూపించడం శోచనీయమని స్పష్టం చేశారు. ఈ తప్పుడు లెక్కలు చెప్పి రాహుల్ గాంధీ పార్లమెంటును తప్పుదోవపట్టించారని మండిపడ్డారు. తూతూమంత్రంగా మంత్రి పొన్నం ప్రభాకర్ బీసీ సంఘాలతో సమావేశం పెట్టారని, స్వయంగా ముఖ్యమంత్రి ఎందుకు సమావేశమవ్వడం లేదు ? అని అడిగారు. బీసీ ఉద్యమం చేస్తున్న నాయకులతో ముఖ్యమంత్రి మాట్లాడకపోవడం బీసీలను అవమానించడమేనని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే వరకు ఉద్యమం ఆగదని హెచ్చరించారు. మరో తెలంగాణ పోరాటం తరహా పోరాటానికి బీసీలంతా సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్సీ కవిత పిలుపునిచ్చారు. 420 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను వంచించిందని మండిపడ్డారు. ఎండిపోయిన పొలాలను చూపిస్తూ రైతులు బాధపడుతున్నారని, ఎండిన పంటపొలాలను చూస్తుంటే కన్నీళ్లు వచ్చే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ పై అక్కసుతో మేడిగడ్డ ప్రాజెక్టును వినియోగించడం లేదని, రైతులను నీళ్లించే తెలివి లేదు కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. రాజకీయ కక్షను పక్కనపెట్టి సీఎం రేవంత్ రెడ్డి కాళేశ్వరం నీళ్లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

గ్రామాభివృధికి నిధులు మంజూరు

విశాలాంధ్ర - అమనగల్లు : కడ్తాల్ మండలం ఎక్వాయిపల్లి గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి 20 లక్షల రూపాయలు, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల కింద సీసీ రోడ్డు 5 లక్షలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం 5 లక్షల రూపాయలు మంజూరైనట్లు గ్రామ కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకుర్ల కరుణాకర్, సుమన్, యాదయ్య గౌడ్, మల్లేష్ గౌడ్, బాబు, రాములు, పెద్దయ్య, రాజు, మధు, శ్రీను, వెంకటేష్, సుంకయ్య, నరేష్, చెన్నయ్య చందు, శివ, మల్లమ్మ, లక్ష్మి, గౌరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్‌కు 10 శాతం నిధులు

- వెనుకబడిన ప్రాంత ప్రాజెక్టులపై దృష్టి
- రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్రాధాన్యతివ్వాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర బడ్జెట్‌లో ఇరిగేషన్ రంగానికి కచ్చితంగా 10 శాతం నిధులు కేటాయించాలని, ఆ నిధుల్లో వెనుకబడిన ప్రాంత ప్రాజెక్టులకు ప్రాధాన్యతిచ్చి ప్రణాళికబద్ధంగా ఖర్చు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఎత్తిపోతల పథకం ఉంటేనే రాయలసీమలో తాగునీరుకు అవకాశముంటుందని, లేకుంటే అత్యంత కరువు పీడిత మండలాలకు నీళ్లే రావని, ఎత్తి పోతల పథకం ఉంటేనే ఆయా గ్రామాలకు తాగునీరు పంపేందుకు అవకాశముంటుందని ఆయన చెప్పారు. విజయవాడ గాంధీనగర్‌లోని హోటల్ ఐలాపురం కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి అధ్యయన కేంద్రం, రాయలసీమ సాగునీటి సాధన సమితి సహకారంతో 'గాలేరు-నగరి, హంద్రీ-నీవా, తెలుగు గంగ, వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంపై చర్చా కార్యక్రమం జరిగింది. రామకృష్ణ మాట్లాడుతూ కృష్ణా, గోదావరి డెల్టా పరిధిలో వందల సంవత్సరాల క్రితమే బ్రిటీష్ వారి హయాంలో వారికి నీళ్లు వచ్చాయన్నారు. దానివల్ల ఆయా ప్రాంత ప్రజలు పంటలు పండించుకోవడం సంతోషకరమని తెలిపారు. ఇదే సమయంలో వెనుకబడిన ప్రాంతాలకు బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఇరిగేషన్ రంగానికి అతి తక్కువగా ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు. నాడు జగన్ ప్రజా సంక్షేమం పేరుతో ప్రజల ఖాతాల్లో డబ్బులు వేస్తున్నామన్న దీమాతో ఈ రంగాన్ని విస్మరించారన్నారు. కూటమి ప్రభుత్వం ఆచరణ సాధ్యంగాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని, ఉన్న డబ్బుతో హామీలు నెరవేర్చాల్సిన అవసరముందని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే ప్రజల నుంచి తిరుగుబాటు మొదలవుతుందని, చివరకు సొంత పార్టీ నేతలే ప్రశ్నించే పరిస్థితి వస్తుందని రామకృష్ణ సూచించారు. ప్రధానంగా ఇరిగేషన్ రంగానికి ఈ కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని, ఆ రంగానికి కేటాయించిన నిధుల్ని ఖర్చు చేసే విషయంలో స్పష్టమైన వైఖరితో ముందుకెళ్లాలని సూచించారు. 1989 ఎన్నికలకు ముందు వెనుకబడిన ప్రాంతానికి అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు హయాంలో హంద్రీ-నీవా, గాలేరు నగరి, వెలిగొండ ప్రాజెక్టులు ప్రకటించారని గుర్తుచేశారు. 1996 మార్చి 11వ తేదీన సీఎం చంద్రబాబు ఆయా ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారని తెలిపారు. దాదాపు 30 ఏళ్లు అవుతున్నప్పటికీ ఒక్క ప్రాజెక్టూ పూర్తికాలేదన్నారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు బడ్జెట్ రూ.20 వేల కోట్లు ఉండేదని, ఇంతకుముందు ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే 2 లక్షల 94 వేల కోట్ల ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని వివరించారు. ఇందులో 10 నుంచి 15 శాతం వరకు ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఖర్చుచేయకుండా, వాటికి ప్రాధాన్యత ఇవ్వకుండా కాలయాపన చేయడం తగదన్నారు. శ్రీకాకుళం జిల్లాలో నాగావళి, వంశధార నుంచి నీళ్లు సముద్రంలోకి వృధాగా పోతాయన్నారు. అక్కడ ప్రాజెక్టుల గురించి అధికార, ప్రతిపక్ష నేతలెవ్వరూ ప్రశ్నించేవారు లేరన్నారు. రూ.900 కోట్లను హంద్రీనీవా లైనింగ్‌కు ఖర్చు చేస్తున్నారని, అసలు ప్రాజెక్టు పూర్తి చేయకుండా ఈ లైనింగ్ హడావుడీ ఎందుకంటూ రామకృష్ణ ప్రశ్నించారు. నాడు ఎన్నికల సమయంలో వైసీపీ, టీడీపీ వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తామని ఆర్భాటంగా హామీ ఇచ్చాయన్నారు. కుప్పానికి 150 క్యూసెక్కుల నీటి తరలింపు కోసం రూ.1000 కోట్లు ఖర్చు చేయడం అర్థరహితమని రామకృష్ణ అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి... కచ్చితంగా బడ్జెట్‌లో ఇరిగేషన్ రంగానికి 10 శాతం నిధులు కేటాయించాలని, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి అధ్యయన కేంద్రం, రాయలసీమ సాగునీటి సాధన సమితి ప్రతినిధులు తుంగా లక్ష్మీనారాయణ, అక్కినేని భవానీ ప్రసాద్, బొజ్జా దశరథ రామిరెడ్డి, రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, రైతు సంఘం నాయకులు వై.కేశవరావు తదితరులు ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఇరిగేషన్ రంగానికి ప్రాధాన్యత ఇవ్వాలని, పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్-తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల వినియోగంపై బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ముందు సమగ్ర వాదనలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వినిపించాలని సమావేశం డిమాండ్ చేసింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2024ను అనుసరించి... ఆమోదించిన హంద్రీ-నీవా, గాలేరు-నగరి, వెలిగొండ, తెలుగుగంగ ప్రాజెక్టుల నిర్మాణంపైనా, రూ.80 వేల కోట్ల అంచనాతో ప్రభుత్వం చేపట్టాల్సిన గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై ప్రతినిధులు చర్చించారు.

జలవనరుల శాఖ మంత్రి రామానాయుడుతో భేటీ

అనంతరం వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడును సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణతోపాటు ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి అధ్యయన కేంద్రం, రాయలసీమ సాగునీటి సాధన సమితి ప్రతినిధుల బృందం కలిసింది. ఈ సందర్భంగా ఇరిగేషన్ సమస్యల్ని, పెండింగ్ ప్రాజెక్టుల్ని ఆయన దృష్టికి తీసుకెళ్లింది. బడ్జెట్‌లో ఇరిగేషన్ రంగానికి 10 శాతం నిధులు కేటాయించేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు తుంగా లక్ష్మీనారాయణ, అక్కినేని భవానీ ప్రసాద్, బొజ్జా దశరథ రామిరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మనోహర్‌నాయుడు తదితరులున్నారు.

డేటా అనుసంధానం వేగవంతం

- శాంతిభద్రతల పరిరక్షణకు విస్తృతంగా సీసీ కెమెరాలు
- వాట్సాప్ గవర్నెన్స్‌లో మరిన్ని సేవలు
- ఆర్టీజీఎస్‌పై సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ప్రభుత్వ శాఖల మధ్య డేటా అనుసంధాన ప్రక్రియ వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో సోమవారం రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్)పై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వ హించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... అన్ని శాఖల మధ్య ఉన్న డేటాను ఆర్టీజీఎస్‌తో అనుసంధానం చేసే పనుల్లో మరింత వేగం పెరగాలని సూచించారు. డేటా మొత్తం ఒక చోటకు చేర్చి డేటాలేక్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా ప్రభుత్వ సేవలు మరింత వేగంగా, మెరుగ్గా అందించేందుకు వీలుంటుందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, డీప్ టెక్నాలజీ లాంటి సాంకేతికతలను ఉపయోగించుకుని డేటాను విశ్లేషించుకుని ఆయా శాఖల పనితీరు మెరుగుపరచడానికి దోహదపడేలా ఆర్టీజీఎస్ సాంకేతిక సహకారం అందించాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలకు సులభంగా సేవలు అందించగలమని, ప్రస్తుతం అందిస్తున్న సేవలతో పాటు అదనంగా ఏం అందించగలమో పరిశీలించాలని ఆదేశించారు. వాట్సాప్ గవర్నెన్స్ వినియోగించేవారికి సాంకేతిక అవరోధాలు లేకుండా చూడాలని సూచించారు. ముఖ్యంగా శాంతి భద్రతల పర్యవేక్షణ, నేరస్థులను పట్టుకోవడంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ తదితర సాంకేతికను ఉపయోగించుకోవాలని, ఇందుకోసం సీసీ కెమెరాలు కీలక పాత్రపోషిస్తాయన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 14,770 సీసీ కెమెరాలు వినియోగంలో ఉన్నాయని, వీటిని ఇంకా పెంచాలన్నారు. నేరం జరిగిన వెంటనే సమీప పోలీసు స్టేషన్ ఉన్నతాధికారికి అలర్ట్ మెసేజ్ వెళ్లి, నేరస్థులు పారిపోకుండా పట్టుకునేందుకు సీసీ కెమెరాలు సహాయపడేలా రూపకల్పన చేయాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే రౌడీషీటర్లపైన కూడా ముందుగానే నిఘా పెట్టి, నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్టీజీఎస్ సీఈఓ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ ఆర్టీజీఎస్ చేపడుతున్న వివిధ కార్యక్రమాలు ఏఏ దశల్లో ఉన్నాయో ముఖ్యమంత్రికి వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను విస్తృతంగా వినియోగించుకోవడానికి గూగుల్ సంస్థ సహకారం అందిస్తోందని చెప్పారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్త, సీఎం కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న, సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు హిమాంశు శుక్లా, జీఎస్ డబ్ల్యూ డైరెక్టర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర బుక్‌షాప్‌పై దాడి...
నిందితులపై కేసు

విశాలాంధ్ర -తిరుపతి: విశాలాంధ్ర బుక్‌హౌస్‌పై దాడి చేసిన మతోన్మాదులు జన్ కిరణ్ కుమార్, సురేశ్ నాయక్, రమేశ్‌బాబు, మరో 10 మందిపై అలిపిరి పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తిరుపతి వేదికల సమాఖ్య తరపున పట్టణంలోని మేధావులు, ప్రజాసంఘాల నాయకులు జిల్లా ఎస్పీని కలిసి పుస్తకాలయాలపై జరుగుతున్న దాడులు గురించి, తిరుపతి నగరం కేంద్రంగా కొనసాగుతున్న అసత్య ప్రచారాల గురించి వివరించారు. తిరుపతిలో జరిగిన అసత్య ప్రచారాల ఘటనలను, పుస్తకాలపై జరిగిన దాడి వీడియోలను ఎస్పీ సావధానంగా తిలకించి... సున్నితమైన తిరుపతిలో ఇటువంటి చర్యలను సహించబోమని అప్పటికప్పుడు కేసు నమోదు చేయాలని తిరుపతి తూర్పు డీఎస్పీకి ఆదేశాలిచ్చారు. తిరుపతిలో జరిగిన ఘటనలను ఐక్యవేదిక నాయకులు వివరించారు.

విశాలాంధ్ర బుక్‌హౌస్ సిబ్బంది సి.శంకరయ్యను విచారించి కేసు నమోదు చేశారు. సమస్యపై చొరవ తీసుకొని వెంటనే స్పందించిన ఎస్పీకి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ తిరుపతి నగరాన్ని ప్రశాంతంగా ఉంచడం కోసం ఎస్పీ చేస్తున్న కృషికి ధన్యవాదాలు తెలిపారు. 'పుస్తకాన్ని బతికించు కుందాం... ప్రజాస్వామ్యాన్ని కాపాడు కుందాం' నినాదంతో మంగళవారం జరిగే ప్రదర్శనకు ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఐక్యవేదిక నాయకులు పి.అంజయ్య, రాఘవ, వాకా ప్రసాద్, పరమేశ్వర్, ఓ.వెంకటరమణ, అజీమ్ భాష, రామా నాయుడు, వందవాసి నాగరాజు, విశ్వనాథం, హరీష్, సాయిలక్ష్మి, హేమలత, జయంతి, కె.వెంకటాద్రి పాల్గొన్నారు.

కర్ర అక్రమ రవాణా అరికట్టండి
మంత్రి అచ్చెన్నాయుడుకు రైతు సంఘం లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పల్నాడు డివిజన్‌లో వన సంరక్షణ సమితుల అధ్వర్యంలో రైతులు సాగుచేసిన యూకలిప్టస్ కర్రను అనధికారికంగా నరికి, అక్రమ రవాణా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, సామాజిక వన రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి వి.హనుమారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వినుకొండ, పిడుగురాళ్ల, మాచర్ల అటవీ ప్రాంతంలో 218 వన సంరక్షణ సమితుల అధ్వర్యంలో పెంచిన 50935.28 మెట్రిక్ టన్నుల యూకలిప్టస్ కర్రను అనధికారికంగా నరుకుతూ, అక్రమంగా కంపెనీలకు తరలిస్తున్నారంటూ వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడుకు సోమవారం సంఘం నేతలు లేఖ రాశారు. కర్రను 2024 నవంబరులోనే వేలం వేశారన్నారు. ప్రస్తుతం కర్ర నరుకుడు ప్రక్రియను వ్యాపారులు ప్రారంభించారని, టెండర్‌లో సూచించిన కర్రతోపాటు అనుమతివ్వని కర్రను నరికి పేపరు కంపెనీలకు తరలిస్తున్నట్లు తెలిపారు. గత సంవత్సరం నెల్లూరు జిల్లా అటవీశాఖ పరిధిలోని జామాయిల్ కర్రను అతి తక్కువ వేలానికి పెట్టారన్నారు. టెండరు దక్కించుకున్న వ్యాపారులు గత ప్రభుత్వ హయాంలో ఉన్న అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులు కావడంతో ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. అనధికారికంగా కర్ర కంపెనీలకు చేరడంతో యాజమాన్యాలు...రైతులకు చెల్లించే ధరలో సుబాబుల్ టన్ను రూ.700, జామాయిల్ రూ.500కు తగ్గించి కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సామాజిక వనాలు పెంచే ప్రతి రైతు ఎకరాకు రూ.20వేల నుంచి రూ.25వేల వరకు నష్టపోతున్నారని వివరించారు. ఇతర దేశాల నుంచి పల్ప్ (పేపర్ గుజ్జు) దిగుమతి చేసుకుంటూ, రైతులకు ధరలో కోత విధిస్తున్నారన్నారు. మార్కెట్ కమిటీల ద్వారానే కర్ర అమ్మకాలు, కొనుగోలు చేపట్టాలని, నగదు చెల్లింపులు, మార్కెట్ కమిటీల ద్వారానే నిర్వహించా లన్నారు. సాగు అధికంగా ఉన్న ప్రకాశం జిల్లాల్లో పేపర్ మిల్లు ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేయాలని పేర్కొన్నారు.

ఘనంగా సౌత్ జోన్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

విశాలాంధ్ర-మంగళగిరి: గుంటూరు జిల్లా మంగళగిరి ఏసీఏ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఐఏ అండ్ ఏడీ సౌత్ జోన్ క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న జట్టు సభ్యులు దాదాపు 80 మంది స్టేడియానికి చేరుకున్నారు. ఉదయం 9 గంటలకు ఆడిట్ జనరల్ కార్యాలయం సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ భాస్కర్ కల్లూరు, కిషోర్ రెడ్డి, ఆర్.శ్యామ్, రాకేశ్ నాయక్, ఎన్.నిఖిల్ జెండా ఊపి టోర్నమెంట్ ప్రారంభించారు. అనంతరం భాస్కర్ మాట్లాడుతూ నిరంతరం పనిలో నిమగ్నమై ఉండే ఉద్యోగులకు ఈ పోటీలు ఆటవిడుపుగా ఉంటాయన్నారు. విజయవాడలోని ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ కార్యాలయం నేతృత్వంలో సౌత్ జోన్ క్రికెట్ టోర్నమెంట్ తొలిసారి నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గెలుపోటములు సహజమని, ప్రతిఒక్కరూ క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలని కోరారు. ఈ పోటీల్లో ప్రతిభచూపిన క్రీడాకారులకు రంజీ, ఐపీఎల్ వంటి టోర్నీల్లో పాల్గొనే అవకాశం దక్కుతుందన్నారు.

కేరళ, తమిళనాడు జట్ల గెలుపు

తొలిరోజు ఆంధ్రప్రదేశ్-తెలంగాణ, కేరళ జట్ల మధ్య పోటీ జరిగింది. టాస్ గెలిచిన కేరళ జట్టు మొదట బౌలింగ్ ఎంచుకుంది. ఆంధ్రప్రదేశ్-తెలంగాణ జట్టు నిర్దేశిత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 96 పరుగులు చేసింది. రవితేజ 40, యష్ కొటారి 26 పరుగులు చేశారు. కేరళ బౌలర్ అంకిత్ మిశ్రా నాలుగు ఓవర్లలో 17 పరుగులు ఇచ్చి నాలుగు వికెట్లు తీశాడు. కార్తికేయ 11 పరుగులు ఇచ్చి ఒక వికెట్ తీశాడు. 97 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కి దిగిన కేరళ జట్టు కేవలం 18.3 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 100 పరుగులు చేశారు. కేరళ జట్టులో మహమ్మద్ షన్ను 49 బంతులలో 43 పరుగులు, శాలీ శ్యామ్సన్ 25 పరుగులు చేశారు. ఆంధ్రా-తెలంగాణ జట్టుకు చెందిన రవితేజ తొమ్మిది పరుగులిచ్చి ఒక వికెట్ , సన్నీ 15 పరుగులు ఇచ్చి ఒక వికెట్ తీశారు. సాయంత్రం రెండో మ్యాచ్ తమిళనాడు-కర్నాటక జట్ల మధ్య ఆద్యంతం ఉత్కంఠంగా సాగింది. చివరికి కర్నాటకపై తమిళనాడు జట్టు మూడు వికెట్ల తేడాతో నెగ్గింది. తొలుత తమిళనాడు జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. కర్నాటక జట్టు 20 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 169 పరుగులు చేసింది. హెచ్.అర్జున్ 47 పరుగులతో అజేయంగా నిలవగా శరత్ బీఆర్ 23 బంతుల్లో ఆరు ఫోర్లు, ఒక సిక్స్‌తో 40 పరుగులు చేశాడు. కెప్టెన్ జె.సుచిత్ 16 బంతుల్లో రెండు సిక్స్‌లు, రెండు ఫోర్లతో 31 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచారు. తమిళనాడు బౌలర్లు విఘ్నేష్, అశ్విన్ బాలాజీ, పాండియా రాజ్ ఒక్కో వికెట్ తీశారు. తమిళనాడు జట్టు 170 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించి చివరి ఓవర్ చివరి బంతి వరకు ఉత్కంఠంగా సాగిన పోరులో గెలిచింది. ఆఖరి ఓవర్‌లో ఆరు బంతులకు 8 పరుగులు చేయాల్సి ఉండగా ఐదు బంతుల్లో ఏడు పరుగులు చేసి మ్యాచ్‌ను టై చేశారు. చివరి బాల్‌ను బాట్స్‌మెన్ ఎంతో చాకచక్యంగా బైస్ రన్ తీయటంతో మ్యాచ్ గెలుపొందారు. తమిళనాడు జట్టులో వేదాంత్ భరద్వాజ్ 57 బంతుల్లో ఏడు ఫోర్లు, నాలుగు సిక్స్‌లతో 83 పరుగులు చేసి మ్యాచ్‌ను విజయతీరాలకు చేర్చాడు. విఘ్నేష్ 27 పరుగులు చేసి మ్యాచ్‌కు వెన్నుదన్నుగా నిలిచారు. కర్నాటక బౌలర్లు దర్శన్ 13 పరుగులిచ్చి రెండు వికెట్లు పడగొట్టగా... జై 31 పరుగులిచ్చి రెండు వికెట్లు తీశాడు. మ్యాచ్‌లను రెండు సెషన్లుగా... ఉదయం, మధ్యాహ్నం నిర్వహిస్తున్నారు.

నేటి మ్యాచ్‌లు

ఆంధ్ర, తెలంగాణ-తమిళనాడు జట్ల మధ్య మంగళవారం ఉదయం 9 గంటలకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి కేరళ-కర్నాటక జట్ల మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి. ఆంధ్రప్రదేశ్ తరపున జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో ప్రాతినిధ్యం వహించి అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన నీలం మణి శ్రావణిని నిర్వాహకులు అభినంధించి బహుమతి అందజేశారు. గతంలో కామన్ వెల్త్ పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్ సర్టిఫికెట్ పొందడమే గాక ఆక్లాండ్‌లో జరిగిన 84 ప్లస్ కేజీల ఈక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ క్లాస్ సబ్ జూనియర్ కోటాలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన శ్రావణి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఇప్పటికే పదుల సంఖ్యలో బహుమానాలు, ప్రశంసలు అందుకుంది.

ఓబులేసుకు సాదర స్వాగతం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అనారోగ్యం కారణంగా మూడు నెలలుగా విశ్రాంతిలో ఉన్న ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు సోమవారం విజయవాడ దాసరి భవన్‌కు విచ్చేశారు. ఈ సందర్భంగా ఓబులేసుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఏఐటీయూసీ నాయకులు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. రామకృష్ణ మాట్లాడుతూ... ఓబులేసు బ్రెయిన్ ట్యూమర్ ఆపరేషన్ చేయించుకుని సంపూర్ణ ఆరోగ్యంగా తిరిగి రావడం పార్టీ వర్గాల్లో ఆనందం కలగజేసిందన్నారు. భవిష్యత్తులో కూడా ఆయన ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఏఐటీయూసీ గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ... నవంబర్ 26 తేదీ కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా ఆందోళనలో పాల్గొన్న ఓబులేసు ఉన్నపళంగా అస్వస్థతకు గురై హైదరాబాదు అపోలో చేరారని తెలిపారు. తదుపరి చెన్నై ప్రోటాన్ అపోలో ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేయించుకుని ఆరోగ్యంగా విజయవాడకు చేరుకోవడం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రామారావు, ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య, రాష్ట్ర కోశాధికారి బీవీ కొండలరావు, ఏఐటీయూసీ నాయకులు చల్లా చినాంజనేయులు, సాంబశివరావు, కేఆర్ ఆంజనేయులు, అంజిబాబు, సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, కృష్ణాజిల్లా కార్యదర్శి టి.తాతయ్య, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీసీ ఆదిత్యకు ఉత్తమ నటుడి అవార్డు

విశాలాంధ్ర-హైదరాబాద్: అంతర్జాతీయ చలనచిత్ర ఉత్సవం (హైదరాబాద్)లో భాగంగా సినిమా, టీవీ రంగాలలో పేరెన్నికగన్న విలక్షణ దర్శకుడు, నిత్య ప్రయోగశీలి డాక్టర్ పీసీ ఆదిత్యకు ఉత్తమ నటుడు అవార్డు సోమవారం ప్రదానం చేశారు. వంశీ టీవీ, మోర్దు సంస్థల అధ్వర్యంలో జరిగినఈ అవార్డుల ప్రదానోత్సవానికి ప్రముఖ సినీ దర్శకులు రేలంగి నరసింహారావు, కేంద్ర మాజీ మంత్రి ఎస్. వేణుగోపాలచారి, ప్రముఖ కాంగ్రెస్ నేత ఉప్పల శ్రీనివాస్ గుప్త, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ శ్రీనివాస్ హాజరయ్యారు. లఘు చిత్రం వంతులో ఆదిత్య అసమాన నటన ప్రతిభను గుర్తించి ఉత్తమ నటుడి అవార్డును ప్రదానం చేశారు. ఆదిత్య శిష్యుడు డాక్టర్ రావుల మోహన్ రెడ్డి దర్శకనిర్మాతగా వంతు లఘుచిత్రం నిర్మించారు. ఇప్పటికే ఈ చిత్రం అనేక అంతర్జాతీయ చలనచిత్ర ఉత్సవాల్లో అవార్డులు సాధించి గుర్తింపు పొందింది. కొడుకుల చేతుల్లో మోసపోయిన తండ్రి పాత్ర లో డాక్టర్ పీసీ ఆదిత్య అద్భుత నటనను ప్రదర్శించారు. ఆదిత్య స్పందిస్తూ అలుపెరిగిన తన సినీ ప్రయాణంలో నిరంతరం పలు ప్రయోగాలు చేస్తూ ఎందరో నూతన నటీనటులకు, సాంకేతిక నిపుణులకు అవకాశాలు ఇస్తున్నానని, ఇది తనకు లభించిన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు.

దానియేలు, మస్తాన్ త్యాగాలు స్ఫూర్తిదాయకం
వర్ధంతి సభలో జల్లి విల్సన్ నివాళి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: అమరవీరులను స్మరించుకోవటమంటే...వారి త్యాగాలను గుర్తుచేసుకోవడమేనని మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్ అన్నారు. అమరవీరులు బొంతా దానియేలు, బొంతా మస్తాన్ వర్ధంతి చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామంలో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామంలోని లెనిన్ చౌక్ వద్ద సీపీఐ జెండాను ఆవిష్కరించారు. అమరవీరుల సమాధులకు నాయకులు నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభకు సీపీఐ ఏరియా ఇంచార్జి కార్యదర్శి తాళ్లూరి బాబురావు అధ్యక్షత వహించారు. జల్లి విల్సన్ మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, పేదల విముక్తి కోసం అశువులు బాసిన బొంతా దానియేలు, బొంతా మస్తాన్ త్యాగం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కమ్యూనిస్టులకు కాలం చెల్లిందనే అపోహతో చాలామంది ఉన్నారని, స్వాతంత్ర్య పోరాటం నుంచి నేటి వరకు దేశంలో జరిగిన అనేక సంస్కరణలకు కమ్యూనిస్టుల త్యాగాలే కారణమని ఆయన వివరించారు. ప్రజల కోసం జీవించిన వారు చరిత్రలో నిలిచిపోతారని, అలాంటి వారే దానియేలు, మస్తాన్ అని నివాళి అర్పించారు. దేశంలో ప్రజోపయోగ సంస్కరణలకు, సంక్షేమ పథకాల అమలు వెనుక కమ్యూనిస్టుల పోరాటం, త్యాగం దాగి ఉంటుందని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ, ఎర్రజెండా ప్రజల హృదయాల్లో ఎప్పటికీ నిలిచే ఉంటాయన్నారు. మోదీ ప్రభుత్వం కులాలు, మతాల మధ్య అగ్గి రాజేస్తోందని, దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జల్లి విల్సన్ హెచ్చరించారు. బీజేపీ ప్రభుత్వ నిరంకుశ విధానాలను సీపీఐ నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలతో స్ఫూర్తి పొందాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో ఉంటూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. దేశం కోసం, దేశ భవిష్యత్తు కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ హుస్సేన్, కాసా రాంబాబు, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ సుభాని, నాయకులు బొంతా ధనరాజ్, కందిమళ్ల వెంకటేశ్వర్లు, బొంతా భగత్ సింగ్, మూసబోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మా ఆదేశాలు బేఖాతరా?
రాష్ట్ర ప్రభుత్వాలపై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ: ప్రజా ప్రతినిధుల కేసుల విచారణ వేగవంతంపై సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జరిగింది. సుప్రీంకోర్టు ఆదేశాలను బేఖాతరు చేయడంపై రాష్ట్ర ప్రభుత్వాలపై సుప్రీం ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. కొన్ని రాష్ట్రాలలో ఇంకా ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయకపోవడంపైనా అసహనం వెలిబుచ్చింది. కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌కు నోటీసులు జారీ చేసిన సుప్రీం కోర్టు... తదుపరి విచారణను మార్చి4కు వాయిదా వేసింది. సుప్రీంకోర్టులో దాఖలైన ప్రజా ప్రయోజన వాజ్యాన్ని అనుమతించి సుప్రీం కోర్టు విచారణ చేపట్టింది. జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్ ధర్మాసనం విచారణ చేసింది. అమికస్‌క్యూరీ విజయ్ అన్సారియా దాఖలు చేసిన స్టేటస్ నివేదికను ధర్మాసనం పరిశీలించింది. తన నివేదికలో పేర్కొన్న అనేక విషయాలను కోర్టుకు అమికస్ క్యూరీ నివేదించింది. '42 మంది ప్రస్తుత లోక్‌సభ ఎంపీలపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. కొన్నిచోట్ల 30 ఏళ్ల నుంచి ప్రజా ప్రతినిధులపై క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. దేశంలో చాలా రాష్ట్రాల్లో ప్రజాప్రతినిధుల కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులు ఇప్పటికీ లేవు. మిగిలిన కేసులతో కలిపి విచారణ చేస్తున్నారు. కనీస ప్రాధాన్యత కూడా ఇవ్వడం లేదు. దేశంలో ప్రజా ప్రతినిధుల కేసులు పెండింగ్‌లో ఉండటానికి ప్రత్యేకంగా విచారించే కోర్టులు లేకపోవడం ఒకటి. నిందితులుగా ఉన్న వారు ఏళ్ల తరబడి కోర్టుల్లో విచారణకు హాజరుకావడం లేదు.. ఇది మరో కారణం. సాక్షులకు ఏళ్ల తరబడి సమన్లు జారీ చేయడం లేదు. దేశంలో దాదాపు అన్ని చోట్ల ఇదే పరిస్థితి ఉంది. ఢిల్లీ లాంటి చోట్ల ప్రత్యేక కోర్టులు ఈ కేసులు విచారిస్తున్నా... చాలా రాష్ట్రాల్లో పరిస్థితి భిన్నంగా ఉంది' అని అమికస్‌క్యూరీ తెలిపారు. ఈ కేసుల వివరాలపై హైకోర్టులను నివేదిక కోరినా... సరిగా స్పందించకపోవడంతో అందుబాటులోకి వచ్చిన వివరాలతో నివేదిక అందించినట్లు అమికస్‌క్యూరీ పేర్కొన్నారు. క్రిమినల్ కేసులు ఉంటే 4వ తరగతి ఉద్యోగిగా అనర్హులు అవుతారని, కానీ ప్రజా ప్రతినిధులుగా ఎలా అని ధర్మాసనం ప్రశ్నించింది. చాలామంది ప్రజాప్రతినిధులపై డ్రగ్స్, ఆహార కల్తీ, కిడ్నాప్ కేసులు ఉన్నాయని పిటిషనర్ తరపు న్యాయవాది వికాస్ సింగ్ కోర్టుకు చెప్పారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.